
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 130

గురువారం 23-1-2025

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆరంభం అదిరింది

తొలి టీ20లో ఇంగ్లండ్‌పై ఏడు వికెట్ల తేడాతో భారత్ విజయం - 12లో



వేతనజీవులను కనికరించేనా?

బడ్జెట్–2025పై మధ్య తరగతి, వేతన వర్గాల ఎన్నో ఆశలు.. -13లో



చర్చలకు రాకపోతే ఆంక్షలే

పుతిన్‌తో చర్చలకు సిద్ధమని అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. చర్చలకు రాకుంటే ఆంక్షలు తప్పవని హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



బీజేపీకి జేడీ(యూ) ఝలక్

బీజేపీకి మిత్రపక్షమైన జేడీ(యూ) మణిపూర్‌లో ఆ పార్టీకి షాక్ ఇచ్చింది. బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది.

వివరాలు 6లో ▸



జెనిన్‌లో భారీ ఆపరేషన్

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్ దళాలు జరిపిన భారీ ఆపరేషన్‌లో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించారు.

వివరాలు 6లో ▸



గగన్‌యాన్ మిషన్‌లో పురోగతి

గగన్‌యాన్–1 మిషన్‌లో భాగంగా లిక్విడ్ ప్రొపెల్షన్ సిస్టమ్‌ను క్రూ మాడ్యూల్‌తో ఇస్రో విజయవంతంగా అనుసంధానించింది.

వివరాలు 6లో ▸



మ్యాథ్స్‌లో కొంత క్లిష్టత..

ఫిజిక్స్ సులభం

జేఈఈ–మెయిన్ తొలిరోజు పరీక్షలపై నిపుణుల విశ్లేషణ

సుదీర్ఘంగా మ్యాథ్స్ ప్రశ్నలు.. రెండు సెషన్లలోనూ ఇదే తీరు

కెమిస్ట్రీలో కొన్ని సులభం.. కొన్ని ఓ మోస్తరు క్లిష్టత

గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు

కెమిస్ట్రీలో ఎక్కువ ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే..

మ్యాథ్స్‌లో సమాధానాలు ఇవ్వడానికి సరిపోని సమయం

- వివరాలు 14లో

బాబు కక్ష ఖరీదు..

రూ.3 లక్షల కోట్లు!

భారీగా పెట్టుబడుల అవకాశాన్ని కోల్పోయిన ఏపీ

రెడ్‌బుక్ రాజ్యాంగం, ప్రముఖ పారిశ్రామికవేత్తపై వేధింపులకు చెల్లించిన మూల్యం

వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండి

ఏపీలో పెట్టుబడులకు జేఎస్‌డబ్ల్యూ గ్రూపు విముఖత

మహారాష్ట్రలో జిందాల్ రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు

గడ్చిరోలి, నాగ్‌పూర్‌లో ఉక్కు, సోలార్, ఆటోమొబైల్, సిమెంట్ పరిశ్రమలు

చైనా సంస్థతో కలసి ఈవీలు, బ్యాటరీ తయారీ పరిశ్రమల ఏర్పాటు

తెలంగాణలో రూ.800 కోట్లతో జిందాల్ డ్రోన్ టెక్నాలజీ యూనిట్

దావోస్ వేదికగా బహిర్గతమైన కూటమి సర్కారు నిర్వాకాలు



సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు బరితెగించి అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర విఘాతంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ అంటేనే హడలెత్తిపోతున్నారు. పెట్టుబడులు కాదు కదా కనీసం ఇటువైపు చూసేందుకు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఈ కక్ష సాధింపు దుష్పరిణామాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన పారిశ్రామిక సంస్థ జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ఏపీ అంటేనే ముఖం చాటేయడం దీనికి తాజా తార్కాణం. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్న ఆ సంస్థ తాజాగా మన రాష్ట్రాన్ని కాదని.. మహారాష్ట్రలో

మిగతా 5వ పేజీలో ▶

హైకోర్టుకు ఇద్దరు అదనపు జడ్జిలు

హరిహరనాథ శర్మ, లక్ష్మణరావు నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

శుక్రవారం ప్రమాణం చేసే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు నియమితులయ్యారు. వీరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ ఇద్దరి నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి

మిగతా 3వ పేజీలో ▶


హరిహరనాథ శర్మ


లక్ష్మణరావు

తిరుపతి తొక్కిసలాటపై రిటైర్డ్ జడ్జితో

న్యాయ విచారణ

విచారణ కమిషన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సత్యనారాయణ మూర్తి



- టోకెన్ల జారీ ఏర్పాట్లలో లోపాలపై విచారణ జరిపి, బాధ్యులను నిర్ధారించాలి
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు సూచించాలి
- 6 నెలల్లో విచారణ నివేదిక ఇవ్వాలి.. ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్

3లో

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల థీమ్



ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలో ఏటికొప్పాక థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం శకటాన్ని ప్రదర్శించనుంది. శకటం ముందు భాగంలో బొమ్మలు తయారు చేసే కళాకారుడు, గణపతి, వెనుక శ్రీవేంకటేశ్వర స్వామి బొమ్మలను తీర్చిదిద్దారు. గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా డిజైన్ చేశారు.

వివరాలు 3లో ▸

ఎనిమిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యం



బిస్కెట్లు ఆశ చూపించి ఎనిమిదేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి తెగబడ్డాడు. ప్రభుత్వ సచివాలయం భవనంపైకి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.

వివరాలు 14లో ▸

పట్టాలపై మృత్యుఘోష



12 మంది దుర్మరణం

15 మందికి గాయాలు

రైల్లోంచి పట్టాలపైకి దూకి మరో రైలుకు బలి

మంటలంటుకున్నాయన్న వదంతులే కారణం.. మహారాష్ట్రలో మాటలకందని ఘోరం

- వివరాలు 6లో


ఘాటెక్కిన

వెల్లుల్లి

కిలో రూ.450తో వినియోగదారులు బెంబేలు

- పదేళ్ల తర్వాత ఇంత ధర చూస్తున్నామంటున్న వ్యాపారస్తులు
- తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తగ్గిన దిగుమతి

5లో



ఇక నుంచి 60 శాతం విద్యాబోధన ప్రయోగశాలల్లోనే

- 6వ డీన్స్ కమిటీ సిఫార్సుల అమలుతో మారనున్న బోధనా పద్ధతులు
- తొలి రెండేళ్లు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత
- నాలుగేళ్లలో 10 ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకునే అవకాశం
- ఏదైనా కారణంతో కోర్సు పూర్తి చేయలేకపోతే.. తొలి రెండేళ్లకు డిప్లొమా సర్టిఫికెట్
- మిగిలిన కోర్సును ఎప్పుడైనా పూర్తిచేసే అవకాశం
- 6వ డీన్స్ కమిటీ సిఫార్సులు సంపూర్ణంగా అమలు చేసిన తొలి వర్సిటీ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం

3లో



నెత్తురోడిన కర్ణాటక రోడ్లు

ఏపీకి చెందిన ముగ్గురు వేద విద్యార్థులు సహా 14 మంది దుర్మరణం

మరో 25 మందికి గాయాలు

- జాతీయ రహదారి 63పై కూరగాయల లారీ బోల్తా.. కూరగాయలు, పండ్ల కింద నలిగి 10 మంది మృత్యువాత
- 15 మందికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం.. రాయచూరు–సింధనూరు రహదారిపై క్రూసర్ వాహనం బోల్తా
- మంత్రాలయం వేద పాఠశాల విద్యార్థులు ముగ్గురు, డ్రైవర్ మృతి.. 10 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

5లో


ప్రమాదంలో ధ్వంసమైన లారీ


ద్వారకా తిరుమలరావు


హరీశ్‌కుమార్ గుప్తా


రవిశంకర్ అయ్యన్నార్

డీజీపీ పోస్టు కోసం మూడు ముక్కలాట!

అక్రమ కేసులతో ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే ఎత్తుగడ


14లో

మంత్రి లోకేశ్ అండతో ఉత్తరాది లాబీ హల్‌చల్

పోలీసు శాఖపై దీర్ఘకాలిక పట్టుకు ఎత్తు

ఆధిపత్య పోరుతో గాడి తప్పుతున్న వైనం

విశాఖలో గూగుల్ చిప్ డిజైన్ కేంద్రం పెట్టండి



- గూగుల్ క్లౌడ్ సీఈవోకు చంద్రబాబు వినతి
- మూలపేటలో పెట్టుబడులకు పెట్రోనాస్ సంస్థకు ఆహ్వానం
- రాష్ట్రంలో డీపీ స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేయండి
- విశాఖలో గ్లోబల్ డెలివరీ సెంటర్ పెట్టాలని పెప్సికోకు వినతి
- దావోస్‌లో పలు కంపెనీల అధినేతలతో సీఎం భేటీ

3లో

జూన్.. నో మావోయిస్టు జోన్

ఆపరేషన్ కగార్... లక్ష్యం జూన్.. దండకారణ్యంపై భద్రతా దళాల పట్టు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత ప్రక్రియ ముమ్మరమైంది. నిర్దేశించుకున్న గడువు 2026 మార్చి కంటే ముందే ఆపరేషన్‌ను ముగించేందుకు రంగం సిద్ధమైంది. మావోయిస్టులను తుదముట్టించేందుకు మరింత పట్టుదలతో భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర అడవులను చుట్టుముడుతున్నాయి. ఒక వైపు దండకారణ్యం, అబూజ్‌మడ్, ఏవోబీ, గడ్చిరోలి అడవులను చుట్టేస్తూ.. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.


అంత సురక్షితం కాదు..

బస్తర్ అడవుల్లోని నారాయణపూర్, దంతేవాడ, బీజాపూర్‌తో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సరిహద్దుగా ఉన్న అబూజ్‌మడ్ అటవీ ప్రాంతం రెండు దశాబ్దాలుగా మావోయిస్టుల అడ్డాగా నిలుస్తోంది. అయితే, 2014 అక్టోబర్ 4న అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో.. ఆ పార్టీ ఏకంగా 38 మందిని కోల్పోయింది. దీంతో అబూజ్‌మడ్ అంత రక్షిత ప్రాంతం కాదనే అభిప్రాయం నెలకొంది. ఆపై బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల్లో విస్తరించిన దండకారణ్యం.. మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉంటూ వచ్చింది. కానీ గతేడాది ఆరంభంలో గుండం, పువ్వర్తిలో సీఆర్‌పీఎఫ్ శిబిరాల ఏర్పాటుతో దండకారణ్యం కూడా సురక్షితం కాని పరిస్థితి నెలకొంది.

వేసవి ముగిసేలోగా..

ఆపరేషన్ కగార్ మొదలయ్యాక.. గతేడాది ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు

- వేసవి ముగిసేనాటికే మావోయిస్టుల్ని తుడిచిపెట్టేలా వ్యూహాలు
- ఇప్పటికే భద్రతాదళాల వశమైన మావోయిస్టుల శిక్షణ కేంద్రం
- 2026 నాటికి మావోయిస్టులు ఉండరన్న అమిత్‌షా
- మావోయిస్టులకు కేంద్ర స్థానంగా బస్తర్



చనిపోగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 53 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మావోయిస్టులు గడ్డు కాలంగా భావించే వేసవి ముగిసే నాటికి.. మరింత ఉధృతంగా దాడులు చేసి దండకారణ్యం, అబూజ్‌మడ్ అడవులను మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వ బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమాన ఛత్తీస్‌గఢ్‌లోని ఇతర ప్రాంతాల్లోని (మైదాన ప్రాంతాలతో సహా) వివిధ భద్రతా దళాలు, మహారాష్ట్రలోని సీ–60 కమాండోలు, ఒడిశాలోని స్పెషల్ ఆపరేషన్ గ్రూపులను సైతం దండకారణ్యం, అబూజ్‌మడ్ ప్రాంతాలకు రప్పిస్తున్నారు. వేసవికల్లా ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తెచ్చుకుని ఇక్కడ మావోయిస్టులు అమర్చిన పేలుడు పదార్థాలు, బూబీట్రాప్స్, నేలమాళిగలు, శిక్షణ కేంద్రాలు, ఆయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

భద్రతా దళాల చేతుల్లోకి మావోయిస్టుల శిక్షణ కేంద్రం

దండకారణ్యంలోని కొండపల్లి, జీడిపల్లి, కవరుగట్టు ప్రాంతాల్లో గత నెలలో భద్రతా దళాల శిబిరాలు ఏర్పాటయ్యాయి. అక్కడి నుంచి క్రమంగా అడవుల్లోకి చొచ్చుకెళ్తూ.. ఒక్కొక్క ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. ఈ క్రమాన రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పెద్ద బట్టిగూడెం వద్ద మావోయిస్టుల ఆర్మీ శిక్షణ కేంద్రాన్ని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. అయితే, అప్పటికే మావోయిస్టులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. మావోయిస్టు శిక్షణ కేంద్రంలో అగ్రనేత కటకం సుదర్శన్ పేరిట భారీ స్మారక స్తూపం ఉంది. ఇక్కడ శిక్షణకు వచ్చిన మావోయిస్టులు బస చేసేందుకు వీలుగా భారీ షెడ్లను సైతం నిర్మించారు. ఎత్తయిన చెట్లపై సెంట్రీ పాయింట్లను ఏర్పాటు చేసుకుని ఈ ప్రాంతాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చుకున్నారు. ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తెచ్చుకున్న భద్రతా దళాలు కటకం సుదర్శన్ స్తూపాన్ని కూల్చివేశాయి. సమీపంలోని మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్నాయి. నలువైపులా జరుగుతున్న దాడులతో అబూజ్‌మడ్, దండకారణ్యం నుంచి మావోయిస్టులు బయటి ప్రాంతాలకు తరలిపోకుండా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.



మీరెన్ని 'ఫ్రీ'లిచ్చినా.. నా ఓటు మాత్రం 'ఫ్రీ' కాదు.. విలువైనది

Southern™ Travels

Safar happiness ka...

0% EMI Interest Free EMI

Book Your Summer HOLIDAYS



Upto ₹60,000/-* off

Europe

European Discovery*	Glimpse Of Europe	Paris & Swiss Delight
14D/ 13N	11D/ 10N	7D/ 6N
~~₹3,99,880/-~~ ₹3,39,880/-	~~₹2,92,200/-~~ ₹2,54,200/-	~~₹2,32,700/-~~ ₹1,96,700/-
London, Paris, Amsterdam, Brussels, Black Forest, Lucerne, Innsbruck, Venice, Florence, Rome	Paris, Lucerne, Interlaken, Black Forest, Innsbruck, Venice, Florence, Rome	Paris, Lucerne, Interlaken, Zurich, Black Forest

All Inclusive Package | All Meals | Complimentary Bag | *Overnight Cruise / Visit to Mt. Titlis, *Jungfraujoch

Traveller's 1st Choice



Maha Kumbh - Prayagraj Varanasi, Ayodhya: 5D/4N

(Nepal) - Kathmandu Muktinath, Pokhara, Janakpur, Lumbini: 8D/7N

Sri Lanka - Ramayana Trails with Shankari Devi: 6D/5N

Singapore, Malaysia, Thailand with Cruise: 12D/11N

SOUTHERN MAHA DHAMAKA LUCKY DRAW Chance to Win KIA CAR & 25+ Prizes

Cambodia, Angkor Wat & Vietnam: 8D/7N ~~₹1,57,500/-~~ ₹1,31,500/- Cities: Siem Reap, Ho Chi Minh, Halong Bay, Hanoi	**Dubai Abu Dhabi with Ferrari World:** 6D/5N ~~₹1,07,500/-~~ ₹90,500/- Cities: Dubai, Abu Dhabi	**Char Dham:** 11D/10N ~~₹46,990/-~~ ₹45,071/- **Saraswati Pushkaralu:** 5D/4N ~~₹24,699/-~~ ₹22,970/-	**Amarnath Yatra:** 11D/10N ~~₹35,790/-~~ ₹32,927/- **Kashmir Package:** 8D/7N ~~₹32,990/-~~ ₹30,350/-	**Tamil Nadu Tour:** 8D/7N ~~₹35,599/-~~ ₹33,107/- **Gujarat with Ujjain & Omkareshwar:** 10D/9N ~~₹39,999/-~~ ₹37,199/-	**Best of Baku:** 5D/4N ~~₹59,999/-~~ ₹56,999/- **Kerala:** 6D/5N ~~₹22,199/-~~ ₹19,979/-

*T&C Apply

Authentic South Indian Meals On Tour

Best of Australia: 12D/11N ~~₹3,74,200/-~~ ₹3,09,200/- Cities: Sydney, Cairns, Gold Coast, Melbourne	**Best of USA with Orlando:** 15D/14N ~~₹5,28,400/-~~ ₹4,73,400/- Cities: New York, Washington DC, Niagra, Las Vegas, Los Angeles	**Best of South Africa:** 10D/9N ~~₹2,72,699/-~~ ₹2,36,699/- Cities: Cape Town, Garden Route, Johannesburg, Kruger National Park	**Singapore Malaysia:** 6D/5N ~~₹1,09,600/-~~ ₹89,600/- Cities: Kuala Lumpur, Singapore
Best of Thailand: 5D/4N ~~₹58,500/-~~ ₹48,500/- Cities: Bangkok, Pattaya	**Australia with New Zealand:** 19D/18N ~~₹6,08,500/-~~ ₹5,38,500/- Cities: Sydney, Cairns, Gold Coast Melbourne, Auckland, Queenstown	**Best of Kenya:** 7D/6N ~~₹2,07,999/-~~ ₹1,77,999/- Cities: Nairobi, Amboseli, Rift Valley, Masai Mara	**Best of Egypt:** 9D/8N ~~₹1,86,300/-~~ ₹1,56,300/- Cities: Cairo, Nile Cruise, Hurghada, & Alexandria
Heavenly Kashmir: 6D/5N ~~₹21,678/-~~ ₹20,377/-	**Leh Ladakh:** 5D/4N ~~₹27,455/-~~ ₹25,533/-	**Kamakhya Temple Tour(Assam):** 5D/4N ~~₹18,399/-~~ ₹17,111/-	**Gangtok Darjeeling:** 6D/5N ~~₹35,899/-~~ ₹32,309/-
Visakhapatnam Araku Valley: 3D/2N ~~₹12,699/-~~ ₹11,683/-	**Kerala Kanyakumari:** 9D/8N ~~₹40,199/-~~ ₹36,179/-	**Coastal Karnataka:** 6D/5N ~~₹26,399/-~~ ₹24,551/-	**Divine Tamil Nadu:** 6D/5N ~~₹36,199/-~~ ₹33,303/-

Southern Travels HOLIDAY MART SALE

Just pay token of ₹5000/- for Heavy Discounts

HEAVY CASH DISCOUNT UPTO ₹60,000/-*

Holiday pe Holiday Free!!

Holiday Mart @ all our offices: 1st - 31st Jan & below places: 24th - 26th Jan

Tirupati 72999 23255	Kurnool 73965 23236	Suryapet 73375 04455
Bhimavaram 9505 764 764	Kadapa 99122 23236	Coimbatore 95513 23236
Kakinada 9640 953 953	Hindupur 85508 25556	Hubli 85500 15556
Chirala 95027 18555	Khammam 90106 88555	Mahabubabad (1 to 3rd Feb) 81250 23236
Parvathipuram (1 & 2nd Feb) 85 7699 7699		

sricharanamedia.in

Ooty Kodaikanal Bengaluru: 6D/5N ~~₹31,899/-~~ ₹28,709/-	**Andaman:** 5D/4N ~~₹26,799/-~~ ₹24,655/-	**Bhubaneshwar, Puri, Konark:** 5D/4N ~~₹21,499/-~~ ₹19,994/-	**Rajasthan:** 7D/6N ~~₹37,075/-~~ ₹34,109/-	**Shimla Kullu Manali:** 6D/5N ~~₹28,290/-~~ ₹26,026/-	**Delhi, Nainital, Kasauni:** 6D/5N ~~₹32,484/-~~ ₹30,535/-	**Shirdi, Shani Shinganapur, Aurangabad:** 4D/3N ~~₹19,899/-~~ ₹17,909/-

Winners of **NATIONAL TOURISM AWARD** for Eight Years Continuously from Ministry of Tourism, Govt. of India

- India's most Trusted and Leading Travel Brand
- 4.5 M+ Happy Customers
- 2000+ Group & Customised Holiday Packages

7800 600 400
90 3035 8484
tours@southerntravels.com
www.southerntravels.com

Our Offices | Mon-Sat 10am to 8pm   we are open : 26th Jan (Sun) 10am to 8pm   **Toll Free: 1800 11 0606**

New Delhi : 8686 620 620	Hyderabad (Dilsukh Nagar) : 9100 64 5050	Rajahmundry: 99495 23236	Nellore : 99 8455 8455	Chennai (Anna Nagar) : 7800 600 800	Bengaluru (Yeswanthpur): 93790 23236
Hyderabad (Lakdikapul) : 7800 600 400	Vijayawada : 90 101 23236	Srikakulam : 85 7699 7699	Warangal : 81250 23236	Chennai (Periyamet) : 72999 23236	Bengaluru (Seshadripuram): 93799 23236
Hyderabad (KPHB) : 95057 28000	Vizag : 99121 23236	Guntur : 70 8155 8155	Karimnagar: 8860 70 8860	Kolkata : 920 555 8389	

క్లుప్తంగా...

రాజధాని పనులకు రూ.15 వేల కోట్ల రుణం

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణ పనుల కోసం హడ్కో నుంచి ఏపీసీఆర్డీఏ రూ.11 వేల కోట్ల రుణం తీసుకున్నట్టు మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు రాష్ట్రంలోని టిడ్కో ఇళ్ల నిర్మాణానికి మరో రూ.4,400 కోట్లు రుణం పొందినట్టు సమాచారం.

రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల థీమ్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని కర్తవ్యపథ్ వేదికగా జరగనున్న గణతంత్ర వేడుకల్లో ఏటి కొప్పాక థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం శకటాన్ని ప్రదర్శించనుంది. 'స్వర్ణ భారత్ విరాసత్ –వికాస్' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ సారి శకటాలను ప్రదర్శించబోతోంది. కేంద్రంలోని వివిధ శాఖలకు చెందిన 15 శకటాలతో పాటు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి మొత్తం 31 శకటాలు కర్తవ్యపథ్‌లో సందడి చేయనున్నాయి. 400ఏళ్ల చరిత్ర ఉన్న ఏటికొప్పాక బొమ్మల శకటం ముందు భాగంలో బొమ్మలు తయారు చేసే కళాకారుడు, గణపతి, వెనుక శ్రీ వేంకటేశ్వర స్వామి బొమ్మలను తీర్చిదిద్దారు. వాహనం మొత్తం గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ముగ్గులతో డిజైన్ చేశారు. వాహనంపై పలు రకాల బొమ్మలను అలంకరించారు.

రీ సర్వే నిపుణుల సెల్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే మళ్లీ పునఃప్రారంభమైన నేపథ్యంలో సర్వే సెటిల్‌మెంట్, భూమి రికార్డుల విభాగంలో నిపుణుల సెల్‌ను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించి 6,800 గ్రామాల్లో పూర్తి చేసిన రీ సర్వేను ఈనెల 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ ప్రారంభించారు. ప్రతి మండలంలోనూ ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీ సర్వే చేస్తున్నారు. అయితే సర్వే సందర్భంగా భూ యజమానుల నుంచి విజ్ఞాపనలు వస్తుండడంతో సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రీ సర్వే నోడల్ అధికారులతో ఇటీవల జరిగిన సమీక్షలో రీ సర్వేపై వినతుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో నిపుణుల బృందం ఉండాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ డైరెక్టరేట్‌లో రీ సర్వే నిపుణుల సెల్‌ను ఏర్పాటు చేస్తూ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ బి.ప్రశాంతిని ఈ సెల్ అధికారిగా నియమించడంతోపాటు ఇద్దరు ఉద్యోగులను నియమించారు. రీ సర్వేకు సంబంధించిన వినతులతోపాటు సలహాలు, సూచనలు కూడా ఈ సెల్ స్వీకరిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పంచాయతీల వర్గీకరణపై అధ్యయనానికి కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను వివిధ కేటగిరీల వారీగా వర్గీకరించడంపై అధ్యయనం చేసేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో నలుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న డి.సత్యనారాయణను చైర్మన్‌గా, డిప్యూటీ కమిషనర్ వి.నాగార్జున సాగర్‌ను కన్వీనర్‌గా, ఓఎస్డీ కమిషనర్ ఆనంద్, అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీదేవిని కమిటీ సభ్యులుగా నియమించింది. గ్రామ పంచాయతీలకు సంబంధమున్న అన్ని వర్గాల ప్రతినిధుల నుంచి ఈ కమిటీ అభిప్రాయాలు సేకరించడంతో పాటు జిల్లాల కలెక్టర్లు అందజేసిన నివేదికలను కూడా పరిశీలించి ఫిబ్రవరి 28 కల్లా సమగ్ర నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మా రాష్ట్రంలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం

మహారాష్ట్ర ఉన్నతాధికారుల బృందం



గుంటూరు జిల్లాలో మొక్కజొన్న క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మహారాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బృందం

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని.. అధిక ప్రాముఖ్యత ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ఆ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం తెలిపింది. ఇందులో భాగంగా ఏపీలో పర్యటిస్తున్నట్లు వెల్లడించింది. వ్యవసాయ శాఖ(పూణే) జాయింట్ డైరెక్టర్ దత్తాత్రేయ గవ్హనే నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం బుధవారం గుంటూరు జిల్లా అత్తోటి, ఎరుకులపూడి, కొల్లిపర ప్రాంతాల్లో పర్యటించింది. అత్తోటలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యకలాపాలను పరిశీలించింది. ఎరుకలపూడిలో మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించింది. కొల్లిపర మండలంలో బహుళ పంటల క్షేత్రాన్ని, భూమి భారతి యూనిట్‌లోని దేశవాళీ విత్తన రకాలను, మార్కెటింగ్ విధానాలను తెలుసుకున్నారు. కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి 60% విద్యాబోధన ప్రయోగశాలల్లోనే

6వ డీన్స్ కమిటి సిఫార్సుల అమలుతో మారనున్న బోధనా పద్ధతులు

- తొలి రెండేళ్లు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత
- నాలుగేళ్లలో 10 ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకునే అవకాశం
- ఏదైనా కారణంతో కోర్సు పూర్తి చేయలేకపోతే.. తొలి రెండేళ్లకు డిప్లొమా సర్టిఫికెట్
- మిగిలిన కోర్సును ఎప్పుడైనా పూర్తిచేసే అవకాశం
- 6వ డీన్స్ కమిటీ సిఫార్సులు సంపూర్ణంగా అమలు చేసిన తొలి వర్సిటీ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

సాక్షి, అమరావతి: వ్యవసాయ విద్యలో ఒకే విధమైన విద్యా ప్రమాణాలతో పాఠ్యాంశాలు, విద్యాబోధన అమల్లోకి వచ్చింది. ఇకపై 60 శాతం విద్యాబోధన ప్రయోగశాలల్లోనే జరగనుంది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) 6వ డీన్స్ కమిటీ సిఫార్సులను ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తూ దేశంలోనే తొలి విశ్వవిద్యాలయంగా ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకే రకమైన విద్యాబోధన తీసుకురావాలన్న లక్ష్యంతో ఐసీఏఆర్ 2021లో ఏర్పాటు చేసిన 6వ డీన్స్ కమిటీ ఇటీవలే తన నివేదికను సమర్పించింది. కమిటీ సిఫార్సులను జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ వ్యవసాయ వర్సిటీల్లో అమల్లోకి తీసుకురావాలని ఐసీఏఆర్ సంకల్పించింది. దీంతో ఈ నూతన విద్యా విధానంలో పాఠ్యాంశాలతో పాటు బోధనా పద్ధతులు మారిపోనున్నాయి.

కోర్సు మధ్యలో ఆపేస్తే..

నూతన విద్యావిధానం ప్రకారం కళాశాలల్లో చేరిన విద్యార్థులలో బెరకును పోగొట్టి, వివిధ కోర్సులపై అవగాహన కల్పించడం, విద్యార్థుల మధ్య తారతమ్యాలు తొలగించేందుకు తొలుత రెండు వారాల 'దీక్షారంభ్' నిర్వహిస్తారు. వ్యవసాయ కోర్సులలో తొలి రెండేళ్లు నిర్దేశించిన ప్రాథమిక కోర్సుల బోధనతో పాటు నైపుణ్యాభివృద్ధి కోర్సులలో శిక్షణకు ప్రాధాన్యతిస్తారు. తరగతి గది బోధనతో పాటు తొలి ఏడాది ఎన్‌ఎస్‌ఎస్/ఎన్‌సీసీ/ఫిజికల్ ఎడ్యుకేషన్/యోగా వంటి వాటిని అభ్యసించేలా ప్రోత్సహిస్తారు. 3వ ఏడాది పూర్తిగా వ్యవసాయ శాస్త్రానికి చెందిన కోర్సులు బోధిస్తారు. నాలుగో ఏడాదిలో ఎంపిక చేసిన కోర్సులలో విద్యాబోధన సాగిస్తారు. 8వ సెమిస్టర్‌లో ఇండస్ట్రియల్ అటాచ్‌మెంట్, అనుభవంతో కూడిన బోధన, హ్యాండ్–ఆన్ ట్రైనింగ్, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యత ఇస్తారు. 4వ ఏడాది వ్యవసాయం, అనుబంధ శాస్త్రాలతో పాటు 10 ఆన్‌లైన్ కోర్సులను నేర్చుకునే వెసులుబాటు కల్పిస్తారు. పైగా నాలుగేళ్ల కోర్సులో ప్రయోగాత్మక అంశాలను నేర్చుకోవడానికి 60 శాతం సమయాన్ని కేటాయిస్తారు. విద్యార్థి కోర్సుని పూర్తి చేయలేకపోతే.. తొలి రెండేళ్లకు గానూ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తారు. మిగిలిన కోర్సును విద్యార్థి తనకు ఎప్పుడు అవకాశం దొరికితే అప్పుడు.. దేశంలో ఏ వ్యవసాయ కళాశాలలో అయినా పూర్తిచేసే వెసులుబాటు కల్పించారు.

అమలులో తొలి వర్సిటీగా ఎన్జీ రంగా

6వ డీన్స్ కమిటీ సిఫార్సుల అమలు కోసం యూనివర్సిటీ ఫ్యాకల్టీ బోర్డ్ ఆఫ్ అగ్రికల్చర్, 113వ అకడమిక్ కౌన్సిల్ సమావేశాల్లో ఆమోద ముద్ర వేయడం ద్వారా సిఫార్సులు అమలు చేస్తున్న తొలి విశ్వవిద్యాలయంగా ఎన్జీ రంగా వర్సిటీ నిలిచింది. బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్ అందించే 7 వ్యవసాయ ప్రభుత్వ కాలేజీలు, 6 అనుబంధ కళాశాలలు, 2 ఫుడ్ సైన్స్ కళాశాలలు, 2 అగ్రి ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో కూడా వీటిని అమల్లోకి తెచ్చింది. డిజిటల్ టెక్నాలజీకి తగినట్టుగా విద్యార్థులను సన్నద్ధం చేసే లక్ష్యంతో బయో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్ తదితర కోర్సులతో పాటుగా వ్యక్తిత్వ వికాసం కోర్సులను చేర్చారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను మెరుగుపరిచే విధంగా ప్రోగ్రెసివ్ మూల్యాంకనం ద్వారా ప్రతిభను గుర్తిస్తారు. ఆన్‌లైన్, ఓపెన్ డిస్టాన్స్ లెర్నింగ్ (ఓడీఎల్), బ్లెండెడ్ లెర్నింగ్ వంటి వినూత్న బోధనా విధానాలను ఆచరణలోకి తీసుకొచ్చారు.

తొలి విశ్వవిద్యాలయం మనదే



జాతీయ విద్యావిధానం –2020లో భాగంగా ఐసీఏఆర్ ఏర్పాటు చేసిన 6వ డీన్స్ కమిటీ సిఫార్సులు సంపూర్ణంగా అమలు చేసిన తొలి వర్సిటీగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిలిచినందుకు గర్వంగా ఉంది. ఏటా పెద్ద సంఖ్యలో నూతన వంగడాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తూ పరిశోధనల్లో అగ్రస్థానంలో ఉన్న వర్సిటీని నూతన విద్యావిధానం అమల్లో కూడా అదే స్థానంలో నిలుపుతాం.

– డాక్టర్ శారద జయలక్ష్మి,
వీసీ, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ

రిటైర్డ్ ఐపీఎస్ 'ఏబీ'ది కుల దురహంకారం

- జగన్‌కు ఆయన క్షమాపణలు చెప్పాలి
- చంద్రబాబు ఆదేశాలతోనే రెచ్చిపోయాడు
- ఎమ్మెల్సీ తలశిల రఘురాం



సాక్షి, అమరావతి: రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వర రావు కుల దురహంకారంతో ప్రవర్తించడం ఏమాత్రం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, జగన్‌ని ఉద్దేశించి ఏబీ చేసిన వ్యాఖ్యలు ఆయన కుల జాఢ్యానికి నిదర్శనమని.. వెంటనే ఆయన జగన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏమన్నారంటే..

చంద్రబాబు నాయుడు ఆదేశాలతోనే ఏబీ వెంకటేశ్వరరావు చిల్లర వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం జగన్‌పై ఆయన వ్యాఖ్యలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఏబీ చదువుకున్న వ్యక్తిలా, ఉన్నత పోలీస్ ఉద్యోగం చేసిన ఐపీఎస్ అధికారిలా కాకుండా గేదెలు కాసుకునే వాడిలా.. కులోన్మాదంతో మాట్లాడారు. కమ్మ కులం మొత్తం జగన్‌ని ఓడించాలని ఏబీ సెలవిస్తున్నారు.. మరి కేవలం కమ్మ కులస్తులు ఓటేస్తేనే చంద్రబాబు సీఎం అయ్యారా? 3పార్టీలు ఏకమైనా జగన్ ఒంటరిగా పోటీచేసి 40 శాతం ఓట్లు సాధించిన విషయాన్ని ఏబీ మర్చిపోయినట్లున్నారు. ఆయన ఎన్ని కుయుక్తులు పన్నినా జగన్‌కు కులాన్ని ఆపాదించలేరు. జగన్ తన ఐదేళ్ల పాలనలో కులం, మతం, ప్రాంతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలుచేశారు కాబట్టే 40 శాతం ఓట్లతో ప్రజలు ఆయన్ను ఆశీర్వదించారు. ఏబీ వ్యాఖ్యలపై పవన్ స్పందించాలి. లేని పక్షంలో ఆయన కూడా కులవాదాన్ని సమర్థిస్తున్నారని మిగతా కులాలు భావించాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో చిన్నచిన్న పోస్టులకే కేసులు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. దీనిపై ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పాలి. 'అని అన్నారు.

తిరుపతి తొక్కిసలాటపై

రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ

విచారణ కమిషన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సత్యనారాయణ మూర్తి



సాక్షి, అమరావతి: తిరుపతిలో ఈ నెల 8న వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు హైకోర్టు రిటైర్డ్ జడ్జిని నియమించింది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తిని కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం 1952 కింది విచారణ కమిషన్‌గా నియమిస్తూ సీఎస్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. విచారణ కమిషన్ పరిధిని కూడా ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తిరుపతిలోని పద్మావతి పార్కు వద్ద తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడానికి దారితీసిన పరిస్థితులను విచారించాలని పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కోసం ఏర్పాట్లు సక్రమంగా చేశారో లేదో విచారించాలి. టోకెన్ల పంపిణీ ఏర్పాట్లలో లోపాలుంటే వాటిని గుర్తించడంతో పాటు అందుకు బాధ్యులైన వారిని నిర్ధారించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయాలి. భక్తుల భద్రత కోసం సంస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా ఉంటే సిఫార్సు చేయాలి. కమిషన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 6 నెలల్లో విచారణను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. విచారణలో భాగంగా కమిషన్ ఏ విభాగానికి చెందిన వ్యక్తినైనా హాజరు కావాలని ఆదేశించవచ్చు. సాక్షులు లేదా పత్రాల పరిశీలన కోసం కమిషన్ ఆదేశాలు జారీ చేయవచ్చు.

ప్రకాశం బ్యారేజ్ దిగువన

రిటైనింగ్ వాల్

కుడివైపున 0.9 కి.మీ నుంచి 2.61 కి.మీ వరకూ నిర్మాణం

సాక్షి, అమరావతి: ప్రకాశం బ్యారేజ్ దిగువన కృష్ణానదికి కుడివైపున 0.9 కి.మీ నుంచి 2.61 కి.మీ వరకూ రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు రూ.294.20 కోట్లతో పరిపాలన అనుమతి ఇస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. కృష్ణా నదికి గతేడాది వచ్చిన వరదలకు గుంటూరు జిల్లాలోని తాడేపల్లి పరిధిలో కొన్ని కాలనీలు ముంపునకు గురయ్యాయి. ముంపు ముప్పు తప్పించేందుకు ప్రకాశం బ్యారేజ్ దిగువన కృష్ణానదికి ఎడమ వైపు నిర్మించిన తరహాలోనే కుడివైపున రిటైనింగ్ వాల్ నిర్మించాలని గతేడాది నవంబర్ 21న ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పంపిన ప్రతిపాదనపై ఈనెల 17న మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

విశాఖలో గూగుల్ చిప్ డిజైన్ కేంద్రం పెట్టండి

గూగుల్ క్లౌడ్ సీఈవోకు చంద్రబాబు వినతి



సాక్షి, అమరావతి: విశాఖలో చిప్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గూగుల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. సర్వర్ల నిర్వహణ సేవల విషయంలో ఏపీని ప్రధాన కేంద్రంగా చేసుకోవాలని గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌ను కోరారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు.. మూడో రోజు వివిధ కంపెనీల ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. పెట్రో కెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలో, అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లో పెట్టుబడులు పెట్టాలని మలేసియాకు చెందిన పెట్రోనాస్ ప్రెసిడెంట్, గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొహమ్మద్ తౌఫిక్‌ను సీఎం ఆహ్వానించారు. పెప్సీకో ఇంటర్నేషనల్ బెవరేజస్ సీఈవో యూజీన్ విల్లెంసెన్, పెప్సీకో ఫౌండేషన్ చైర్మన్ స్టీఫెన్ కెహోతో చంద్రబాబు చర్చలు జరిపారు. ఇప్పటికే ఏపీలోని శ్రీసిటీలో బాట్లింగ్ ప్లాంట్ నిర్వహిస్తున్న పెప్సికో బెవరేజెస్.. విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని పెప్సీకో డిజిటల్ హబ్ ఏర్పాటు చేయవచ్చని సీఎం సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాలని కోరారు. కుర్‌కురే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌తో పాటు పెప్సీకో సప్లై చైన్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీసీఎన్ఎఫ్‌తో భాగస్వామ్యం కావాలని సూచించారు. బహ్రెయిన్ ప్రైమ్ మినిస్టర్ కార్యాలయం ప్రతినిధి హమద్ అల్ మహ్మద్, ముంతాలకత్ సీఈవో అబ్దుల్లా బిన్ ఖలీఫా అల్ ఖలీఫాతోనూ సీఎం సమావేశమయ్యారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని వారిని కోరారు.

స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేయాలని కంటైనర్ టెర్మినల్ రంగంలో ప్రతిష్టాత్మక సంస్థ డీపీ వరల్డ్‌ను చంద్రబాబు కోరారు. కాకినాడ, కృష్ణపట్నం, మూలపేట ఇందుకు అనుకూలమని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సీ పోర్టుల్లో, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్‌లోనూ పెట్టుబడులు పెట్టాలని కోరారు. దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు.

బిల్‌గేట్స్‌తో చంద్రబాబు భేటీ

ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య, ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు, బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ బిల్ గేట్స్‌ను చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్, డయాగ్నొస్టిక్స్ ప్రారంభించాలని, ఈ కేంద్రం ప్రజలకు అధునాతన ఆరోగ్య సదుపాయాలు అందిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ కోసం బిల్ గేట్స్‌ను సలహాదారుల మండలిలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.

ఏపిలో పామాయిల్ ఇండస్ట్రీ!

యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉజ్జెన్‌తో కూడా చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో రూ. 330 కోట్లతో పామాయిల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని యూనిలీవర్ భావిస్తోంది. బ్యూటీ పోర్ట్‌ఫోలియో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని విల్లెం ఉజ్జెన్‌కు బాబు వివరించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్ (సెన్మట్) హెడ్ రాబర్టో బోకాతో కూడా చంద్రబాబు సమావేశమయ్యారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్, సోలార్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు తరలివచ్చేలా సెన్మట్ సహకారం అందించాలని కోరారు. క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్ – స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు డబ్ల్యూఈఎఫ్ మద్దతివ్వాలని అభ్యర్థించారు.

హైకోర్టుకు ఇద్దరు అదనపు జడ్జిలు

▶ మొదటి పేజీ తరువాయి

జగన్నాథ్ శ్రీనివాసన్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఇద్దరూ శుక్రవారం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు వీరు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. తరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. రాష్ట్ర హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి 28 మంది న్యాయమూర్తులున్నారు. వీరిద్దరి నియామకంతో ఆ సంఖ్య 30కి చేరింది. మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో మూడు, నాలుగు పోస్టులు భర్తీ చేసేందుకు హైకోర్టు త్వరలో చర్యలు చేపట్టనుంది. న్యాయాధికారుల కోటా నుంచి హరిహరనాథ శర్మ, లక్ష్మణరావుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు సిఫారస్ చేస్తూ సుప్రీంకోర్టు సీజే నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 11న తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

అవధానం హరిహరనాథ శర్మ..

కర్నూలుకి చెందిన హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16న జన్మించారు. తల్లిదండ్రులు సుబ్బమ్మ, రామచంద్రయ్య. తండ్రి పురోహితుడు. శర్మ 1988లో కర్నూలులోని ఉస్మానియా కాలేజీ నుంచి బీఎస్సీ, అదే కాలేజీ నుంచి 1993లో బీఎల్ పూర్తి చేశారు. 1994లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 1994–98 వరకు సీనియర్ న్యాయవాది రామకృష్ణారావు వద్ద వృత్తి మెళకువలు నేర్చుకున్నారు. 1998లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించి 2007 వరకు న్యాయవాదిగా కొనసాగారు. 2007లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఉమ్మడి ఏపీలో పలు జిల్లాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. 2017–18లో అనంతపురం ప్రధాన జిల్లా జడ్జిగా, 2020–22లో విశాఖ ప్రధాన జిల్లా జడ్జిగా పనిచేశారు. 2022లో హైకోర్టు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023 నుంచి ఏపీ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. 2016లో ఏఎన్‌యూ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.

డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు..

ఉమ్మడి ప్రకాశం జిల్లా, కనిగిరికి చెందిన డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న జన్మించారు. తల్లిదండ్రులు పద్మావతి, వెంకటేశ్వర్లు. తండ్రి నెల్లూరు రహదారులు భవనాల శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. లక్ష్మణ రావు ప్రాథమిక విద్యాభ్యాసం ప్రకాశం జిల్లాలో సాగింది. నెల్లూరులో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఏఎన్‌యూ నుంచి పీజీ పూర్తి చేసి రెండు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ఏయూ నుంచి పీహెచ్‌డీ పొందారు. క్రిమినల్ లా, కంపెనీ లా లో బంగారు పతకాలు సాధించారు. 2000లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2014లో జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన పరీక్షలో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించారు. 2021లో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యూడీషియల్)గా నియమితులయ్యారు. ఆయన పనితీరు, క్రమశిక్షణ నచ్చిన హైకోర్టు ఆయనను రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ)గా నియమించింది. 2038 వరకు లక్ష్మణరావు హైకోర్టు న్యాయమూర్తిగా ఉంటారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

- ఫిబ్రవరిలో కలెక్టర్ల సమావేశం
- సీఎస్ కె.విజయానంద్



సాక్షి, అమరావతి: ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అర్జీలను సకాలంలో హేతుబద్ధంగా పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లను ఆదేశించారు. వివిధ అంశాలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విజయానంద్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలను నిర్దిష్ట వ్యవధిలోగా హేతుబద్ధంగా సక్రమంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆర్థికేతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రతి శాఖ తరపున ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు.

వచ్చే నెలలో కలెక్టర్ల సమావేశం

ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో కలెక్టర్ల సమావేశం నిర్వహించే అవకాశం ఉందని విజయానంద్ వెల్లడించారు. ఆ సమావేశానికి వారం ముందుగానే వివిధ శాఖల కార్యక్రమాలు, పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కలెక్టర్లకు అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్–ముఫ్త్ బిజిలీ యోజనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్–ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధానమంత్రి కుసుమ్ పథకాలకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ మొదటి సమావేశం జరిగింది. విజయానంద్ మాట్లాడుతూ కుప్పం మండలం నడిమూరు, చంద్రగిరి మండలం నారావారిపల్లె గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నూరు శాతం సోలరైజేషన్‌కు ప్రభుత్వం ప్రతిపాదించిందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాల్లో 5 గ్రామాలను ఈ విధంగా మోడల్ సోలార్ గ్రామాలుగా పైలట్ ప్రాజెక్టు కింద తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు.

పెళ్లింట్లో భారీ చోరీ

- సుమారు రూ.3.50 కోట్ల విలువైన బంగారం, రూ.20 లక్షల నగదు అపహరణ
- ఫిబ్రవరి 7న వివాహం నిశ్చయం
- అంతలోనే పెళ్లి కుమార్తె ఇంట్లో సొమ్మంతా లూటీ



లాకర్‌లోని బంగారు ఆభరణాలను చోరీ చేసి వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

అనంతపురం: పెళ్లింట్లో దొంగలు పడ్డారు. సుమారు రూ.3.50 కోట్ల విలువైన బంగారం, రూ.20 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. అనంతపురం నగరంలోని ఓ ఇంట్లో బుధవారం వేకువజామున ఈ భారీ చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. అనంతపురం మండలం కాట్నేకాలువ గ్రామానికి చెందిన కొండ్రెడ్డి వెంకటశివారెడ్డి నగరంలో స్థిరపడ్డారు. భూములు అధికంగా ఉండడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. కొండ్రెడ్డి వెంకటశివారెడ్డి, కవిత దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఏలూరుకు చెందిన బుసిరెడ్డి ఆదినారాయణరెడ్డి కుమారుడితో ఆమెకు వివాహం నిశ్చయమైంది. ఫిబ్రవరి 7న అనంతపురం ఎంవైఆర్ కల్యాణ మండపంలో వివాహం జరిపేందుకు నిశ్చయించారు. ఈ నేపథ్యంలోనే పెళ్లి కుమార్తెకు బహుమతిగా ఇవ్వనున్న బంగారం, వెంకటశివారెడ్డి, కవిత దంపతులకు చెందిన బంగారంతో పాటు వెంకట శివారెడ్డి అత్త, మామ, వియ్యంకుల బంగారు ఆభరణాలు కలిపి సుమారు 5 కిలోల బంగారాన్ని ఇంట్లోని లాకర్‌లో ఉంచారు. కాగా.. శివారెడ్డి దంపతులు తెలంగాణలో ఉన్న తమ బంధువుల్ని పిలిచేందుకు వెళ్లగా.. ఇదే అదునుగా భావించిన దొంగలు బుధవారం వేకువజామున 4 గంటలకు ఇంట్లోకి చొరబడ్డారు. ఊచలు తొలగించి ఇంట్లోకి వెళ్లి తొలుత బీరువా తాళాలు పగులగొట్టారు. అందులో ఉన్న లాకర్ తాళం తీసుకుని.. లాకర్‌లోని సుమారు ఐదు కిలోల బంగారాన్ని, బీరువాలోని రూ.20 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. మొత్తం ఐదుగురు దొంగల ముఠా చోరీలో పాల్గొన్నట్టు సీసీ కెమెరాల పుటేజీలను బట్టి తెలుస్తోంది. ఇంట్లో సీసీ కెమెరాలు లేనప్పటికీ ఎదురింటి సీసీ కెమెరాల్లో ఆ దృశ్యాలు రికార్డయ్యాయి.

మరో రెండు ఇళ్లలోనూ చోరీ

కాగా.. వెంకటశివారెడ్డి ఇంటి పక్కనే ఉంటున్న డిప్యూటీ కమిషనర్ ఇంట్లో రూ.75 వేలు, మిస్టర్ ఛాయ్ నిర్వాహకుడు ఇంట్లోనూ చోరీ జరిగింది. వీరు ఇంకా ఇళ్లకు చేరుకోకపోవడంతో అందులో ఎంత మొత్తం చోరీ జరిగిందనే అంశంపై స్పష్టత రాలేదు. ఘటన స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ చోరీ వెనుక తెలిసిన వారి హస్తం ఉందా? లేక రాటుదేలిన దొంగల ముఠా పనా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పాలి

- అభ్యంతరకర వ్యాఖ్యలను బీజేపీ ఎమ్మెల్యే వెనక్కి తీసుకోవాలి
- విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్



జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార (విశాఖ): బీజేపీకి చెందిన విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు స్టీల్ ప్లాంట్ కార్మికులపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, కార్మికులకు క్షమాపణ చెప్పాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. జేఏసీ చైర్మన్ ఎం. జగ్గునాయుడు, వైస్‌చైర్మన్ ఎం. మన్మథరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఇష్టంలేకపోతే రిజైన్ చేసి వీఆర్ఎస్ తీసుకుని బయటకుపోవాలని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే కార్పొరేట్ల ప్రతినిధిగా.. కార్మిక వ్యతిరేకిగా మాట్లాడారని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆశకు అంతు ఉండాలని, వివేకంతో మాట్లాడాలని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్యాకేజీని జేఏసీ స్వాగతించిందని వారు గుర్తుచేశారు. పాడి ఆవు లాంటి స్టీల్‌ప్లాంట్‌ను అదానీ, మిట్టల్, పోస్కో వంటి కార్పొరేట్లకు కట్టబెట్టవద్దనేది ప్రజల డిమాండ్ అన్నారు. ప్రజా ప్రతినిధిగా విష్ణుకుమార్‌రాజు వారి పక్షాన కాకుండా ప్రజల పక్షాన నిలవాలని హితవు పలికారు. కూటమి డబుల్ ఇంజన్ సర్కారువల్లే కేంద్రం ప్యాకేజీ వచ్చిందని.. కార్మికుల, ప్రజల పోరాటం, సమ్మెలవల్ల కాదని బీజేపీ ఎమ్మెల్యే అనడం హాస్యాస్పదమన్నారు. పోరాటమే లేకపోతే కేంద్రం దిగొచ్చేదే కాదన్నది జగమెరిగిన సత్యమని చెప్పారు.



ప్రార్థన ఉద్దేశం దేవుడిని ప్రభావితం చేయడం కాదు,
ప్రార్థించేవారి స్వభావాన్ని మార్చడం.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 23 జనవరి 2025

ఆశయాన్ని దెబ్బతీసే ఆచరణ?

రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన విద్యారంగానికీ రంగులు అంటుకున్నాయి. కేంద్రం ఇటీవల జారీ చేసిన 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలు – 2025' ముసాయిదా చర్చనీయాంశమైంది. విశ్వవిద్యాలయ ఉపకులపతుల ఎంపిక ప్రక్రియను సమూలంగా మార్చేస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెలువరించిన ఈ ముసాయిదా బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో రచ్చ రేపుతోంది. ఉమ్మడి జాబితాలోని అంశమైన విద్యారంగంలో సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం పెత్తనం చేయాలనుకుంటున్నదన్నది ప్రతిపక్షాల ఆరోపణ. తాజా యూజీసీ ముసాయిదా అందుకు నిదర్శనమన్నది వాటి భావన. రాష్ట్ర గవర్నర్ నిర్వాకమా అని ఇప్పటికే పలు యూనివర్సిటీల్లో వీసీలు లేకుండా పోయిన తమిళనాడు ఈ ముసాయిదాను తక్షణమే ఉపసంహరించాలని కేంద్రాన్ని కోరుతూ చట్టసభలో తీర్మానం చేయడం గమనించాల్సిన అంశం. వీసీల పదవీ కాలాన్ని మూడు నుంచి అయిదేళ్ళకు పెంచడం మంచిదే అయినా, పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల పేరిట కాషాయ భక్తుల్ని వీసీలను చేస్తారన్న అనుమానాలకు జవాబు దొరకడమే కష్టంగా ఉంది.

ముసాయిదా ప్రకారం వైస్‌ఛాన్సలర్ల (వీసీల) నియామకం కోసం ముగ్గురు సభ్యుల అన్వేషణ, ఎంపిక కమిటీని నియమించే అధికారాన్ని ఛాన్సలర్లకు, అంటే కేంద్రసర్కార్ నియమించే ఆ యా రాష్ట్రాల గవర్నర్లకు కట్టబెట్టారు. ఒకవేళ మార్గదర్శకాలను గనక అమలు చేయకుంటే... సదరు విద్యా సంస్థను యూజీసీ పథకాల నుంచి, లేదంటే అసలు డిగ్రీ కోర్సులు చెప్పడానికైనా వీలు లేకుండా బహిష్కరించవచ్చు. ఈ ముసాయిదాపై సంబంధిత వర్గాలు, సామాన్య ప్రజలు నెల రోజుల్లోగా తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చెప్పాలని కేంద్రం కోరుతోంది. వైస్‌–ఛాన్సలర్ మాట అటుంచి, పాఠశాల నుంచి కాలేజీలు, విశ్వవిద్యాలయాల దాకా విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదానైనా కేంద్ర ప్రభుత్వం నియమించిన వ్యక్తి (గవర్నర్)కి అసలెలా కట్టబెడతారన్నది తమిళనాడు సీఎం స్టాలిన్ సహా పలువురి ప్రాథమిక ప్రశ్న. సమాఖ్య స్ఫూర్తినే దెబ్బ తీసేలా ఉన్న తాజా ముసాయిదాను వ్యతిరేకిస్తూ, ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలు చట్టసభల్లో తీర్మానాలు చేయాలని ఆయన ఏకంగా పిలుపునివ్వడం విశేషం.

ఇప్పటికే తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ సహా అనేక రాష్ట్రాల్లో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకూ, పై నుంచి వచ్చిన గవర్నర్లకూ మధ్య నిత్య ఘర్షణ చూస్తూనే ఉన్నాం. రాష్ట్ర సర్కార్లు నడిపే పలు విశ్వవిద్యాలయాల్లో సదరు గవర్నర్లే ఛాన్సలర్లు. వీసీల నియామకంపై వాళ్ళు రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఉదంతాలు కోకొల్లలు. ఇప్పటి వరకు వీసీల నియామక అన్వేషణ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వాలే ఏర్పాటుచేసేవి. తాజా ముసాయిదా ప్రకారం ఆ కమిటీల నియామకం సైతం ఛాన్సలర్లయిన గవర్నర్ల చేతిలోకి వెళ్ళిపోనుంది. ఢిల్లీ నుంచి తాము పంపే రబ్బరు స్టాంపులతో రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్ని సైతం తమ చేతుల్లోకి తీసుకోవాలన్న ప్రయత్నమిది అని ప్రతిపక్షాల ఆరోపణ. కేంద్ర పాలకులు ఆ ఆరోపణల్ని నిజం చేయరాదు.

నిజానికి, నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమలు చేస్తామంటూ కేంద్రం ప్రకటించి మూడున్నరేళ్ళు దాటినా, ఉన్నత విద్యాసంస్థల సంస్కరణ నేటికీ నత్తనడక నడుస్తోంది. దీర్ఘ కాల లోపాల్ని సవరించి, ఆధునిక కాలానికీ, విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ అవసరాలకూ తగ్గట్లు యూనివర్సిటీలను తీర్చిదిద్దాల్సి ఉంది. ఉన్నత విద్యకు సంబంధించి నియంత్రణ వ్యవస్థయిన యూజీసీది అందులో ప్రధాన బాధ్యత. అతిగా నియంత్రిస్తోందంటూ గతంలో విమర్శలను ఎదుర్కొన్న యూజీసీ వైఖరి తాజా ముసాయిదాలో కొంత మారినట్టు కనిపిస్తోంది కానీ, కొత్త విమర్శలకు తావిచ్చింది. ఫలానా అంశం బోధించాలంటే అందులో పీజీ చేసి ఉండాల్సిందేనన్న అర్హత ప్రమాణాల్ని సడలించడం, వీసీ పదవికి పరిశ్రమలోని సీనియర్లు, ఉన్నతాధికారులకు సైతం వీలు కల్పించడం లాంటివి కొందరు స్వాగతిస్తే, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా, సంస్థాగత స్వతంత్రత ఎన్ఈపీ ప్రధానోద్దేశమైతే... తద్విరుద్ధంగా వీసీల నియామకంలో గవర్నర్లకు పెద్దన్న పాత్ర కల్పించడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. 'నీ ఎడమ చేయి తీయి... నా పుర్ర చేయి పెడతా' అన్నట్టు ఇక వీసీల ఎంపికలో రాష్ట్రం బదులు కేంద్రం పట్టు బిగుస్తుందన్న మాట. పార్లమెంట్ చేసిన 1956 నాటి చట్టం ప్రకారం తన పరిధిలోకే రాని వీసీల ఎంపిక, నియామకాన్ని యూజీసీ నియంత్రించాలనుకోవడం సమస్యే కాదు రాజ్యాంగపరమైన చిక్కులు తెస్తుంది.

గతంలో శాస్త్రవేత్త నాయుడమ్మ లాంటి వారిని వీసీలుగా నియమించినప్పుడు, వారి విజ్ఞానం విద్యాలయాలకు వన్నె తెచ్చింది. అలా చూస్తే, అధ్యాపక వర్గానికి ఆవల ఉన్న వృత్తి నిపుణులకు సైతం తలుపులు తెరవడం వల్ల ఉన్నత విద్యా సంస్థల్లో ప్రతిభావంతుల సమూహం పెరగడం మంచిదే. యూనివర్సిటీల్లో నియామక నిబంధనల్ని సరళం చేయడం స్వాగతించాల్సిందే. కానీ, ఇప్పుడైనా, అప్పుడైనా వీసీ పదవిని రాజకీయ నియామకంగా మార్చడంతోనే అసలు సమస్యంతా! వీసీల నియామకాల్లో రాజ్‌భవన్‌ను కీలకంగా మార్చడమన్నది అసలు ఎన్ఈపీ లక్ష్యాలకే విరుద్ధం. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యూనివర్సిటీలు అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలకూ, గవర్నర్లకూ మధ్య నలిగిపోతున్నాయి. వీసీల ఎంపిక సైతం గవర్నర్ల చేతికొచ్చాక పరిస్థితేమిటో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఉన్నత విద్యాలయ ప్రాంగణాన్ని నడిపే ఉత్తముడి ఎంపిక ఇటు రాష్ట్రం, అటు కేంద్రాల రాజకీయ ఒత్తిళ్ళకు అతీతంగా ఉన్నప్పుడే ఫలితం ఉంటుంది.

సంతాన సాఫల్య తంత్రం

అభిప్రాయం



జి. శ్రీరామమూర్తి

చైనాకు మించిన జనసంఖ్యతో భారత దేశం పేదరికానికి పెద్ద పీటగా మారినందుకు బాధపడుతున్న సమయంలో మాన్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మరింత మందిని కనండని ప్రజలకు పిలుపునివ్వడం కలయా, వైష్ణవ మాయయా అనిపిస్తున్నది. గతంలో ఒకసారి అస్పష్టంగా ఈ ప్రకటన చేసిన చంద్రబాబు ఇప్పుడు దీనికొక ప్రణాళికను జోడించారు. ఇద్దరికంటే ఎక్కువ సంతానం గలవారికే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆ మేరకు చట్టం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడి అవుతున్నది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కూడా ఎక్కువమందిని కనాలేమో అన్నారు గానీ ఈ ఇద్దరు సీఎంల ఆలోచనల్లో స్పష్టమైన తేడా ఉంది.

ముందు ముందు దేశ జనాభాలో యువత శాతం తగ్గిపోయి ముసలివారు అధికమవుతారని, ఆ ప్రమాదాన్ని తొలగించడానికి ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు అంటున్నారు. మేమిద్దరం, మాకు ఇద్దరు అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి కుటుంబ నియంత్రణను గట్టిగా పాటించినందువల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పరిమితమయిందని, అందువల్ల 2026 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంటులో మన స్థానాలు తగ్గిపోతాయని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా మరింతగా కుంచించుకు పోతున్నాయనే కారణాల మీద ఎక్కువమంది బిడ్డలను కనాలేమోనని స్టాలిన్ అన్నారు. ఇందుకు తమిళనాట దీవెనగా ఉన్న 16 రకాల భాగ్యాల ప్రస్తావన తెచ్చి ఒక్కొక్కరూ అంతమందిని కనవలసి వస్తుందేమోనని ఆయన అభిప్రాయపడ్డారు. చంద్రబాబు ఈ విషయంలో వల్లమాలిన ఆత్రం ప్రదర్శించడం మాత్రం ఆశ్చర్యం కలిగిస్తున్నది.

కుటుంబ నియంత్రణను జాతీయ విధానంగా చేపట్టి 1950 లోనే అమలు ప్రారంభించిన దేశం ఇండియా. అయినా జనాభాలో ప్రథమ స్థానంలో ఉంటూ వచ్చిన చైనాను ఈ మధ్యనే దాటి పోయాము. ప్రస్తుతం భారత జనాభా 145 కోట్లమంది. ఇందులో 25 సంవత్సరాల లోపు వయసువారు 40 శాతం మంది. 40 ఏళ్ల లోపు జనం 74 శాతం. ఈ పరిస్థితి 2061 వరకు కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. పనిచేసే వయసులోని జనం ఇంత ఎక్కువగా ఉండటం ఒక వరం. వీరందరికీ పని కల్పించగలిగితే సంపద పెరిగి ఇండియా త్వరితంగా అభివృద్ధి చెందిన దేశం కాగలుగుతుంది. కానీ పాలకులు ఇందులో ఘోరంగా విఫలమవుతున్నారు.

కుటుంబ నియంత్రణ పాటింపువల్ల జనాభా తగ్గిపోవడం, ఉత్తరాదికంటే అధిక తలసరి ఆదాయం కలిగి ఉండటం దక్షిణాది రాష్ట్రాలకు పెనుశాపమయ్యింది. అయిదు దక్షిణాది రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ) ఉమ్మడి జనాభా 24 కోట్లు. ఒక్క ఉత్తరప్రదేశ్ జనాభాయే ఇప్పుడు దాదాపు 25 కోట్లని అంచనా. 2026 తర్వాత జరిగే నియోజక వర్గాల పునర్విభజనలో అప్పటికి ఉండే జనాభా ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడున్న వాటిలో 20 పార్లమెంటు స్థానాలు కోల్పోవచ్చు; ఉత్తరాది రాష్ట్రాలు అదనంగా 31 స్థానాలు పొందవచ్చు. ఒక్క ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికే 11 పార్లమెంటు స్థానాలు వచ్చి చేరుతాయని అంచనా. దాంతో ఇపుడున్న 80 స్థానాలు 91కి పెరుగుతాయి. తమిళనాడు 8 స్థానాలను కోల్పోవచ్చు. ప్రస్తుతం దానికున్న 39 స్థానాలు 31కి కుదించుకుపోతాయి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండిన 42 పార్లమెంటు స్థానాలు 34కి తగ్గిపోతాయంటున్నారు. బిహార్ పది, రాజస్థాన్ ఆరు స్థానాలను, మధ్య ప్రదేశ్ నాలుగింటిని,



గుజరాత్, హరియాణా, జార్ఖండ్, ఢిల్లీ, చత్తీస్‌గఢ్ ఒక్కో పార్లమెంటు స్థానాన్ని అదనంగా పొందవచ్చని భావిస్తున్నారు.

పునర్విభజన వాయిదా ఒక పరిష్కారం

ఈ మార్పు కారణంగా కేంద్ర పాలకులు ఎన్నికల్లో అధిక స్థానాలను గెలుచుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసి నిధులను ఉత్తరాది రాష్ట్రాలకే మరింత ఎక్కువగా కేటాయిస్తారు. పర్యవసానంగా దక్షిణాది ఇంతవరకు సాధించిన అభివృద్ధిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నది. జనాభా నియంత్రణను చిత్తశుద్ధితో పాటించినందువల్ల ఇలా నష్టపోవలసి వస్తున్నది కాబట్టి ఎక్కువమందిని కనక తప్పదా అని తమిళనాడు ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమస్యకు పరిష్కారాలు లేకపోలేదు.

లోక్‌సభ సభ్యుల సంఖ్య ఇప్పుడు 543. ఇది 1971 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించినది. కుటుంబ నియంత్రణ పాటింపు దెబ్బ తినకుండా చూసుకొనేందుకు, దానిని ప్రోత్సాహించడం కోసం ఈ సంఖ్యను 30 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని భావించి 42వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అలా ఆ సంఖ్యను అక్కడే ఆపి ఉంచారు. ఈ నియోజకవర్గాల పునర్విభజనను 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల అనంతర కాలానికి వాయిదా వేస్తూ 2000 సంవత్సరంలో మళ్ళీ నిర్ణయం తీసుకొన్నారు. అదే విధంగా మరి కొన్ని సంవత్సరాలపాటు యథాతథ స్థితిని కొనసాగిస్తూ 2026లో ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా జనసంఖ్యను బట్టి ప్రజా ప్రాతినిధ్య నియోజకవర్గాల పునర్విభజనను పార్లమెంటుకు బదులు రాష్ట్రాల శాసనసభలకు బదలాయించవచ్చు. కొంపలేం మునగవు.

లోక్‌సభ స్థానాలను కాపాడుకోవడం కోసం, వాటిని పెంచుకోవడానికి ఎక్కువ మందిని కనాలనడం ఎంతమాత్రం హర్షించ వలసినది కాదు. అసలే వనరులు తక్కువగా ఉన్న దేశంలో జనాభాను పెంచుకోడం ఆత్మహత్యా సదృశమే. దేశ జనాభాలో 60 శాతం మంది సగటున రోజుకి 250 రూపాయలతో జీవిస్తున్నారు. జీవన హక్కు అంటే అన్ని సౌకర్యాలతో గౌరవప్రదంగా బతికే హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్వచించింది. దేశంలో 50 శాతానికి మించిన జనాభా కనీస సౌకర్యాలకు దూరంగా బతుకుతున్నారు. ఇటువంటి నేపథ్యంలో ఇద్దరు కంటే ఎక్కువమందిని కనాలని చంద్రబాబునాయుడు అనడం పరమ హాస్యాస్పదంగా ఉన్నది.

పరిమిత సంతానమే మేలు

ఏ రోజు పని ఉంటుందో ఏ రోజు ఉండదో తెలియని స్థితిలోని ప్రజలను, అందీ అందని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్రులు చాచేవారిని కనండి కనండి అంటూ అదిలించడం మానవీయం కాదు. దేశంలో ఐదేళ్ల లోపు బాలల్లో 44 శాతం మంది వయసుకు తగిన బరువు లేమితో బాధపడుతున్నారు. బాలల్లో 72 శాతం మంది, వివాహిత మహిళల్లో 52 శాతం మంది రక్త హీనతతో తీసుకుంటున్నారు. గర్భవతులకు పోషకాహారం లోపిస్తే పుట్టే పిల్లలు రోగాల బారిన పడతారు. 2013 నుంచి స్థూల దేశీయ ఉత్పత్తి 50 శాతం పెరిగినప్పటికీ ప్రపంచమంతటిలో గల పోషకాహార లోపమున్న పిల్లల్లో మూడింట ఒక పాలు కంటే ఎక్కువ మంది ఇండియాలోనే ఉన్నారనీ, ఇందుకు విపరీతమైన ఆర్థిక వ్యత్యాసాలే కారణమనీ నిపుణులు నిగ్గు తేల్చారు.

శారీరకంగా చితికిపోయినా ఉదయం నుంచి సాయంత్రం వరకు గుక్కెడు గంజి కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్న అత్యధిక శాతం మహిళలు ఎక్కువ మంది బిడ్డలను కనడమంటే చావుకి త్వరితంగా దగ్గరవ్వడమే. పిల్లలు లేనివారికీ ఇద్దరే బిడ్డలు కలవారికీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేకుండా చేయడం ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరచడమే. పరిమిత సంతాన సూత్రం ప్రజలకు మంచి చేసింది. బతుకు భారాన్ని తగ్గించి ఎండిన పెదాలను తడిపింది. దక్షిణాది సాధించుకున్న ఈ సౌభాగ్యాన్ని నాశనం చేయాలనే దుర్బుద్ధి హానికరం. ఒకవైపు పిల్లల విద్యను, వైద్యాన్ని నానాటికీ ప్రియం చేస్తూ ఇంకా ప్రసవించండని అనడం దుర్మార్గమే. చంద్రబాబునాయుడుకి ఈ ఆలోచన ఎందుకు కలిగిందో గాని అది ప్రజలపట్ల ద్రోహ చింతనే. ఈ దురాలోచనను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మానుకోవడం మంచి చేస్తుంది. ఎప్పుడో వచ్చే విపత్తు కోసం ఇప్పుడే శోక గంగలో దూకమనడం విజ్ఞతా కాదు, విజ్ఞతా అనిపించుకోదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

కరెంటు లాంటి విప్లవం



500 బిలియన్ డాలర్ల ప్రారంభ పెట్టుబడితో 'స్టార్‌గేట్' ప్రాజెక్ట్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం కృత్రిమ మేధ అభివృద్ధి దిశగా స్పష్టమైన సంకేతం. ఈ విషయంలో అమెరికా, చైనా మధ్య పోటీ మిగతా ప్రపంచానికి మేలు చేస్తుంది. కృత్రిమ మేధతో ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా మారనుంది. మన జీవితకాలంలో మనం చూస్తున్న అత్యంత ప్రజాస్వామిక సాంకేతిక పరిజ్ఞానం ఇది. మున్ముందు జనాలు దీన్ని కరెంటులాగా వాడుతారు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

గొప్ప శక్తి



ఎప్పుడు మనసు ఊగిసలాట లేకుండా స్థిమితంగా ఉంటుందో; భయ, పశ్చాత్తాప, కోప రహితంగా ఉంటుందో దానికి ఏ జబ్బునైనా నయం చేసే శక్తి ఉంటుంది.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

అసలేం జరుగుతోంది?



నటుడు సైఫ్ అలీఖాన్ ఏమైనా సూపర్‌మ్యానా? ఆరు కత్తి పోట్లు. వెన్నెముక గాయానికి ఐసీయూలో ఉన్నవాడు అత్యంత ఆరోగ్యంగా కనబడుతూ, సాధారణంగా నడుచుకుంటూ వస్తున్నారు. అది కూడా ఎనిమిది గంటల సర్జరీ చేశారని చెప్పాక. ఏదో తేడా ఉంది. దేన్నో దాస్తున్నారు. అసలే ముంబయి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తారని పేరు.

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

గాగా!



ఈ సీజన్‌లో ఏం నడుస్తోంది? అమెరికాలో 'మాగా' (అమెరికాను మళ్లీ గొప్పగా చేద్దాం!). ఇండియాలో 'నాగా' (సాధువులు).

– ఉర్వీశ్ కొఠారీ, రచయిత

అదే పద్ధతిలో...



అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను ఇండియాకు పంపాలన్న అమెరికా నిర్ణయం పట్ల కొందరికి ఏ సమస్యా ఉన్నట్టు లేదు. అలాంటప్పుడు, అక్రమంగా ఇండియాలో ఉంటున్న బంగ్లాదేశీయులను, ఈశాన్య రాష్ట్రాల్లోని మయన్మారీలను ఇండియా వెనక్కి పంపితే కూడా అభ్యంతరం చెప్పకూడదు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

అంగీకరించాల్సిన నిర్ణయం



వీసా అనేది గౌరవమే గానీ హక్కు కాదు. విదేశాల్లో ఉద్యోగం చేయమని ఎవరూ ఒత్తిడి చేయడం లేదు. అది ఒకరి ఎంపిక. విదేశీ పౌరులు తమ దేశ చట్టాలను మార్చగలరు. దాన్ని అంగీకరించాలి. లేదా ఆ చట్టాన్ని మార్చేట్టుగా రాజకీయంగా ప్రభావితం చేయగలగాలి. ఏదైనా సరే, బాధిత కార్డు మాత్రం వాడకూడదు.

– సి. రామ్‌ప్రసాద్, ఆంట్రప్రెన్యూర్

మౌనమే జవాబు



మరీ ఎక్కువ మాట్లాడటం అనేది మన ఆరోగ్యం, విశ్వాసాలకు చెరుపు చేస్తుంది. కొన్నిసార్లు కేవలం వినడం, ఏదీ మాట్లాడకుండా ఉండటం అనేది అత్యుత్తమ జవాబు అవుతుంది. మన నిశ్శబ్దాన్ని ఎవరూ తప్పుగా ఉటంకించరు అని గుర్తుంచుకోండి.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు
పుష్య మాసం, **తిథి:** బ.నవమి ప.3.26 వరకు, తదుపరి దశమి,
నక్షత్రం: విశాఖ రా.3.31 వరకు, తదుపరి అనూరాధ,
వర్జ్యం: ఉ.7.19 నుండి 9.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.23 నుండి 11.11 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.40 వరకు,
అమృతఘడియలు: సా.5.41 నుండి 7.26 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఇన్ బాక్స్

భారత ఆత్మగౌరవ ప్రతీక!

మాతృభూమి దాస్య శృంఖలాలను తుంచడానికి ఆనాటి అత్యున్నత సర్వీస్ అయిన ఐసీఎస్‌ను తృణప్రాయంగా త్యజించిన ఘనుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. భారతీయులను బానిసలుగా చూస్తున్న ఆంగ్లేయులను ఈ దేశం నుండి గెంటేయడానికి సాయుధ పోరాటమే శరణ్యమని భావించిన యోధుడు. 'ఛలో ఢిల్లీ', 'జైహింద్' నినాదాలను జాతికి అందించిన భారత మాత ముద్దుబిడ్డ. 'ఆజాద్ హింద్ ఫౌజ్' సేనానిగా 'నేను మీకు కేవలం



సుభాష్ చంద్రబోస్

ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను, భారతదేశ స్వాతంత్ర్యమే మన జీవన ధ్యేయం, దానికోసం సర్వం అర్పించడానికి మనమంతా సిద్ధంగా ఉండాలి' అని ఉద్బోధించారు. ఐసీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేస్తూ తన అన్నకు రాసిన ఉత్తరంలో 'నేను ఆంగ్లేయుల సేవ చేయడమా? అసంభవం. క్రూరులైన, నిర్దయులైన, జలియన్ వాలాబాగ్ హంతకులైన ఆంగ్లేయులకు నేను సహకరించడమా? నేను మన మాతృదేశానికి శత్రువుగా మారగలనా? అసంభవం. ప్రజలంతా ఎవరిళ్ళలో వాళ్ళుంటే, దేశం గురించి ఎవరు ఆలోచిస్తారు? మాతృభూమి ఆర్తనాదాలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి. సమర రంగంలోకి ప్రవేశించి దేశానికి స్వాతంత్ర్యం లభించే దాకా పోరాడటమే దేశం పట్ల మన కర్తవ్యమవుతుంది. స్వాతంత్ర్య సంగ్రామంలో సైనికుడిని కావడం కోసమే ఐసీఎస్‌ను వదిలేశాను' అని పేర్కొన్నారు.

ఆయన బెంగాల్ ప్రాంతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్‌కు సహ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కానీ కాంగ్రెస్ పార్టీలోని అంతః కలహాలలో ఇమడలేక పార్టీని వదిలి 1939 మే 3న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారు. ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడిగా మద్రాసులో నిర్వహించిన సభలో ఆ రోజుల్లోనే దాదాపు లక్ష మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆనాటి రాజకీయాలలో ఇది ఒక పెను సంచలనం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉన్న జర్మనీ, జపాన్, ఇటలీ వంటి దేశాలు, అలాగే విదేశాలలో ఉన్న భారతీయుల సహాయ సహకారాలతో 'ఆజాద్ హింద్ ఫౌజ్' పగ్గాలు చేపట్టారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఈ సైన్యంతో వీరోచిత పోరాటం చేసిన బోస్ బాబు అత్యుత్తమ ఆదర్శాలకు ప్రతీక!

– ఆచార్య వై.వి. రామిరెడ్డి, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ ఏపీ అధ్యక్షులు
(నేడు సుభాష్ చంద్రబోస్ జయంతి)

ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించాలి!

అభిప్రాయం



డా॥ తిరుణహరి శేషు

బడ్జెట్ అంటే కేవలం ఆదాయ వ్యయాల సమాహారం కాదు. దేశ ప్రగతికి, ప్రజల సమస్యలకు దర్పణం పట్టే ఒక దిక్సూచి. బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు రైతులు, వేతన జీవులు, సామాన్యులు, పేదలు, పెట్టుబడిదారులు, యువత, మహిళలు వంటి వివిధ వర్గాలు ప్రభావితం అవుతాయి. మోదీ సర్కార్ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 48 లక్షల కోట్ల రూపాయలతో ఉపాధి కల్పనకు అగ్ర తాంబూలం ఇస్తూ... రైతులు, మహిళలు, పేదలు, యువత లక్ష్యంగా 9 అంశాలకు ప్రాధాన్యమిస్తూ పూర్తిస్థాయి బడ్జెట్‌ను 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశ పెట్టింది. ఫిబ్రవరిలో 2025–26 బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టబోతున్నారు. ఈ బడ్జెట్‌పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ఆశాజనకంగా లేని వృద్ధిరేటు, రైతాంగ సమస్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా నిలుస్తున్న నేపథ్యంలో విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సవాళ్లను అధిగమించడానికి బడ్జెట్‌లో ఏ ప్రతిపాదనలు చేయబోతున్నారనే దానిపై ఆసక్తి నెలకొన్నది. 2024– 25 బడ్జెట్‌లో నిర్దేశించుకున్న తొమ్మిది అత్యంత ప్రాధాన్యత కల అంశాలలో ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణ ప్రధానమైనవి. ఉద్యోగాల కల్పన కోసం మూడు, నైపుణ్యాల అభివృద్ధి కోసం రెండు ప్రోత్సాహక పథకాలను ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం కలిగేలా రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు అనేక ప్రోత్సాహకాలను నిరుటి బడ్జెట్‌లో ప్రకటించారు. యువత సులభంగా ఉద్యోగాలను సాధించటానికి 'ఇంటర్న్ షిప్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే 'మోడల్ స్కిల్ లోన్ స్కీం' కింద యువతకు రుణాలు, 'ముద్ర' రుణాల పెంపు లాంటి చర్యలు ఉపాధి – ఉద్యోగాల కల్పనకు పెద్దగా దోహదపడలేదనే చెప్పాలి. ఉద్యోగ ఉపాధి కల్పనలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇవ్వకపోవడం వలన దేశంలో గడిచిన సంవత్సరంలో నిరుద్యోగితా రేటు ఏడు శాతం నుండి 9.2 శాతానికి పెరిగిందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ అంచనా వేసింది.


రైతాంగం కూడా బడ్జెట్‌పై పెద్దగానే ఆశలు పెట్టుకుంది. గత కొంత కాలంగా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆధ్వర్యంలో రైతాంగం ఉద్యమిస్తోంది. కాబట్టి ఎమ్ఎస్‌పీకి చట్టబద్ధత కల్పించే విషయం, 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన' కింద రైతుకి పెట్టుబడి సహాయం 6,000 నుండి 10,000 రూపాయలకు పెంపు నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో తీసుకుంటారని రైతాంగం ఆశిస్తోంది. ఆదాయ పన్ను పరిమితి పెంపు, 80(సి) కింద రాయితీల పరిమితిని పెంచాలని వేతన జీవులు కోరుకుంటున్నారు. ద్రవ్య లోటు అదుపులో ఉన్నదని చెప్తున్నా ఆహార ద్రవ్యోల్బణం పెరగటం, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ ధరలు పెరగటం సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న సందర్భంలో ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనాన్ని నియంత్రణ చేసే చర్యలు చేపట్టాలని అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్నారు.

'ఆత్మ నిర్భర భారత్', 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్', 'వికసిత్ భారత్' లాంటి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు దోహదం చేసేలా 2025–26 బడ్జెట్ ఉంటుందని ఆశిద్దాం.

వ్యాసకర్త కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్
మొబైల్: 98854 65877

ఆత్మసాక్షాత్కారం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఆత్మసాక్షాత్కారం అనేది కొత్తగా తెచ్చి పెట్టుకొనేది కాదు, ఉన్నదానిని తెలుసుకోవడమే. ఎప్పుడైతే నీలో ఆలోచనలు నిలచిపోతాయో, మానసిక చర్యలు ఆగిపోతాయో... అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఎంత కాలం నీలో ఆలోచనలు కలుగుతాయో, అంత కాలం అవి నీ ఆత్మను కప్పివేస్తాయి.

సముద్రంపై కనబడే నీటి బుడగల వంటివే ఈ ఆలోచనలు. ఇవన్నీ లెక్కలేనన్ని పూర్వ జన్మల నుండి ఒకటిగా వచ్చి మనస్సునందు చేరిన సంస్కారాలు. వీటిని నాశనం చేయడమే మన లక్ష్యంగా ఉండాలి.

నీవు మీ ఇంటి డాబాపైకి వెళ్లడానికి నిచ్చెనను ఉపయోగించి, ఒక మెట్టు తర్వాత ఇంకొక మెట్టును ఎక్కి పైకి చేరుకుంటావు కదా. అలాగే ఆత్మసాక్షాత్కారం కూడా! ఒకేసారి పైకి ఎగబాకి ఎవరూ ఆత్మసాక్షాత్కారం పొందలేరు. ఇందుకు నీవు స్థిరంగా, నెమ్మదిగా కార్యాచరణ చేయాలి. నీవు ఆత్మసాక్షాత్కారం పొందడానికి ఏ మార్గం ఎన్నుకున్నప్పటికీ... ముందుగా నీలోని ఆలోచనలను తొలగించుకోవడానికి సాధన చేయాలి. ఇది ఒకటి పూర్తయితే, నీవు నీవుగా 'ఉంటావు'. నీకు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అదే నీ నిజమైన ప్రకృతి.

నిజంగా ఉండేది ఒకే ఒక స్థితి. అదే 'చైతన్య స్థితి'. జాగ్రత్, స్వప్న, నిద్ర అనే మూడు అవస్థలు నిజమైనవి కావు. అవి వస్తూ, పోతూ ఉంటాయి. కేవలం 'నిజమైనది' మాత్రమే ఎల్లప్పుడూ ఉంటుంది.

చైతన్యం ఒక తెర. దీనిపైకి అనేక బొమ్మలు వస్తూ, పోతూ ఉంటాయి. తెర నిజమైనది. బొమ్మలన్నీ కేవలం దీనిపై పడే నీడలు మాత్రమే. జ్ఞానికి లేదా సిద్ధపురుషునికి జాగ్రదావస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ (సుషుప్తి అవస్థ) అనేవి ఉండవు.

జాగ్రదావస్థలోని ప్రపంచాన్ని జ్ఞానులు పట్టించుకోరు. వారికది నిద్రావస్థలాంటిది. అన్ని ప్రాణులూ ఏ నిద్రావస్థలో జగత్తును మరచిపోయి ఉన్నాయో అటువంటి స్థితిలోనే జ్ఞానులు (యోగులు) మెలకువగా ఉన్నారు. అనగా ఏ అఖండ చైతన్యం సర్వప్రాణులకు శూన్యంగా నిద్రలో ఉన్నదో అటువంటి స్థితిలోనే జ్ఞానులు మెలకువగా ఉంటున్నారు.

క్లుప్తంగా...

సదరన్ జోనల్ కౌన్సిల్ ప్రభుత్వ సలహాదారుగా బాలసుబ్రహ్మణ్యం

సీఎస్ ఉత్తర్వులు జారీ

సాక్షి,అమరావతి: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ విభాగం కార్యదర్శిగా పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.బాలసుబ్రహ్మణ్యంను సదరన్ జోనల్ కౌన్సిల్ ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరన్ జోనల్ కౌన్సిల్ విధుల నిర్వహణలో బాలసుబ్రహ్మణ్యం సహాయ సహకారాలు అందిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త

మాచర్ల: పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన తిరుమలకొండ దుర్గారావును పోలీసులు బుధవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్నాడంటూ ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌కు దుర్గారావు సన్నిహితుడు.

మైనార్టీలకు రాయితీ రుణాలు

మంత్రి ఎన్ఎండీ ఫరూక్



సాక్షి, అమరావతి: మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళుతోందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి అర్హత కలిగిన మైనార్టీలకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కోసం 50 శాతం సబ్సిడీపై రూ.326 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు 50 శాతం రాయితీ రుణాలు ఇస్తామన్నారు. నైపుణ్య శిక్షణకు అదనంగా రూ.21.07 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు లింకేజీ ద్వారా 19,790 మందికి రాయితీ రుణాలివ్వనున్నామని, 29,428 మందికి నైపుణ్య శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.


మహారాష్ట్ర రైలు ప్రమాదంపై చంద్రబాబు విచారం



సాక్షి, అమరావతి: మహారాష్ట్రలోని ఇగత్‌పురి సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగితే దేశం రెండు ముక్కలవుతుంది

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



కాకినాడ: ఎస్సీ వర్గీకరణ వల్ల జాతీయ ఐక్యతకు ముప్పు ఏర్పడి దేశం రెండు ముక్కలయ్యే ప్రమాదం ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం కాకినాడలో విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ ప్రతిపాదన కారణంగా దేశం ఉత్తర, దక్షిణ భారతదేశంగా విడిపోతుందన్నారు. వర్గీకరణ ప్రతిపాదన వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోవలసి వచ్చిందని పేర్కొన్నారు. వర్గీకరణ ప్రతిపాదనపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన వైఖరి ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఘాటెక్కిన వెల్లుల్లి



కిలో రూ.450తో వినియోగదారులు బెంబేలు

- పదేళ్ల తర్వాత ఇంత ధర చూస్తున్నామంటున్న వ్యాపారస్తులు
- మధ్యప్రదేశ్‌లో సాగు విస్తీర్ణం తగ్గడమే కారణం
- తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తగ్గిన దిగుమతి

సాక్షి, భీమవరం: నిత్యావసరాల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరవుతున్న సామన్యుడిని వెల్లుల్లి 'ఘాటు' మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. కిలో రూ.450 చేరి చుక్కలు చూపిస్తోంది. పదేళ్ల తర్వాత మళ్లీ ధర భారీగా పెరగడం చూస్తున్నామని వ్యాపారస్తులు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లో సాగు విస్తీర్ణం తగ్గడమే కారణమని చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, పిప్లే, ఉజ్జయిని, దలోదా తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వెల్లుల్లిని తాడేపల్లిగూడెంలోని హోల్‌సేల్ మార్కెట్‌కు తీసుకువస్తుంటారు. ఇక్కడి నుంచే ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణాజిల్లాల్లోని రిటైల్ మార్కెట్‌లకు తరలిస్తుంటారు. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు గతంలో రోజుకు 125 టన్నుల నుంచి 150 టన్నుల వరకు దిగుమతులు జరిగేవి. వెల్లుల్లి పంట దేశంలో అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో సాగవుతుండగా రాజస్థాన్, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గతేడాది ధర ఆశాజనకంగా లేక రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపడంతో వెల్లుల్లి సాగు విస్తీర్ణం తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ఉన్నకొద్ది నిల్వలను అక్కడి వ్యాపారులు భారీ ఎత్తున స్టాకులు పెట్టడంతో కృత్రిమ కొరత ఏర్పడి కొద్దినెలలుగా ధర పెరుగుతూ వచ్చింది. సాధారణంగా వెల్లుల్లి సైజు, పాత, కొత్త రకాన్ని బట్టి పది వరకు క్వాలిటీల్లో విక్రయిస్తుంటారు. వారం పదిరోజుల క్రితం వరకు వాటి క్వాలిటీ మేరకు హోల్‌సేల్ ధర కిలో రూ.180 నుంచి రూ.380 వరకు అమ్మకాలు జరిగాయి. రిటైల్ మార్కెట్‌లోకి వచ్చేసరికి మంచి క్వాలిటీ వెల్లుల్లి కిలో రూ.450 వరకు చేరింది. పదేళ్ల క్రితం అత్యధికంగా కిలో రూ.220 నుంచి రూ.350 వరకు చేరినట్టు హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. తర్వాత అంత ఎక్కువగా ధర పెరగడం మళ్లీ ఇప్పుడే చూస్తున్నామని చెబుతున్నారు. ధర పెరగడంతో ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌కు 25 నుంచి 50 టన్నుల లోపు సరుకు మాత్రమే వస్తున్నట్టు తెలిపారు. వారం రోజులుగా కొత్త పంట మార్కెట్‌లోకి వస్తుండటంతో నాణ్యతను బట్టి హోల్‌సేల్ ధర రూ.130 నుంచి రూ.280 వరకు ఉంది. అయితే కొత్త పంట పాయల్లో తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరగా పాడై పోతుంటాయి. ప్రస్తుతం కొత్త పంట రాకతో ధర కొంత తగ్గడం మూన్నాళ్ల ముచ్చటేనని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు తెలిపారు. రెండు మూడు నెలల తర్వాత మధ్యప్రదేశ్ నుంచి మళ్లీ ఆరబెట్టిన వెల్లుల్లి మార్కెట్‌లోకి వస్తే ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు.

వినియోగదారుల బెంబేలు

మసాల కూరలు వండాలంటే వెల్లుల్లి తప్పనిసరి. నాన్‌వెజ్ వంటకాలకు ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెల్లుల్లి వినియోగం ఎక్కువ. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలొచ్చి సామాన్యుల జీవనం దుర్భరంగా మారింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో క్వాలిటీ వెల్లుల్లి కిలో రూ.450 ఉండటంతో గతంలో అరకిలో, కిలో చొప్పున కొనుగోలు చేసే వినియోగదారులు మరింత తగ్గించి కొనుగోళ్లు చేస్తున్నారు.

కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి

ఇక, పూర్తిస్థాయిలో దిగుమతులు లేక ఉల్లి ధర దిగిరావడం లేదు. నాసిక్, షోలాపూర్ నుంచి తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్‌కు రోజుకు 150 టన్నులు ఉల్లిపాయలు వస్తున్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఏలూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, మండపేట, నరసాపురం తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచే రిటైల్ వ్యాపారులు తీసుకువెళుతుంటారు. ప్రస్తుతం హోల్‌సేల్ ధర క్వాలిటీని బట్టి రూ.10 నుంచి రూ.35 వరకు ఉండగా రిటైల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.50 వరకు ఉంటోంది. గతంలో నాణ్యమైన ఉల్లి రూ.25లోపే ఉండగా ప్రస్తుతం రెట్టింపై వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతోంది.

బాబు కక్ష ఖరీదు.. రూ.3 లక్షల కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వెచ్చించేలా ఒప్పందం చేసుకోవడం గమనార్హం. అంతేకాకుండా రూ.800 కోట్లతో తెలంగాణలో డ్రోన్ టెక్నాలజీ యూనిట్ నెలకొల్పాలని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ నిర్ణయించింది. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌ను కేంద్ర బిందువుగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులతో వేధించడంతోనే ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్‌అంటే హడలిపోయి మహారాష్ట్ర, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడింది. టీడీపీ సర్కారు కక్ష సాధింపు చర్యలతో ఆంధ్రప్రదేశ్ ఏకంగా రూ.3 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు కోల్పోయిన ఉదంతం ఇలా ఉంది...

జిందాల్‌ను వేధించిన బాబు సర్కారు

దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన సజ్జన్ జిందాల్‌ను చంద్రబాబు ప్రభుత్వం బరి తెగించి వేధించింది. వలపు వల (హనీట్రాప్)తో బడా బాబులను బురిడీ కొట్టించి ఆస్తులు కొల్లగొట్టే ఓ మాయలేడీని అడ్డం పెట్టుకుని సజ్జన్ జిందాల్ లాంటి పారిశ్రామికవేత్తను వేధించడం యావత్ దేశాన్ని నివ్వెరపరిచింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కుట్రకు తెర తీసింది. వలపు వల విసిరి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడి ఆస్తులు కొల్లగొట్టడమే ట్రాక్ రికార్డుగా కలిగిన ముంబైకి చెందిన కాదంబరి జత్వానీ అనే మోడల్‌ను టీడీపీ పెద్దలు తమ ఆయుధంగా మార్చుకున్నారు. ఆమె ఫోర్జరీ పత్రాలతో తన ఆస్తులను విక్రయించేందుకు యత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ హయాంలో కుక్కల విద్యాసాగర్ అనే పారిశ్రామికవేత్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ దర్యాప్తులో దీనిపై పూర్తి ఆధారాలు లభించడంతో విజయవాడ పోలీసులు ముంబై వెళ్లి కాదంబరి జత్వానీని అరెస్టు చేసి అక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం అనుమతితో ఆమెను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం ఆమెకు రిమాండ్ విధించడంతో జైలుకు పంపించారు. అనంతరం ఆమెకు బెయిల్ మంజూరైంది. అంతా చట్టబద్ధంగా సాగిన ఈ వ్యవహారాన్ని వక్రీకరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. కాదంబరి జత్వానీ ద్వారా తప్పుడు ఫిర్యాదు ఇప్పించి ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి. కాంతిరాణా, విశాల్ గున్నీలపై కేసులు నమోదు చేసి వారిని సస్పెండ్ చేసింది. పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌ను అరెస్టు చేసింది. కాదంబరి జత్వానీని గతంలో పోలీసులు అరెస్టు చేయడం వెనుక ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ ఉన్నారంటూ చంద్రబాబు ప్రభుత్వం టీడీపీ అనుకూల మీడియాకు లీకులు ఇచ్చి ప్రచారంలోకి తెచ్చింది. ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ జత్వానీ గతంలో ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ కేసును ఉపసంహరించుకునేలా చేసేందుకు... విచారణకు హాజరు కాకుండా అడ్డు కునేందుకే వైఎస్సార్‌సీపీ హయాంలో ఏపీ పోలీసులు ముంబై వెళ్లి జత్వానీని అరెస్టు చేశారంటూ చంద్రబాబు ప్రభుత్వం దుష్ప్రచారం సాగించింది. జిందాల్ రాష్ట్రానికి వస్తే కేసు పెట్టి ఆయన్ను అరెస్ట్ చేస్తారనే రీతిలో కూటమి సర్కారు హడావుడి చేసింది.

ఏపీలో పెట్టుబడులకు ససేమిరా...

బాబు సర్కారు తన నిర్వాకాలతో పారిశ్రామి కవేత్త సజ్జన్ జిందాల్ పరపతికి భంగం కలిగించింది. తాను ఆంధ్రప్రదేశ్‌లో రూ.వేల కోట్ల పెట్టు బడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసు కుంటే... చంద్రబాబు ప్రభుత్వం తనను వేధించడం పట్ల ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టు బడులకు అనుకూల పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన గుర్తించారు. దాంతో రాష్ట్రంలో కొత్త పెట్టుబడి ఒప్పందాలను ఆయన వ్యతిరేకించినట్లు సమాచారం.

మహారాష్ట్రకు తరలిపోయిన రూ.3 లక్షల కోట్లు..

సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూపు మహారాష్ట్రలో ఏకంగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. ఈమేరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్, గడ్చిరోలి, నాగ్‌పూర్ ప్రాంతాల్లో ఈ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఇనుము–ఉక్కు, సౌర విద్యుత్తు, ఆటోమొబైల్, సిమెంట్ పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించింది. చైనాకు చెందిన ఎస్ఏఐసీ మోటార్స్‌తో సంయుక్తంగా ఎలక్ట్రానిక్ వాహనాలు (ఈవీ), హైపర్‌ఫార్మెన్స్ బ్యాటరీల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 2027 డిసెంబరుకు ఈవీ వాహనాలను మార్కెట్‌లోకి ప్రవేశపెడతామని తెలిపింది. జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ద్వారా రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులతో మహారాష్ట్రలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సజ్జన్ జిందాల్ ప్రకటించారు. చంద్రబాబు ప్రభుత్వం ఆయ న్ని అక్రమ కేసులతో వేధించకుంటే ఆ పెట్టుబడులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కే వచ్చి ఉండేవని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

నాడు.. పెట్టుబడులకు రాచబాట..

వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉండేవి. వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే పరిష్కరిస్తామని.. పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంటామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టి భరోసా ఇచ్చారు. అందువల్లే సజ్జన్ జిందాల్ గ్రూపు నాడు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంది. కడపలో రూ.8,500 కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడింది. విజయనగరం జిల్లాలో భారీ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ కేసులు, వేధింపులతో పారిశ్రామికవేత్తలు హడలిపోతు న్నారు. సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ఆంధ్రప్రదేశ్‌లో కాకుండా మహారాష్ట్ర, తెలంగాణలో రూ.3 లక్షల కోట్లకుపైగా పెట్టుబడు లకు ఒప్పందం చేసుకోవడం దీనికి తాజా నిదర్శనం.

నెత్తురోడిన కర్ణాటక రోడ్లు

ఏపీకి చెందిన ముగ్గురు వేద విద్యార్థులు సహా 14 మంది దుర్మరణం

సాక్షి, బెంగళూరు: కన్నడనాడు నెత్తురోడింది. కర్ణాటకలో మంగళవారం అర్ధ రాత్రి, బుధవారం తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వేద విద్యార్థులు సహా 14 మంది మృత్యువాతపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర తాలూకా జాతీయ రహదారి 63పై కూరగాయల లారీ బోల్తా పడి 10 మంది మృత్యువాత పడ్డారు. మంగళవారం అర్ధ రాత్రి రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా అరగినమర వద్ద వేద విద్యార్థులు ప్రయాణిస్తున్న క్రూసర్ వాహనం పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు, వాహనం డ్రైవర్ దుర్మరణం చెందారు.

కూరగాయల కింద నలిగిపోయి

బుధవారం తెల్లవారుజామును 4.30 గంటల సమయంలో యల్లాపుర తాలూకా జాతీయ రహదారి 63పై లారీ బోల్తా పడటంతో కూరగాయల కింద నలిగిపోయి 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. 15 మంది గాయపడ్డారు. కుమటాలో బుధవారం జరిగే సంతకు సవణూరు నుంచి 28 మంది కూరగాయలతో లారీలో బయల్దేరారు. లారీ నిండా కూరగాయల బస్తాలు పెట్టి, పైన కూర్చున్నారు. ఈ లారీ గుళ్లాపురఘట్ట వద్ద జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా రోడ్డు



బోల్తా పడిన వేద విద్యార్థుల వాహనం

వాలును డ్రైవర్ గుర్తించకపోవడంతో ఎడమవైపునకు జారిపోయింది. 50 మీటర్ల గుంతలో పడిపోయింది. ప్రయాణికులపై పండ్లు, కూరగాయల బస్తాలు లారీ పడ్డాయి. వాటి కింద నలిగిపోయి, ఊపిరాడక గంటపాటు నానాయాతన పడ్డారు. గంట తర్వాత క్రేన్ వచ్చి లారీని పైకెత్తి చూడగా అప్పటికే 9 మంది మరణించారు. మరో వ్యక్తి ఆస్పత్రిలో మరణించాడు. మృతులను కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లా సవణూరు పట్టణానికి చెందిన ఫయాజ్ జమఖండి (51), వసీం ముడగేరి (25), ఇజాజ్ ముల్లా (20), సాధిక్ బాషా (30), గులామ హుస్సేన్ జవళి (25), ఇమ్తియాజ్ ముళకేరి (30), అల్ఫాజ్ జాఫర్ మండక్కి (42), జిలానీ అబ్దుల్ జఖాతి (20), అస్లాం (24), జలాల (29)గా గుర్తించారు. గాయపడిన 15 మందిని హుబ్లీ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

నరహరి తీర్థలో ఆరాధనకు వెళ్తూ వేద విద్యార్థులు మృత్యువాత

మంగళవారం అర్ధరాత్రి రాయచూరు–సింధనూరు ప్రధాన రహదారిపై క్రూసర్ వాహనం బోల్తాపడ్డ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మరణించారు. కర్ణాటకలోని కొప్పళ జిల్లా హంపి సమీపంలోని నరహరి తీర్థలో జరుగుతున్న మూడు రోజుల ఆరాధన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ పాఠశాల వేద విద్యార్థులు 13 మంది క్రూసర్ వాహనంలో మంగళవారం బయల్దేరారు. రాత్రి 11 గంటల తర్వాత వాహనం రాయచూరు–సింధనూరు ప్రధాన రహదారిలో వైష్ణవి దేవీ దేవాలయం వద్దకు చేరుకుంది. అక్కడి క్రాస్ వద్ద అతివేగంగా వెళుతుండగా రోడ్డుపై బ్రిడ్జిని డ్రైవర్ సరిగా గమనించలేదు. హఠాత్తుగా బ్రిడ్జి కనిపించడంతో ఒక్కసారిగా వాహనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో యాక్సిలరేటర్ కూడా విరిగిపోయింది. వాహనం వేగం తగ్గకపోవడం, హఠాత్తుగా బ్రేకులు వేయడంతో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో వేద పాఠశాల విద్యార్థులు హయవదన (18), సుజయీంద్ర (22), అభిలాష్ (20), వాహనం డ్రైవర్ కంసాలి శివ (20) మరణించారు. గాయపడిన మరో 10 మంది విద్యార్థులను స్థానిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సింధనూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.



వేద విద్యార్థుల మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు సంతాపం

సాక్షి, అమరావతి: కర్ణాటకలోని సింధనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వేద విద్యార్థులు, డ్రైవర్ మరణించడంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 'కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి కర్ణాటకలోని హంపీ ఆరాధన కార్యక్రమాలకు వెళ్తుండగా వాహనం బోల్తా పడటంతో వేద పాఠశాల విద్యార్థులు ముగ్గురు, డ్రైవర్ చనిపోయిన ఘటన అత్యంత బాధాకరం. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడాలి' అని వైఎస్ జగన్ కోరారు.

మృతుల కుటుంబాలకు కర్ణాటక ప్రభుత్వం పరిహారం

ఈ రెండు దుర్ఘటనలపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. అతివేగం, నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు కారణమన్నారు.

వేధిస్తే పరిశ్రమలు వస్తాయా?

- చంద్రబాబు కూటమి ప్రభుత్వమే పరిశ్రమలకు శాపం
- కమీషన్ల కోసం కూటమి నాయకులు పారిశ్రామికవేత్తలను వేధిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ధ్వజం



సాక్షి, అమరావతి: కూటమి నాయకులు, ఎమ్మెల్యేలే పారిశ్రామికవేత్తలను కమీషన్ల కోసం బెదిరిస్తుంటే రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి ఎవరు ముందుకొస్తారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి సానుకూల పరిస్థితులు లేవని, చంద్రబాబు కూటమి ప్రభుత్వమే పరిశ్రమలకు పెద్ద శాపమని చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి పార్టీల నాయకుల్లో కమీషన్ల కోసం కొందరు, రాజకీయ ఎత్తుగడలతో మరికొందరు ఏడు నెలల్లోనే రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చారని తెలిపారు. వారి తీరుతో పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటేనే వణికిపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో దావోస్ పర్యటనకు వెళ్లిన తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని పెట్టుబడుల ప్రవాహం వస్తోందంటూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తీరుతోనే కడప వద్ద సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం ఆగిపోయిందన్నారు. వైఎస్ జగన్ హయాంలో సజ్జన్ జిందాల్ కడపలో రూ.8,800 కోట్లతో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారని, రాష్ట్రంలో మరో రూ.50,500 కోట్ల పెట్టుబడులకు 6 ఒప్పందాలు కూడా చేసుకున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు కారణంగా ఆయన కంపెనీ రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని, అదే జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ రూ.3 లక్షల కోట్లతో మహారాష్ట్రలోని గడ్చిరోలి వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ, మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాయని తెలిపారు. ముంబైకి చెందిన నటి కాదంబరి జెత్వానితో సజ్జన్ జిందాల్‌పై నిందారోపణలు చేసి, అక్రమ కేసులు బనాయించి దారుణంగా వేధించారని తెలిపారు. కూటమి నాయకులకు కప్పం కట్టలేదని దాల్మియా గ్రూప్‌నకు చెందిన 11 లారీలను నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి స్వయంగా అదానీ పోర్టుకి వెళ్లి కమీషన్ల కోసం ఉద్యోగులను బెదిరించారని తెలిపారు. పరిస్థితులు ఇంతలా దిగజారిపోతే పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

పర్యాటక పాలసీలో లోటుపాట్లు సవరిస్తాం

ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన టూరిజం పాలసీలో లోటుపాట్లు పరిశీలించి.. అన్ని వర్గాల సలహాలు సూచనలు తీసుకుని సవరణలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ కాటా ఆమ్రపాలీ స్పష్టం చేశారు. మూడు రోజుల విశాఖ పర్యటనలో భాగంగా.. ఆమె వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు కె.విజయ్‌మోహన్, కార్యదర్శి ఎం.వి. పవన్ కార్తీక్ పాలసీలో హోటల్స్ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం గురించి ఆమెకు వివరించారు. సింగిల్ విండో పాలసీపై విధివిధానాలు జారీ చేయాలని కోరారు.

ఎన్‌టీఆర్ కళా సంబరాలకు విద్యుత్ చౌర్యం



పీవీఆర్ గ్రౌండ్ బయట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ క్యారియర్ నుంచి లాగిన విద్యుత్ వైర్లు

తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు ఏటా ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో కళా సంబరాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఒంగోలు పీవీఆర్ స్కూల్ గ్రౌండ్‌లో గత శనివారం సాంస్కృతిక వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యా యి. భారీ ఫ్లడ్ లైట్లతో, విద్యుత్ దీపాలతో ప్రాంగణాన్ని అలంకరించారు. ఇందుకోసం విద్యుత్‌ను మైదానానికి బయట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ క్యారియర్‌కు వైర్లు తగిలించి అక్రమంగా వినియోగిస్తున్నారు. రోజూ వందల యూనిట్ల విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. సమావేశాల్లో నీతి వాక్యాలు చెప్పే నాయకుడు ఇలా విద్యుత్ చౌర్యం చేయడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

'డిజిటల్ అరెస్ట్' ముఠా గుట్టురట్టు

సీబీఐ అధికారులమంటూ వృద్ధురాలి నుంచి రూ.2.50 కోట్లు కొట్టేసిన మోసగాళ్లు

తిరుపతి క్రైం: 'ఢిల్లీ నుంచి సీబీఐ అధికారిని మాట్లాడుతున్నాను. రూ.200 కోట్ల మనీ ల్యాండరింగ్ జరిగింది.. అందుకు మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నాం' అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ముఠా గుట్టురట్టు చేసినట్టు తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న 65 ఏళ్ల వృద్ధురాలికి వాట్సాప్ ద్వారా వీడియో కాల్ వచ్చింది. తాను సీబీఐ అధికారినని, రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులకు సంబంధించిన వివరాల కోసం ఫోన్ చేశానని నమ్మించాడు. వృద్ధురాలి పేరిట ఉన్న బ్యాంక్ అకౌంట్‌లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని అందువల్ల డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని భయపెట్టాడు. వివిధ అకౌంట్లలోకి నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తే వాటిని పరిశీలించి.. మనీలాండరింగ్ కేసులో ఇన్‌వాల్వ్ కాకపోతే ఆ డబ్బును విడుదల చేస్తామని చెప్పి నమ్మించాడు. దీంతో ఆ వృద్ధురాలు తన ఖాతాలోని రూ.2.50 కోట్లను ఆ వ్యక్తి చెప్పిన అకౌంట్లలో జమ చేసింది. అనంతరం ఆ వ్యక్తి స్పందించకపోవడంతో ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రత్యేక బృందంతో దర్యాప్తు

నగదు వేసిన అకౌంట్ల లావాదేవీలను నిలిపివేసి, ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్పీఅన్నారు. ముఠాకు సహకరించిన రాజమండ్రికి చెందిన అరుణ్ వినయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుండి రూ.24.50 లక్షల నగదు, ఓ కారు, రెండు సెల్ ఫోన్లు, రెండు లాప్‌ట్యాప్‌లు, 16 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. 13 బ్యాంక్ అకౌంట్లలోని రూ.26 లక్షల నగదు సీజ్ చేశామని, వీటిలో 7 అకౌంట్లు పెందుర్తిలో గుర్తించామని వివరించారు.

ఆ గిరిజన గ్రామాలు ఏమయ్యాయి?

792 గ్రామాలకు గాను 292 గ్రామాలే ఉన్నాయా?

- మిగతావన్నీ ఎలా మాయమైనట్లు?
- గిరిజన ప్రాంతాల పరిధులు ఎందుకు కుదిస్తున్నారు?
- పూర్తి వివరాలను మా ముందుంచండి
- కేంద్ర గిరిజన శాఖ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని 792 గిరిజన గ్రామాలకు ప్రస్తుతం 292 గ్రామాలే ఉండటంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. మిగిలిన గ్రామాలన్నీ ఏమయ్యాయని, ఎలా మాయమయ్యాయని అధికారులను నిలదీసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని, లేని పక్షంలో తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యక్తిగతంగా హాజరు కావాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిని ఆదేశించింది. గిరిజన ప్రాంతాల పరిధిని, విస్తీర్ణాన్ని ఎందుకు, ఏ అధికారంతో కుదించేస్తున్నారో కూడా వివరించాలంది. తదుపరి విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజనేతరుల కోసం గిరిజన ప్రాంతాల విస్తీర్ణాన్ని అధికారులు తగ్గించేస్తున్నారని, పెద్ద సంఖ్యలో గ్రామాలను పట్టణాల్లో కలిపేస్తున్నారంటూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టి.వెంకట శివరాం దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎ. శ్యాంసుందర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అధికారులు ఉద్దేశపూర్వకంగా గిరిజన ప్రాంతాల విస్తీర్ణాన్ని, పరిధులను కుదించేస్తున్నారని తెలిపారు. పెద్ద సంఖ్యలో గిరిజన గ్రామాలను పట్టణ ప్రాంతాల్లో కలిపేశారన్నారు. దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని, గిరిజనేతరులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. అందుకే గిరిజన ప్రాంతాలను నిర్దిష్టంగా నోటిఫై చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. అధికారులు సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన వివరాల ప్రకారం గతంలో 792 గ్రామాలు ఉండగా, ప్రస్తుతం 292 గ్రామాలే ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ గిరిజన ప్రాంతాల పరిధులను ఎందుకు కుదించేస్తున్నారని ప్రశ్నించింది. దీనిపై కేంద్రం ఎందుకు స్పందించడంలేదని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది అయిన డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావును ప్రశ్నించింది. తాము పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగామని, ఇప్పటి వరకు ఇవ్వలేదని పొన్నారావు తెలిపారు. తదుపరి విచారణ నాటికి అఫిడవిట్ రూపంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది.

చర్చలకు రాకపోతే ఆంక్షలే



రష్యా అధినేత పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక ● తాను అధికారంలో ఉంటే ఉక్రెయిన్‌-రష్యా యుద్ధం జరిగేది కాదని వెల్లడి

వాషింగ్టన్‌: రష్యా అధినేత పుతిన్‌ను కలుసుకోవడానికి ఆసక్తితో ఉన్నానని, ఎప్పుడైనా సరే ఆయనతో చర్చలకు తాను సిద్ధమని అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. చర్చలకు ముందుకు రాకపోతే రష్యాపై అదనపు ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. చర్చల బల్ల వద్ద కలుసుకుందామని పుతిన్‌కు సూచించారు. ఉక్రెయిన్‌-రష్యా యుద్ధంలో ఇప్పటికే లక్షలాది మంది మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. సైనికులతోపాటు సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం, నగరాలు, పట్టణాలు శిథిలాలుగా మారుతుండడం బాధాకరమని అన్నారు. మీడియాలో వస్తున్న వార్తల కంటే ఉక్రెయిన్‌లో మృతుల సంఖ్య అధికంగా ఉందన్నారు. వాస్తవాలు చెప్పడం లేదని మీడియాపై మండిపడ్డారు. ట్రంప్ స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం తాను అధ్యక్షుడిగా ఎన్నికై ఉంటే ఉక్రెయిన్‌-రష్యా యుద్ధం జరిగేది కాదని స్పష్టం చేశారు. సమర్థుడైన పాలకుడు అధికారంలో ఉంటే యుద్ధాలకు ఆస్కారం ఉండదని అన్నారు. పుతిన్ చాలా తెలివైన వ్యక్తి అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ గత అధ్యక్షుడు జో బైడెన్‌ను, రష్యా ప్రజలను పుతిన్ అగౌరవపర్చారని ఆక్షేపించారు. పుతిన్ గురించి తనకు బాగా తెలుసని చెప్పారు. తాను పదవిలో ఉంటే మధ్యప్రాచ్యంలో సంక్షోభం తలెత్తేది కాదని పునరుద్ఘాటించారు.

200 మిలియన్‌ డాలర్లు అధికంగా ఖర్చు చేశాం

ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరా, ఆర్థిక సాయం నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తామని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడుతున్నామని, త్వరలో పుతిన్‌తోనూ మాట్లాడుతామని చెప్పారు. ''ఉక్రెయిన్‌- రష్యా యుద్ధానికి యూరోపియన్ యూనియన్ కంటే అమెరికా 200 మిలియన్ డాలర్లు అధికంగా ఖర్చు చేసింది. మాతో సమానంగా యూరోపియన్ యూనియన్ భారం భరించాల్సిందే. మేము ఎక్కువ ఖర్చు పెట్టాం అంటే నిజంగా మూర్ఖులమే. అందులో సందేహం లేదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. శాంతిని కోరుకుంటున్నట్లు జెలెన్‌స్కీ తనతో చెప్పారని వివరించారు. ఏం జరుగుతుందో చూద్దామని చెప్పారు. పుతిన్ ఎప్పుడు కోరుకుంటే అప్పుడు చర్చలకు సిద్ధమని ట్రంప్ తేల్చిచెప్పారు. యుద్ధంలో మరణాలు ఇక ఆగిపోవాలని అన్నారు.

కృత్రిమ మేధలో 500 బిలియన్‌ డాలర్ల పెట్టుబడులు

చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం టారిఫ్ విధించాలని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. చైనా నుంచి ఫెంటానైల్ అనే ప్రమాదకరమైన మాదకద్రవ్యం రాకుండా అడ్డుకోనున్నట్లు చెప్పారు. చైనా నుంచి మెక్సికో, కెనడా వంటి దేశాలకు, అక్కడి నుంచి అమెరికాకు ఫెంటానైల్ చేరుకుంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌తోపాటు అక్రమ వలసదార్లను అమెరికాలోకి పంపిస్తున్న దేశాల ఉత్పత్తులపై భారీగా పన్నులు విధిస్తామని ఆయన గతంలోనే హెచ్చరించిన సంగతి తెలిసిందే. కృత్రిమ మేధ(ఏఐ) మౌలిక సదుపాయాల కల్పనకు 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒక కొత్త కంపెనీ ద్వారా నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఒరాకిల్, సాఫ్ట్ బ్యాంక్, ఓపెన్ ఏఐ భాగస్వామ్యంతో ఈ కంపెనీని స్థాపిస్తామన్నారు. స్టార్‌గేట్‌గా పిలిచే ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

పట్టాలపై మృత్యుఘోష

రైల్లోంచి పట్టాలపైకి దూకి మరో రైలుకు బలి

12 మంది దుర్మరణం ● 15 మందికి గాయాలు

- మంటలు అంటుకున్నాయంటూ వదంతులు చెలరేగడమే కారణం
- మహారాష్ట్రలో మాటలకందని ఘోరం

జల్‌గావ్‌ (మహారాష్ట్ర): రైల్లో మంటలు అంటుకున్నాయని భయపడ్డారు. ప్రాణాలు కాపాడుకునేందుకు చైను లాగి మరీ పట్టాలపైకి దూకేశారు. కానీ మరో రైలు రూపంలో ఆ పట్టాలపై దూసుకొచ్చిన మృత్యువుకు బలయ్యారు. దానికింద నలిగి నిస్సహాయంగా మృత్యువాత పడ్డారు. మాటలకందని ఈ ఘోరం మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో జరిగింది. లఖ్‌నవూ నుంచి ముంబై వెళ్తున్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ జల్‌గావ్ స్టేషన్ దాటి మహేజీ, పర్ధాడే స్టేషన్ల మధ్య పచోరా ప్రాంతంలో ఉండగా బుధవారం సాయంత్రం 4.45 సమయంలో జనరల్ బోగీల మధ్య నిప్పురవ్వలు, పొగ ఎగసిపడ్డాయి. దాంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. రైల్లో భారీగా మంటలు అంటుకున్నాయంటూ వదంతులు వ్యాపించడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు వెంటనే ఎమర్జెన్సీ చైన్ లాగేశారు. రైలు ఆగీ ఆగగానే పట్టాలపైకి దూకేశారు. అదే సమయంలో బెంగళూరు-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఆ పట్టాలపై శరవేగంగా దూసుకొచ్చింది. దాంతో చాలామంది తప్పుకునే అవకాశం కూడా లేక ఆ రైలు కింద నలిగి ప్రాణాలొదిలారు. ఇప్పటిదాకా 12 మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదంలో 15 మంది స్వల్పంగా గాయపడ్డారు. తెగిపడ్డ అవయవాలతో ఘటనా స్థలి భీతావహంగా మారింది. ప్రమాద సమయంలో కర్నాటక ఎక్స్‌ప్రెస్ గంటకు 130 నుంచి 140 కి.మీ. వేగంతో ఉన్నట్టు సమాచారం. పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో చిన్న నిప్పురవ్వలు మాత్రమే రేగాయని, దాంతో కాస్తంత పొగ వెలువడిందని ప్రాథమిక విచారణలో తేలింది. యాక్సెల్ వేడెక్కడమో, బోగీల మధ్య బ్రేక్ జామవడమో నిప్పురవ్వలకు కారణం అయ్యుంటుందని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

షా దిగ్భ్రాంతి

రైలు ప్రమాదం పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఫోన్లో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ఫడ్నవీస్ రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితరులు కూడా ప్రమాదంపై విచారం వెలిబుచ్చారు.



ప్రమాదం అనంతరం పట్టాల వద్ద బారులు తీరిన ప్రయాణికులు, స్థానికులు

మృత్యుమలుపు

మలుపే ప్రయాణికుల పాలిట మృత్యువైంది. ప్రమాదాన్ని తప్పించేందుకు రెండు రైళ్ల డ్రైవర్లు శాయశక్తులా ప్రయత్నించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ''పుష్పక్ రైలు ఆగగానే డ్రైవర్ ఫ్లాషర్ లైట్ వేశాడు. దాన్ని చూస్తూనే కర్నాటక ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ ఎమర్జెన్సీ బ్రేకులు వేశాడు. కానీ అదప్పటికే పుష్పక్ రైలుకు అతి సమీపానికి వచ్చేసింది. పైగా అక్కడి మూలమలుపు వల్ల పట్టాలపైకి దూకిన ప్రయాణికులకు రైలు కన్పించలేదు'' అని వివరించారు.

చక్రాల్లోంచే నిప్పురవ్వలు

ప్రత్యక్ష సాక్షుల కథనం

పుష్పక్ రైలు చక్రాల్లోంచి నిప్పురవ్వలు రావడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయినట్టు రైల్లోని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ''ఎవరో చైను లాగడంతో కల్వర్ట్ వాల్ సమీపంలో రైలు ఆగింది. చాలామంది చెరోవైపు దూకేశారు. పట్టాలవైపు దూకిన వారిపైకి ఎదురుగా వచ్చిన రైలు దూసుకెళ్లింది'' అని వివరించారు. సమీప గ్రామాల ప్రజలు తక్షణం రంగంలోకి దిగి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సమర్థులైన వ్యక్తులే రావాలి

హెచ్‌-1బీ వీసాలపై ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్‌: అమెరికాలోకి సమర్థులైన వ్యక్తులు రావడాన్నే తాను ఇష్టపడతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. హెచ్‌-1బీ వీసాలపై తీవ్రమైన చర్చ జరుగుతున్న సందర్భంలో ఒరాకిల్ సీటీవో లారి ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్, ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్‌తో కలిసి ట్రంప్ వైట్‌హౌస్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌-1బీ వీసాలపై జరుగుతున్న చర్చపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు. హెచ్‌-1బీ వీసాలను ఎలాన్ మస్క్ వంటి ట్రంప్ సన్నిహితులు, పారిశ్రామికవేత్తలు సమర్థిస్తుండగా, రిపబ్లికన్ పార్టీలో చాలా మంది నేతలు వ్యతిరేకిస్తున్నారు. అమెరికన్ల ఉద్యోగాలు లాగేసుకుంటున్నాయని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ''అయితే తాను రెండు వైపులా వాదనలు విన్నా. రెండు వాదనలూ నచ్చాయి. ఒక్క ఇంజనీర్లే కాకుండా అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో సమర్థులైన వ్యక్తులే తమదేశంలోకి రావాలని కోరుకుంటున్నా. అందుకు ఏకైక మార్గం హెచ్‌-1బీ వీసా'' అని ట్రంప్ స్పష్టం చేశారు. అత్యంత వృత్తి నైపుణ్యమున్న విదేశీయులకు అమెరికన్ కంపెనీలు తమ సంస్థల్లో నియమించుకునేందుకు హెచ్‌-1బీ వీసాలు ఇచ్చి అమెరికాకు రప్పించుకుంటున్న విషయం తెల్సిందే. హెచ్‌-1బీ వీసాల్లో దాదాపు 72 శాతం వీసాలను భారతీయులే సాధించడం తెల్సిందే. హెచ్‌-1బీ వీసాదారుడు గరిష్టంగా ఆరేళ్ల పాటు అమెరికాలో ఉండేందుకు వీలుంటుంది. ఈ వీసాను తొలుత మూడేళ్లు మంజూరు చేయగా, మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. అయితే హెచ్‌-1బీ వీసా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు పరిశీలన దశలో ఉండగా అమెరికాను వీడొద్దనే నిబంధన ఉంది. తాను అధికారంలోకి వస్తే అమెరికన్లకే అత్యధిక ఉద్యోగ అవకాశాలు దక్కేలా చేస్తానని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించడంతో హెచ్‌-1బీ వీసాలకు కోతపడొచ్చన్న ఆందోళనకు ఎక్కువైన సంగతి తెల్సిందే. అయితే సోమవారం ప్రమాణస్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే పలు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన ట్రంప్ హెచ్‌-1బీపై పరోక్షంగా మాట్లాడారు. 'లీగల్ ఇమ్మిగ్రేషన్‌ను నేను సమర్థిస్తాను. ఎందుకంటే మాకు అలాంటి వ్యక్తుల అవసరం ఉంది. వాళ్లు కచ్చితంగా కావాల్సిందే'' అని ట్రంప్ అన్నారు. 2024లో భారత్‌సహా 192 దేశాలకు చెందిన 2,70,000 మందికి పైగా అక్రమవలసదారులను యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బహిష్కరించింది. 2014 ఏడాది తర్వాత ఇంతమందిని ఒకేసారి బహిష్కరించడం ఇదే తొలిసారి. బహిష్కరణకు గురైన వారిలో 1,529 మంది భారతీయులు ఉన్నారు. 2024 ప్యూ రీసెర్చ్ నివేదిక ప్రకారం అమెరికాకు అక్రమంగా వచ్చిన వారిలో భారతీయమూలాలున్న వ్యక్తులు మూడో అతిపెద్ద సమూహంగా ఉన్నారు. మొదటి, రెండో స్థానాల్లో మెక్సికో, సాల్వడార్ దేశస్థులు ఉన్నారు.

మోదీ, ట్రంప్ భేటీ ఫిబ్రవరిలో?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ ఫిబ్రవరిలోనే జరగనుందా? ఈ దిశగా ఇరు దేశాల దౌత్యవేత్తల స్థాయిలో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయా? అవుననే అంటోంది రాయిటర్స్ వార్తా సంస్థ. వారు వాషింగ్టన్‌లో భేటీ కానున్నారని భారత దౌత్యవర్గాలను ఉటంకిస్తూ కథనం వెలువరించింది. ''ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంలో మోదీ, ట్రంప్ మధ్య ఉన్న స్నేహబంధం కీలకపాత్ర పోషించనుంది. చైనా దూకుడును అడ్డుకోవడంపై ఈ భేటీలో నేతలిద్దరూ దృష్టి సారించే అవకాశముంది. ఇక భారతీయులను ఆందోళన పరుస్తున్న వలసలపై కఠిన వైఖరి, జన్మతః పౌరసత్వం రద్దు తదితర అంశాలను మోదీ ప్రముఖంగా లేవనెత్తవచ్చు. హెచ్‌-1బీ వీసాల్లో సింహభాగం భారతీయులే దక్కించుకుంటారన్నది తెలిసిందే. అమెరికా వస్తువులపై భారత్ విధిస్తున్న సుంకాలు మరీ ఎక్కువని పదేపదే ఆక్షేపిస్తున్న ట్రంప్ ఈ అంశాన్ని మోదీతో లేవనెత్తవచ్చు. సుంకాలను తగ్గించడంతో పాటు అమెరికా పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా పలు నిర్ణయాలను ఈ భేటీలో ట్రంప్ ముందుంచాలని మోదీ భావిస్తున్నారు'' అని రాయిటర్స్ పేర్కొంది. భారత్‌కు అతి పెద్ద వర్తక భాగస్వామిగా అమెరికా కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2023-24లో 118 బిలియన్ డాలర్ల మేరకు ద్వైపాక్షిక వర్తకం జరిగింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఈడీకి లక్ష జరిమానా

ప్రజలను వేధించొద్దని బాంబే హైకోర్టు హితవు

ముంబై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి బాంబే హైకోర్టు మంగళవారం రూ.లక్ష జరిమానా విధించింది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై మనీ లాండరింగ్ కింద దర్యాప్తు చేపట్టడాన్ని తప్పుపట్టింది. ప్రజలను అనవసరంగా వేధించవద్దని ఈడీకి తేల్చిచెప్పింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తగదని హితవు పలికింది. ఎవరైనా సరే చట్టం పరిధిలోనే పని చేయాలని, అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. ముంబైకి చెందిన రాకేశ్ జైన్ అనే స్థిరాస్తి వ్యాపారిపై ఈడీ మనీ లాండరింగ్ కింద దర్యాప్తు ప్రారంభించగా, ఆయన హైకోర్టు ను ఆశ్రయించారు. ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఒకరు ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. ఇందులో మనీ లాండరింగ్ కోణం లేదని హైకోర్టు గుర్తించింది. రాకేశ్ జైన్‌ను వేధించాలన్న ఉద్దేశంతోనే ఈడీ దర్యాప్తు చేపట్టినట్లు తప్పుపట్టింది.

జెనిన్‌లో ఇజ్రాయెల్ సైన్యం ఆపరేషన్

9 మంది పాలస్తీనియన్ల మృతి

జెనిన్: ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్ దళాలు జరిపిన భారీ ఆపరేషన్‌లో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించారు. 35 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. సాయుధ సంస్థలకు కంచుకోటగా ఉన్న జెనిన్‌లో ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు విస్తృతమైన ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయెల్ కాల్పుల్లో గాయపడిన వారిలో ముగ్గురు వైద్యులు, ఇద్దరు నర్సులు ఉన్నారని జెనిన్ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ విస్సామ్ బకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఇజ్రాయెల్ దళాలు వెళ్లడానికి ముందే జెనిన్ శరణార్థి శిబిరం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల నుంచి స్థానిక భద్రతా సిబ్బంది వైదొలిగారు. ఇజ్రాయెల్ దళాలు పౌరులపై కాల్పులు జరిపాయని, దీంతో పలువురు గాయపడ్డారని పాలస్తీనా భద్రతా దళాల ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అన్వర్ రజాబ్ తెలిపారు. జెనిన్‌లో ఒక టీనేజర్‌సహా 9 మందిని ఇజ్రాయెల్ బలగాలు అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాయని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం సాయంత్రం ప్రకటించింది. టియానిక్ గ్రామంలోనూ ఇజ్రాయెల్ దళాలు ఒక వ్యక్తిని కాల్చి చంపాయి. గాజాలో కాల్పుల విరమణ ప్రారంభమైన మూడు రోజుల తర్వాత, వెస్ట్‌బ్యాంక్‌లో దాడులు జరగడం గమనార్హం. ''వెస్ట్ బ్యాంక్‌లో భద్రతను బలోపేతానికి, మా లక్ష్యాలను సాధించడానికి మరో ముందడుగుగా జెనిన్ ఆపరేషన్ చేపట్టాం. లెబనాన్, సిరియా, యెమెన్, వెస్ట్ బ్యాంక్‌లలో ఇరాన్ ఏ ప్రాంతంపై ప్రభావం చూపించాలనుకున్నా మేం దానిని అడ్డుకుంటాం'' అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. వెస్ట్‌బ్యాంక్‌లోని హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్, ఇతర సాయుధ గ్రూపులకు ఇరాన్ ఆయుధాలు, నిధులను అందిస్తోందని ఆరోపించారు. '' ఈ ప్రాంతాల్లో సాయుధ బృందాల మౌలిక సదుపాయాలను విచ్ఛిన్నం చేయడం ఈ ఆపరేషన్ ముఖ్య లక్ష్యం'' అని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది.

మణిపూర్ బీజేపీ సర్కార్‌కు జేడీ(యూ) మద్దతు ఉపసంహరణ!

ఇంఫాల్: బీజేపీకి మిత్రపక్షంగా కొనసాగుతున్న జేడీ(యూ) మణిపూర్‌లో మాత్రం ఆ పార్టీకి షాక్ ఇచ్చింది. బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి జేడీ(యూ) మణిపూర్ యూనిట్ మద్దతు ఉపసంహరించింది. ఈ మేరకు జేడీ(యూ) మణిపూర్ అధ్యక్షుడు క్షేత్రిమయూమ్ బీరేన్‌సింగ్ రాష్ట్ర గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాకు లేఖ రాశారు. రాష్ట్రంలో జేడీ(యూ)కు ఒకే ఒక్క ఎమ్మెల్యే మొహమ్మద్ అబ్దుల్ నసీర్ ఉన్నారు. ఆయన ఇకపై ప్రతిపక్ష స్థానంలో కూర్చుంటారని పార్టీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. జేడీ(యూ) మద్దతు ఉపసంహరించినప్పటికీ బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. 60 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలతోపాటు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(యూ) నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. వీరిలో ఐదుగురు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విచారణ స్పీకర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉంది.

మణిపూర్ జేడీ(యూ) చీఫ్‌పై వేటు

జేడీ(యూ) మణిపూర్ అధ్యక్షుడు క్షేత్రిమయూమ్ బీరేన్‌సింగ్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ బుధవారం ప్రకటించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి తమ మద్దతు యథాతథంగా కొనసాగుతుందని వెల్లడించారు.



బుధవారం త్రివేణి సంగమంలో కేబినెట్ మంత్రులతో కలిసి స్నానం చేస్తున్న యూపీ సీఎం యోగి

10 రోజులు కోట్లు

మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

సాక్షి, న్యూఢిల్లీ/మహాకుంభ్ నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో 10 రోజుల్లోనే ఏకంగా 10 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. త్రివేణి సంగమ స్థలికి భక్తులు బారులు తీరుతున్నారు. కుంభమేళాకు చేరుకోవడానికి రైళ్లు, విమానాలపై ఆధారపడుతున్నారు. వెయ్యికి పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నా భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. ప్రతి రైల్లోనూ చాంతాడంత వెయిటింగ్ లిస్టులు ఉంటున్నాయి. జనరల్ బోగీల పరిస్థితైతే వర్ణనాతీతం! ఒక్కో రైలుకు నాలుగైదు చొప్పున జనరల్ బోగీలున్నా అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి! ఢిల్లీ, ముంబై, బెంగళూర్ వంటి నగరాల నుంచి విమాన సర్వీసులు ప్రయాణికుల అవసరాలకు ఏమాత్రం చాలడం లేదు. పైగా అప్పటికప్పుడు ప్రయాణ వేళలు మార్చడం, టికెట్ ధరలను విపరీతంగా పెంచడంతో బెంబేలెత్తిపోతున్నారు.

ఇవి పాటించాలి

కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించే విషయంలో పలు అంశాలు దృష్టిలో పెట్టుకోవాలని వేద పండితులు సూచిస్తున్నారు. కుంభమేళాలో స్నానం మనసులోని మాలిన్యాన్ని తొలగించుకోవడానికని గుర్తుంచుకోవాలి. స్నానం ఆచరించే ముందు సంగమ జలాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మేళాలో తొలి స్నానం క్షేమం కోసం, రెండోది తల్లిదండ్రుల పేరుతో, మూడోది గురువు పేరుతో ఆచరించాలి. త్రివేణి సంగమ పవిత్ర జలాన్ని ఇంటికి తెచ్చుకోవాలి.

యోగి పుణ్యస్నానం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం తన మంత్రివర్గ సహచరులతో కలిసి మహా కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించారు. అంతకుముందు ప్రయాగ్‌రాజ్‌లోనే కేబినెట్ సమావేశం నిర్వహించారు. రాజకీయ, పాలనాపరమైన అంశాలపై చర్చించారు. ప్రయాగ్‌రాజ్‌లో రెండు నూతన వారధుల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించబోతున్నట్లు తెలిపారు. యూపీ యువతకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. సరిగ్గా ఏడాది క్రితం అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కూడా త్రివేణి సంగమంలో యోగి పుణ్యస్నానం ఆచరించారు.

అంతరిక్షం నుంచి కనువిందు

కోట్లాది భక్తుల పుణ్య స్నానాలతో సందడిగా కనిపిస్తున్న మహా కుంభమేళా దృశ్యాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం విడుదల చేసింది. వీటిని అంతరిక్షం నుంచి శాటిలైట్ ద్వారా చిత్రీకరించా రు. టెంట్ సిటీ ఏర్పాటవక ముందు, ఏర్పాటైన తర్వాతి ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. ఇసుకేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. మేళా పరిసర ప్రాంతాలు సైతం ఆకర్షిస్తున్నాయి. 2023 సెప్టెంబర్‌లో, 2024 డిసెంబర్ 29న చిత్రీకరించిన ఫొటోలు కూడా వీటిలో ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి.

భారత్‌తో అమెరికా వాణిజ్యం బలోపేతం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో జైశంకర్ భేటీ

వాషింగ్టన్: భారత్‌తో తమ వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు అమెరికా నూతన విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. అమెరికా విదేశాంగ మంత్రిగా ప్రమాణంచేసిన కొద్దిసేపటికే ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. 53 ఏళ్ల రూబియో బాధ్యతలు చేపట్టగానే భారత్‌తో భేటీకి సిద్ధపడటం అమెరికా భారత్‌కు ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతను చాటిచెబుతోంది. వాస్తవానికి అమెరికా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం, తర్వాత క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు జైశంకర్ అమెరికాకు వచ్చిన విషయం తెల్సిందే. క్వాడ్ భేటీ తర్వాత అమెరికా విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో రూబియో, జైశంకర్ విస్తతస్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



గగన్‌యాన్ మిషన్‌లో పురోగతి

క్రూ మాడ్యూల్‌కు లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను జతచేసిన ఇస్రో

సూళ్లూరుపేట: భవిష్యత్తులో మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు సన్నాహక ప్రాజెక్టుగా పేరొందిన గగన్‌యాన్‌-1 మిషన్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అడుగు ముందుకేసింది. సంక్లిష్టమైన లిక్విడ్ ప్రొపెల్షన్ సిస్టమ్‌ను క్రూ మాడ్యూల్‌తో విజయవంతంగా అను సంధానించింది. అనుసంధానం తర్వాత ఈ మాడ్యూల్‌ను మంగళవారం శ్రీహరి కోటలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్‌కు తరలించినట్లు బెంగళూరులో ఇస్రో వారి లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ బుధవారం ప్రకటించింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల్లో తమ సామర్థ్యాలను నిరూపించుకునేందుకు ఇస్రో తొలిసారిగా గగన్‌యాన్ పేరిట ఒక మానవరహిత ప్రయోగాన్ని చేపడుతున్న విషయం తెల్సిందే. ఈ మానవరహిత ప్రయోగం కోసమే తొలిసారిగా ఈ క్రూ మాడ్యూల్‌ను సిద్ధంచేస్తున్నారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) లో రూపొందించిన క్రూ మాడ్యూల్ అప్‌రైటింగ్ సిస్టంను మహేంద్రగిరిలోని లిక్విడ్ ప్రపొల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ)లో ప్రొపల్షన్ సిస్టంతో అనుసంధానించారు. క్రూ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం అనేది ఒక రియాక్షన్ కంట్రోల్ సిస్టం (ఆర్‌సీఎస్). అంటే క్రూ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లి స్వేచ్ఛగా వదిలేశాక భూమి దిశగా దిగొచ్చేటప్పుడు దాని వేగాన్ని నియంత్రించి పారాచూట్‌ల సాయంతో నెమ్మదిగా సముద్రం మీదకు దిగేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞా నాన్ని ఇందులో ఇమ డ్చారు. కిందకు పడేటప్పుడు సూటిగా వచ్చేలా, అటు ఇటూ తిరక్కుండా, పల్టీలు కొట్టకుండా మూడురకాలుగా దాని భద్రతను చూడ టమే ఆర్‌సీఎస్ పని. వ్యోమనౌక నుంచి విడిపోయి అంతరిక్షంలోకి చేరుకునే టప్పు డు, తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించేటప్పుడు పారాచూట్‌లు విచ్చుకోకముందు ఆర్‌సీఎస్‌ను వాడతారు.

భేటీ



తిరుచ్చి జిల్లా మనప్పారైలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు ఆహ్వానం పలుకుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర విద్యా శాఖమంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి బృందం బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యింది. ఈ వేడుకల ఏర్పాట్లను రాష్ట్రపతికి వివరించారు. భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ యూనిఫాంలోనే రాష్ట్రపతిని కలిసి మంత్రి ఆహ్వానం పలికారు. - సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

శ్రీలంక నుంచి 41 మంది తమిళ జాలర్ల రాక

తిరువొత్తియూరు: శ్రీలంక నావిక దళం అరెస్టు చేసిన 41 మంది తమిళ జాలర్లు విడుదలై చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. రామనాథపురం జిల్లా పాంబన్ ప్రాంతానికి చెందిన 35 మంది జాలర్లు గత ఆగస్టు నెల 9వ తేదీ ఫైబర్ పడవలో సముద్రంలో చేపలు పడుతున్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన శ్రీలంక నావికదళ సిబ్బంది సరిహద్దు దాటి చేపలు పడుతున్నట్లు పేర్కొంటూ వారిని అరెస్ట్ చేశారు. అలాగే గత నెల 8వ తేదీ రామనాథపురం జిల్లా అక్క మండపానికి చెందిన ఆరుగురు జాలర్లు సముద్రంలో చేపలు పడుతున్న సమయంలో శ్రీలంక పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో అరెస్టయిన 41 మందిని విడుదల చేయుటకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంతో 41 మందిని శ్రీలంక ప్రభుత్వం విడుదల చేశారు. వీరంతా విమానంలో చెన్నైకి వచ్చారు. చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న జాలర్లకు మత్స్యశాఖ అధికారులు ఆహ్వానం పలికారు. తర్వాత ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన వాహనాలలో వారి వారి సొంత ఊర్లకు తిరిగి పంపించారు.

నేరాల్లో పోలీసుల ప్రమేయాన్ని తేలికగా తీసుకోలేం

కొరుక్కుపేట: నేరాల్లో పోలీసుల ప్రమేయాన్ని తేలికగా తీసుకోలేం అని మద్రాసు హైకోర్టు అభిప్రాయ పడింది. ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్ స్పెషల్ సబ్ ఇన్ స్పెక్టర్ రాజాసింగ్ చెన్నైలోని వన్నార్ పేటకు చెందిన మహ్మద్ గౌస్‌ను కిడ్నాప్ చేసి రూ. 20 లక్షలు దోపిడీకి పాల్పడ్డాడు. దామోదరన్, ప్రదీప్, ప్రభుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను సెషన్స్ కోర్టు కొట్టివేసింది. దీంతో రాజాసింగ్, దామోదరన్ బెయిల్ కోరుతూ చెన్నై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జగదీశ్ చంద్ర ధర్మాసనం విచారణ చేపట్టారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు. ఈ కేసులో మరో స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సన్నీ లాయిడ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నందున బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని ప్రభుత్వం కోరింది. దీనిని అంగీకరించిన న్యాయమూర్తి పోలీసు శాఖనే నేరాలకు పాల్పడిన ఈ కేసును సాధారణ కేసుగా పరిగణించలేమంటూ ఈనెల 28కి కేసు విచారణను వాయిదా వేశారు.

ఈడీ విచారణకు డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్



ఈడీ కార్యాలయంలో కదిర్ ఆనంద్

సాక్షి, చెన్నై : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్ తనయుడు, వేలూరు డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్ బుధవారం చెన్నైలో ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. తమ దాడులలో బయట పడ్డ రూ. 13.7 కోట్ల ఆస్తులకు సంబంధించిన దస్తావేజుల తదితర వాటితో పాటూ విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఆయన వద్ద అధికారుల బృందం వివరాలు రాబట్టే ప్రయత్నం చేసినట్టు సంకేతాలు వెలువడ్డాయి. దురైమురుగన్ తనయుడు, ఎంపీ కదిర్ ఆనంద్‌కు చెందిన వేలూరులోని కార్యాలయాలు, విద్యా సంస్థలలో ఈడీ సోదాల గురించి తెలిసిందే. ఈ తనిఖీల్లో పట్టుబడ్డ నగదు, ఇతర వివరాలను మంగళవారం ఈడీ వర్గాలు ప్రకటించాయి. వీటి గురించి విచారించేందుకు కదిర్ ఆనంద్‌కు సమన్లు జారీ చేశారు. దీంతో తన న్యాయవాదులతో కలిసి చెన్నైలోని ఈడీ కార్యాలయానికి కదిర్ ఆనంద్ హాజరయ్యారు. ఎప్పుడు పిలిచినా వచ్చేందుకు సిద్ధమని అధికారులకు తెలియజేసి పేర్కొన్నారు.

అమావాస్య రోజుల్ని కాదు, ప్రజల ప్రయోజనాలను లెక్క కట్టి పథకాలుగా అమలు చేద్దాం, వారి ఆనందాన్ని లెక్కిద్దాం అని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. పథకాలైనా సరే, ఉద్యమమైనా సరే అన్నీ తమిళనాడు ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. రోజూ ఉదయించే సూర్యుడ్ని చూస్తుంటే ఆ ప్రకాశవంతమైన వెలుగులో డీఎంకే పాలన విజయాల పర్వం కొనసాగుతుందన్నది స్పష్టమవుతోందన్నారు.

శివగంగైలో పూర్తి చేసిన పనులను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



ఇంటింటికీ డీఎంకే పథకాలు

- ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ద్రవిడ మోడల్ పాలన
- విజయాల పర్వం కొనసాగిస్తామని ధీమా
- శివగంగైలో సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు

సాక్షి, చెన్నై: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రెండవ రోజు శింగంగై జిల్లాలో సీఎం స్టాలిన్ విస్తృతంగా పర్యటించారు. శ్రీలంక తమిళుల పునరావాస శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో జిల్లా ప్రగతి, పథకాల తీరు తెన్నుల గురించి సమీక్షించారు. అనంతరం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో రూ.376 కోట్లతో పూర్తి చేసిన 47 పనులను ప్రారంభించారు. మరో 33 కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. 53,039 మంది లబ్ధిదారులకు రూ.161 కోట్ల విలువైన ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేశారు. కొత్తగా ప్రారంభించిన వాటిలో పంచాయతీ కార్యాలయాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ యూనియన్ కార్యాలయాలు, పాఠశాలల భవనాలు, సేవా కేంద్రం భవనాలు, రైతుల కోసం సంత మార్కెట్లు, పోలీసు స్టేషన్ భవనాలు, క్వార్టర్స్‌లు ఉన్నాయి. అలాగే, శంఖుస్థాపన చేసిన వాటిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, నీటిపారుదల ప్రాజెక్టుకు, హెల్త్ కాంప్లెక్స్ భవనాలు, రెవెన్యూ, వాణిజ్య పనుల అధికారుల కార్యాలయాలు, సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయం భవనం ఉన్నాయి. అలాగే దివ్యాంగులకు పెట్రోల్ స్కూటర్లు, ట్రైసైకిళ్లు, స్మార్ట్‌ఫోన్లు, మోటారు కుట్టు యంత్రాలు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, లబ్ధిదారులకు గృహాలు ఎలక్ట్రానిక్ కుటుంబ కార్డులు, సంక్షేమ సభ్యత్వ కార్డులు, బోర్ వెల్ సబ్సిడీ, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలు అందజేశారు.

అంతా మీకోసమే..

సంక్షేమ పథకాల పంపిణీ తదుపరి జరిగిన సభలో శివగంగ నేల వీరత్వానికి ప్రతీక అంటూ వీరనారి వేలునాచ్చియార్ ప్రస్తావనతో సీఎం స్టాలిన్ ప్రసంగాన్ని మొదలెట్టారు. మరుదు సోదరుల వీరత్వం, త్యాగాన్ని గుర్తు చేస్తూ తమిళ ప్రాచీన చరిత్రను ప్రపంచానికి చాటిన నేల శివగంగ అనివ్యాఖ్యలు చేశారు. ఈ జిల్లా ప్రగతి కోసం అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేశా మని వివరించారు. ప్రతి పని, ప్రతి పథకం అందరికీ అన్నీ నినాదంతో ద్రావిడ మోడల్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోందన్నారు. ప్రతి కుటుంబంలో ఓ తండ్రిగా, కొడుకుగా, సోదరుడిగా, అవసరమై న సమయంలో సహాయం చేసే బంధువుగా, ఈ ము త్తవేల్ కరుణానిధి స్టాలిన్ ఉన్నాడని వ్యాఖ్యానించారు. గత మూడున్నర సంవత్సరాలలో తన ప్రభుత్వం మహిళలు, విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ అమలు చేస్తున్న నగదు ప్రోత్సాహక పథకాలను, అల్పాహార పథకం గురించి ఈ సందర్భంగా గుర్తు చేశారు. శింగంగైలో కలెక్టర్‌తో పాటూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంతో రూ. 89 కోట్లతో భవనం నిర్మించబోతున్నామని ప్రకటించారు. సింగంపునరి, దిండిగల్, కారైకుడి నగరాలకు వెళ్లే వాహనాలు తిరుపత్తూరు నగర ప్రాంతంలోకి ప్రవేశించకుండా రూ. 50 కోట్లతో తిరుపత్తూరులో బైపాస్ రోడ్డు నిర్మిస్తామన్నారు. కారైక్కుడి కార్పొరేషన్ కార్యాలయ భవనం కోసం రూ.30 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రతి జిల్లాలోనూ ఆ జిల్లాకు తానేమి చేశానో, ఏం చేయబోతున్నానో అన్న వివరాలను స్పష్టంగా ప్రజలముందే ఉంచుతున్నానని గుర్తు చేశారు. గణాంకాలతో సహా వివరాలను తాను ప్రకటిస్తుంటే, దానిని చూసి తట్టుకోలేక కడుపు మంటతో ప్రతిపక్ష నేత విమర్శలు, ఆరోపణలు చేస్తూ వస్తున్నారని ధ్వజమెత్తారు. ఇన్ని వాగ్దానాలన్నీ అమలు చేస్తూ వస్తుంటే ఈర్ష్యతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. 2021 అసెంబ్లీ ఎన్నికల కోసం ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) తరపున చేసిన 505 ఎన్నికల వాగ్దానాలలో 389 విజయవంతంగా అమలు చేశామన్నారు.

మరో 116 వాగ్దానాలు మాత్రమే అమలు చేయాల్సి ఉందన్నారు. వీటిని తప్పక చేసి చూపిస్తామన్నారు. ప్రభుత్వంలో మొత్తం 34 శాఖలు ఉన్నాయని, ఒక్కో విభాగానికి రెండు లేదా,మూడు ప్రాజెక్టులు ఈ వాగ్దానాలలో ఉన్నాయని వివరించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ఈ రాష్ట్రంలో ఏం ఒరగ బెట్టిందో ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వం తమిళనాడుపై సవతి తల్లి ప్రేమను చూపించడం మొదలెట్టిందన్నారు. ఢిల్లీలోని పాలకులు తమిళనాట అన్ని వ్యవహారాలపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సైతం రాష్ట్రం ప్రభుత్వం ఇక్కడ నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రెండు రోజుల క్రితం ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు సమగ్ర వివరాలను వెలువరించారని గుర్తుచేశారు.

లెక్కిద్దాం..

ప్రతిపక్ష నేత చెబుతున్న లెక్కలన్నీ తప్పుల తడక అని వ్యాఖ్యానిస్తూ, డిఎంకే ప్రభుత్వానికి 13 అమావాస్య రోజులే ఉన్నాయని ఎవరో అన్నట్టుందంటూ పరోక్షంగా బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను టార్గెట్ చేశారు. అతను చీకట్లో కూర్చుని, అమావాస్యను లెక్కిస్తున్నాడని ఎద్దేవా చేశారు. పర్వాలేదు మనం మాత్రం ప్రజల ప్రయోజనాలను లెక్కకట్టి పథకాలు అమలు చేద్దాం!, ప్రజల ఆనందాన్ని లెక్కిద్దాం! అని వ్యాఖ్యలు చేశారు. రోజూ ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తుంటే ఆ ప్రకాశవంతమైన వెలుగులో డీఎంకే పాలన కొనసాగుతుంది...పరిపాలించూ అన్నట్టుగా ఉంటుందన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజల కోసం పని చేస్తా! పని చేయిస్తా ! అని స్పష్టం చేశారు. మీ కోసం, మీ సమస్యల కోసం, మీ కోసం ప్రయోజనాల కోసం, అందరి ఇంటికి ద్రవిడ మున్నేట్ర కళగం ప్రభుత్వం సాధించిన విజయాలు కొనసాగుతూనే ఉంటాయని, సంక్షేమమైనా, ఉద్యమమైనా ప్రజల కోసమే అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెరియ కరుప్పన్, రాజ కన్నప్పన్, కోవి చెలియన్, ఎంపీ కార్తీచిదంబరం, శివగంగై జిల్లా కలెక్టర్ ఆశా అజిత్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా జరిగిన మదురై తమిళనాడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శత వార్షికోత్సవంలో సీఎం ప్రసంగించారు. మదురైలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు మూరిత పళని వేల్ త్యాగరాజన్, పెరియకరుప్పన్, ఎంపీ వెంకటేషన్‌లు పాల్గొనగా సీఎం స్టాలిన్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఫెడరేషన్ ఆఫ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ రాజ సూచించిన మేరకు వర్తకుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు.







దివ్యాంగులకు స్కూటర్లను పంపిణీ చేస్తూ..., సంక్షేమ పథకాలు అందజేస్తూ..., శ్రీలంక తమిళుల పునరావాస శిబిరంలో వినతి పత్రాలను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మంత్రి కిషన్‌రెడ్డితో అరిటా పట్టి వాసుల భేటీ



కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ఎల్. మురుగన్, బీజేపీ నేతలు అన్నామలై, సుధాకర్‌రెడ్డితో అరిటాపట్టి వాసులు

– నేడు రద్దు ప్రకటనకు అవకాశం

సాక్షి, చెన్నై: టంగ్‌స్టన్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తూ కేంద్రం గురువారం ప్రకటన చేసేనా అన్న ఎదురు చూపులు పెరిగాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో అరిటాపట్టి వాసులతో కలిసి జరిగిన భేటీ అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనంగా మారాయి. మదురై మేలూరు పరిసరాలలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలకు కేంద్రం అనుమతి ఇవ్వడం ఆ పరిసరాలలోని రైతులలో ఆందోళన నెలకొన్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం సైతం టంగ్‌స్టన్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. ఈ పరిస్థితుల్లో ఉద్యమ కమిటీలోని సుశీంద్రన్, ప్రొఫెసర్ రామ శ్రీనివాసన్, రాజ సింహన్, బాల మురుగన్, మునియప్పన్‌తో కలిసి పలువురు రైతులు బుధవారం ఢిల్లీ వెళ్లారు. కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో– ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అన్నామలైతో కలిసి కేంద్ర గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డిని అరిటాపట్టి ఉద్యమ కమిటీ బృందం కలిసింది. తమ ప్రాంతంలో నెలకొన్న ఆందోళనలు, సాగుతున్న ఉద్యమాలు, టంగ్‌స్టన్ తవ్వకాలకు అనుమతి ఇచ్చిన గ్రామాలలో పరిస్థితులు, అక్కడి చరిత్ర, పురాతనత వంటి అంశాలను మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అనుమతులు రద్దు చేయాలని కోరారు. అనంతరం మీడియాతో అన్నామలై మాట్లాడుతూ మదురై వాసులకు తాము ఇచ్చిన వాగ్దానం నెరవేరుతుందన్నారు. కేంద్రమంత్రి దృష్టికి అన్ని వివరాలను తీసుకెళ్లామని, తవ్వకాలకు ఇచ్చిన అనుమతుల రద్దు విషయంగా గురువారం మంచి ప్రకటన వెలువడుతుందని ఆశిస్తున్నామన్నారు.

గుర్తింపు రద్దు తథ్యం

- కళాశాలలకు అన్నావర్సిటీ హెచ్చరిక
- సమగ్ర వివరాల సమర్పణకు ఆదేశం



అన్నావర్సిటీ

సాక్షి, చెన్నై : తన పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలకు అన్నావర్సిటీ తీవ్ర హెచ్చరికలతో బుధవారం ప్రత్యేక ఆదేశాలను జారీ చేసింది. సమగ్ర వివరాలను సమర్పించని పక్షంలో గుర్తింపు రద్దు చేస్తామని స్పష్టం చేసింది. వివరాలు.. రాష్ట్రంలో అన్నా వర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలు ఉన్న విషయం తెలిసిందే. కౌన్సెలింగ్‌కు ముందుగా ఆయా కళాశాలలో తమ వద్ద ఉన్న కోర్సులు, సౌకర్యాలు, అధ్యాపక సిబ్బంది సంఖ్య తదితర వివరాలతో పాటూ సమగ్ర సమాచారాలను అన్నావర్సిటీ ద్వారా ఏఐసీటీఈకి పంపించాల్సి ఉంటుంది. ఈ మేరకు గత ఏడాది కూడా ప్రైవేటు కళాశాలల నుంచి వివరాలతో కూడిన నివేదిక అన్నావర్సిటీకి చేరింది.

అదే సమయంలో అరప్పోర్ ఇయక్కం నకిలీ అధ్యాపకులు అంటూ ఆధారాలను బయట పెట్టడం చర్చకు దారి తీసింది. ఒక చోట పనిచేసే అధ్యాపకుడు మరో చోట కూడా పనిచేస్తూ వస్తున్నట్టుగా, నకిలీ ఆధార్ కార్డుల ను ఉపయోగించి అధ్యాపక సిబ్బంది పూర్తి స్థాయిలో తమ వద్ద పనిచేస్తున్నట్టుగా కళాశాలలు మాయాజాలం సృష్టించినట్టు వచ్చిన ఆరోపణలను గవర్నర్ ఆర్ ఎన్ రవి సైతం తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారం పెద్ద చర్చకే దారి తీయడంతో విచారణ బృందం రంగంలోకి దిగింది. మాయాజాలం సృష్టించిన కళాశాలలను, ప్రొఫెసర్లను గుర్తించి చర్యలు చేపట్టారు. ఇది పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తలపై అన్నావర్సిటీ దృష్టి పెట్టింది.

ప్రత్యేక ఆదేశాలు..

అన్నావర్సిటీ రిజిస్ట్రార్ ప్రకాశ్ బుధవారం ఆయా ఇంజినీరింగ్ కళాశాలలకు ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆరు, ఏడవ వేతన కమిషన్ సిఫారసుల మేరకు ఆయా కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, ఇతర సిబ్బందికి జీతాలు చెల్లించాలని ఆదేశించారు. 2025–26 సంవత్సరానికి గాను ఆయా కళాశాలలో సీట్ల భర్తీ కౌన్సెలింగ్‌కు సంబంధించిన అనుమతుల వ్యవహారం నివేదికలో సమగ్ర వివరాలను ఉండాలని సూచించారు. ఈనెల 31లోపు జరిమానా లేకుండా, ఫిబ్రవరి 7వ తేదీ నాటికి జరిమానాతో గుర్తింపునకు సంబంధించిన దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. ఆయా కళాశాలలకు సంబంధించిన సమగ్ర వివరాలు సరిగ్గా లేని పక్షంలో గుర్తింపు అన్నది తక్షణం రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వివరాలన్నీ సక్రమంగా ఉండే విధంగా, గోప్యతకు అవకాశం ఇవ్వకుండా అన్ని బహిర్గతంగా ఉండే రీతిలో సమర్పించాలని సూచించారు.

డెల్టాలో కేంద్ర బృందం పరిశీలన

- నష్టం వివరాలు తెలియజేసిన రైతులు



దెబ్బతిన్న మొక్క జొన్నపంటను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, చెన్నై: అకాల వర్షం కారణంగా డెల్టాలోని నాగపట్నం, తిరువారూర్, తంజావూరు, మైలాడుతురై జిల్లాలో సుమారు లక్ష ఎకరాలలో సంబా వరి పంట వర్షార్పణమైన విషయం తెలిసిందే. అలాగే, మరెన్నో వేల ఎకరాలలో ఉద్ది, పెసర పప్పు దినుసుల పంటలు దెబ్బ తిన్నాయి. తమను ఆదుకోవాలని అన్నదాత చేసుకున్న విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. పంటనష్టంపై అంచనా వేసి, రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో తమిళనాడుకు పంట నష్టం అంచనా నిమిత్తం ఆహార భద్రతా విభాగం పరిధిలోని పరిశోధన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు నవీన్, టీఎం ప్రీతి, సాంకేతిక నిపుణులు రాహుల్, అభిషేక్ పాండేతో కూడిన కమిటీని కేంద్రం నియమించారు. ఈ కమిటీ బుధవారం తిరుచ్చికి చేరుకుంది. అక్కడి అధికారులతో భేటి అనంతరం నాగపట్నం, తిరువారూర్, తంజావూరు జిల్లాలలో పర్యటనకు సిద్ధమైంది. సాయంత్రం తంజావూరులోని వరి కొనుగోలు కేంద్రాలలో పరిస్థితిని ఈ బృందం పరిశీలించింది. తడిసిన వరి బస్తాలను, తడి మయంగా ఉన్న వరి పంటను పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి పంట పొలాల వైపుగా ఈ బృందం పర్యటన జరగనుంది. ఉదయం తిరువారూర్ జిల్లాలో ఈ బృందం పర్యటిస్తుంది. మధ్యాహ్నం నాగపట్నంలో, 24వ తేదీన మైలాడుతురైలో పర్యటించనున్నది. రైతుల కన్నీటి వేదనను ఈ బృందాలకు వివరించే విధంగా అన్ని ఏర్పాట్లు జరిగాయి. రైతులు సైతం అధికారులకు తమ గోడును వివరించేందుకు సిద్ధమయ్యారు. 25వ తేదీన ఈ బృందం చెన్నైకు రానున్నది. సీఎం స్టాలిన్‌ను కలిసి, రాష్ట్ర స్థాయి అధికారులతోసమావేశానందరం ఢిల్లీకి బయలు దేరనున్నది. కాగా, సమగ్ర పరిశీలన జరిపి రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జికే వాసన్, డీఎండీకే ప్రధాన కార్యదర్శిప్రేమలత విజయకాంత్ విన్నవించారు. ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీమాన్‌కు ఇంటి వద్ద టెన్షన్

- ముట్టడికి పలు సంఘాల ప్రయత్నం
- ఎదురుదాడికి సిద్ధమైన మద్దతుదారులు
- అడ్డుకున్న పోలీసులు – ఉద్రిక్తత



పెరియార్ మద్దతుదారుల నిరసన



సీమాన్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, చెన్నై: ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్‌కు వ్యతిరేకంగా నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ చేస్తూ వస్తున్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం ఆయన నివాసాన్ని కొన్ని సంఘాలు ముట్టడించేందుకు యత్నించడం టెన్షన్‌లో పడేసింది. ఆయన ఇంటి వైపుగా వస్తే ఎదురుదాడి చేస్తామని సీమాన్ వర్గీయులు కాచుకుని కూర్చోవడంతో పోలీసులకు ముచ్చెమటలు తప్పలేదు. చివరకు ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. వివరాలు.. నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో సమస్యలను కొని తెచ్చుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఏమాత్రం తగ్గకుండా ఆయన తన దూకుడును ప్రదర్శిస్తూవస్తున్నారు. గతకొద్ది రోజులుగా ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం మొదలెట్టారు. ద్రవిడ ఉద్యమం, ద్రవిడ రాజకీయాలకు వ్యతిరేకంగా విరుచుకు పడుతున్నారు. దీనిని పెరియర్ మద్దతు దారులు తీవ్రంగా పరిగణించారు. సీమాన్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. అయినా, సీమాన్ తగ్గడం లేదు. ఆయనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా అన్ని పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేరాయి. వ్యవహారం హైకోర్టు వరకు చేరడంతో ఆయనపై చర్యలకు న్యాయమూర్తులు ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో సీమాన్ తీరును ఖండిస్తూ ఆయన ఇంటి ముట్టడికి తందై పెరియర్ ఇయక్కం, మే 17 ఉద్యమ సంఘం, ద్రవిడర్ విడుదలై కళగంలు నిర్ణయించాయి.

ఉత్కంఠ..

చెన్నై తిరువాన్మియూరులోని సీమాన్ నివాసాన్ని ముట్టడించేందుకు సుమారు 1000 మందితో పెరియార్ మద్దతు సంఘాలు కదిలాయి. ఈ సమాచారంతో సీమాన్ ఇంటిని రక్షించుకుంటామని, ఇంటి వైపుగా వస్తే తాము సైతం ప్రతి ఘటిస్తామన్నట్టుగా నామ్ తమిళర్ కట్చి వర్గాలు, మహిళా బృందాలు సిద్ధమయ్యాయి. సీమాన్ ఇంటి వద్ద రక్షణగా వారు నిలవడంతో ఉత్కంఠ నెలకొంది. ఓ వైపు సీమాన్ మద్దతుదారులు, మరోవైపు పెరియార్ మద్దతు దారులను కట్టడి చేయడానికి సుమారు 300 మంది పోలీసులు రంగంలోకి దిగారు. సీమాన్ ఇంటి వైపుగా వెళ్లే మార్గాన్ని మూసివేశారు. నిరసన కారులు అటు వైపుగా చొచ్చుకు రావడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట, వాగ్వివాదాలు తప్పలేదు. సీమాన్ దిష్టిబొమ్మను తగల బెట్టారు. ఆ ఇంటి వైపుగా దూసుకెళ్లడంతో పోలీసులు బలవంతంగా అడ్డుకుని నిరసనకారులను అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి నుంచి ఈ పరిసరాలు తీవ్ర టెన్షన్‌లో ఉండగా నిరసనకారుల అరెస్టులతో పరిస్థితి సద్దుమణిగింది. అయినా సీమాన్ ఏమాత్రం తగ్గక పోవడం గమనార్హం. మీడియాతో ఆయన మాట్లాడుతూ, పెరియార్ వ్యతిరేకంగా స్పందించడమే కాకుండా 2026 ఎన్నికల్లో ద్రవిడ రాజకీయాలను అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నకిలీ డాక్టర్ అరెస్టు

తిరువొత్తియూరు: శ్రీపెరంబదూరు సమీపంలో నకిలీ డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పూందమల్లి సమీపము నజరత్ పేటకు చెందిన చార్లెస్(46). ఇతను శ్రీపెరంబుదూరు సమీపం వలర్‌పురం గ్రామం మాత కోయిల్ వీధిలో క్లినిక్ నడుపుతున్నాడు. ఇతను 10 తరగతి వరకు చదివి సరైన వైద్య కోర్సు చదువుకుండానే వైద్యం చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కాంచీపురం జిల్లా ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో అధికారులు క్లీనిక్‌లో తనిఖీ చేశారు. ఆ సమయంలో అతను నకిలీ వైద్యుడు అని తెలిసింది. దీని గురించి ఆరోగ్య శాఖ అధికారులు శ్రీపెరంబుదూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ధర్మలింగం కేసు నమోదు చేసి నకిలీ డాక్టరు చార్లెస్‌ను అరెస్టు చేశారు.

అప్పుల బాధతో హిజ్రా ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై ఎంజీఆర్ నగర్‌లో అప్పుల బాధతో హిజ్రా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెన్నై ఎంజీఆర్ నగర్ చూలై పల్లం ప్రాంతానికి చెందిన దేవి (43) హిజ్రా. ఈమె అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈమె అప్పులు ఎక్కువగా చేయడంతో అప్పు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. అదే సమయంలో అప్పు ఇచ్చిన వారు తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో మానసిక ఒత్తిడికి గురైన దేవి, తను వుంటున్న గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. దీని గురించి ఎంజీఆర్ నగర్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

సముద్రంలో ఉంగరాలు మార్చుకుని పెళ్లి చేసుకున్న జంట

అన్నానగర్: విమానంలో పెళ్లి సముద్రంలో పడవలో వెళ్లడంతో పాటు రకరకాల పెళ్లిళ్ల మనం చూస్తూనే ఉంటాం. అయితే పుదుచ్చేరిలో లోతైన సముద్రంలో నీటి అడుగున వెళ్లి ఓ జంట విభిన్నంగా పెళ్లి చేసుకున్నారు. వివరాలు.. పుదువై మురుంగాబాక్కం కి చెందిన జాన్ డి బ్రిటో-దీపిక. సముద్ర కాలుష్యంపై అవగాహన, సముద్ర జీవుల రక్షణ అవసరాన్ని నొక్కి చెబుతూ లోతైన సముద్రంలో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు టెంపుల్ అడ్వెంచర్ డీప్ సీ కోచ్ అరవింద్ బుధవారం తోడుగా ఉన్నారు. పుదుచ్చేరి కొబ్బరి తోట నుంచి 5 కి.మీ. దూరంగా సముద్రంలోకి వెళ్లిపోయారు. అక్కడ 50 అడుగుల లోతులో పెళ్లి వేడుక జరిగింది. కొబ్బరి ఆకుల్లో పూలు కట్టి పెళ్లి వేడుకలు నిర్వహించి సముద్రంలో ఉంగరాలు మార్చుకున్నారు. వారితో పాటు ఐదుగురు లోతైన సముద్రంలోకి వెళ్లారు. డీప్ సీ ట్రైనర్ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం నీటి అడుగున పెళ్లి జరగడం ఇదే తొలిసారి. వీరు లోతైన సముద్ర ఈతగాళ్లు కావడంతో ఇబ్బందేమీ లేదు. ఏర్పాట్లతో ముందుకెళ్లి పెళ్లి చేసుకుని ఆదర్శంగా నిలిచామన్నారు.

ఈరోడ్ ఎన్నికల అధికారి మార్పు


శ్రీకాంత్, మనీష్

సాక్షి, చెన్నై : ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం మనీష్‌ను తప్పించారు. ఆయన స్థానంలో కొత్త అధికారిగా హెచ్‌ఎస్ శ్రీకాంత్ నియమితులయ్యారు. వివరాలు.. ఈవీకేఎస్ మరణంతో ఖాళీగా ఉన్న ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే. అన్నాడీఎంకే, బీజేపీ, డీఎండీకే, తమిళగ వెట్రి కళగం ఎన్నికలను బహిష్కరించాయి. దీంతో ప్రధాన పోటీ అన్నది డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి సీతాలక్ష్మి మధ్య పోటీ నెలకొంది. వీరితో పాటుగా 46 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఈరోడ్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న ఎం మనీష్ వ్యవహరిస్తూ వచ్చారు. అయితే, ఓ నామినేషన్ తీవ్ర వివాదానికి గురి కావడం పెద్ద చర్చకే దారి తీసింది. బెంగళూరుకు చెందిన పద్మావతి నామినేషన్ వివాదం పుణ్యమా తుది జాబితాను ఆలస్యంగా ప్రకటించారు. ఈ పరిణామాలు మనీష్ నెత్తిన పడ్డట్లయ్యింది. ఆయన్ని ఎన్నికల పనుల నుంచి తప్పిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో హోసూరు కమిషనర్‌గా ఉన్న శ్రీకాంత్‌ను నియమించారు. బుధవారం ఈరోడ్‌కు చేరుకున్న శ్రీకాంత్ కమిషనర్‌తో పాటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల పర్యవేక్షణాధికారులతో కలిసి ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గురు లేదా శుక్రవారం నుంచి పోస్టల్ ఓట్ల పై దృష్టి పెట్టేందుకు సిద్ధమయ్యారు. వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ ఓట్లు నమోదు చేయదలచుకుంటే అధికారులకు సమాచారం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో డీఎంకే, కాంగ్రెస్ మధ్య ఎలాంటి విబేదాలు లేవు అని, అందరూ కలిసి కట్టుగా అభ్యర్థిగెలుపు కోసం శ్రమిస్తున్నారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై పేర్కొన్నారు. ఈరోడ్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే - కాంగ్రెస్‌ల బంధం గట్టిదని, విభేదాలకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు.

నయపాక్కంలో వానరాల బెడద


ఇంటి వద్ద వానరాలు, (ఇన్‌సెట్) వానరాల దాడితో గాయపడ్డ మహిళ

తిరువళ్లూరు: నయపాక్కం గ్రామంలో కోతుల బెడద పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వానరాలను పట్టి అటవీ ప్రాంతంలో వదలిపెట్టాలని పలుమార్లు అటవీ శాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా పూండిలో కాపు అటవీ ప్రాంతం ఉంది. అటవీ ప్రాంతానికి సమీపంలోనే పూండి, నయపాక్కం, నంబాక్కంతో పాటు ఇతర గ్రామాలు వున్నాయి. ఈ క్రమంలో నయపాక్కం గ్రామంలో ఇటీవల కోతుల బెడద పెరిగింది. ఇంట్లో దూరి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు దారిన వెళ్లే వారిపై సైతం దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల అదే గ్రామానికి చెందిన చిన్నపొన్ను(45), విమల(29) ఇటీవల కోతుల దాడిలో గాయపడ్డారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకూ కోతుల బెడద తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నయప్కాంలో భారీగా సంచరిస్తున్న కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

దివ్యాంగుల ధర్నా


రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

అన్నానగర్: ఉపకార వేతనం పెంచడంతోపాటూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం దివ్యాంగులు రాస్తారోకో నిర్వహించారు. తమిళనాడు వ్యాప్తంగా ఉన్న వికలాంగులకు తమిళనాడు ప్రభుత్వం నెలవారీ సహాయాన్ని అందిస్తోంది. ఈ పరిస్థితిలో తమిళనాడు అసోసియేషన్ ఫర్ ఆల్ కైండ్స్ ఆఫ్ వికలాంగులు, రక్షణ హక్కుల కోసం ప్రతి నెలా భృతిని రూ.100కి పెంచాలని డిమాండ్ చేస్తూ రోడ్ల దిగ్బంధించారు. తిరువొత్తియూరు డీహెచ్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో మహిళలు సహా 200 మందికి పైగా దివ్యాంగులు పాల్గొని నినాదాలు చేశారు. అనంతరం రోడ్డు దిగ్బంధంలో పాల్గొన్న 160 మందిని అరెస్టు చేసి కల్యాణ మండపంలో ఉంచారు. తాంబరం అసిస్టెంట్ కమిషనర్ నెల్సన్ ఆధ్వర్యంలో తాంబరం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న 200 మందికి పైగా దివ్యాంగులను పోలీసులు అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. రెడ్ హిల్స్-తిరువళ్లూరు జంక్షన్‌లో జరిగిన రోడ్డు దిగ్బధంలో పాల్గొన్న 25 మందికి పైగా వికలాంగులను అరెస్టు చేశారు. వైఎస్సార్ పాడి ముల్లైనగర్ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించిన 60 మందికి పైగా అరెస్టు చేశారు.

భర్త వివాహేతర సంబంధం..

- భార్య, కుమారుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చూళగిరి సమీపంలో భర్త వివాహేతర సంబంధం కారణంగా భార్య, ఆమె కుమారుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదం నింపింది. వివరాలు.. క్రిష్ణగిరి జిల్ల చూళగిరి తాలూకా పెరిగై పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన మీనంతొట్టి గ్రామానికి చెందిన బసవరాజ్ కట్టడ తాపీ మేస్త్రి. ఇతని భార్య రాణియమ్మ. వీరి కుమారుడు వెంకటరాజు బీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బసవరాజుకు అదే గ్రామానికి చెందిన రాతమ్మ తో గత 4 సంవత్సరములగా వివాహేతర సంబంధం ఉంది. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 7 గంటలకు మద్యం మత్తులో బసవరాజు ఇంటికి వచ్చాడు ఆ సమయంలో ఏర్పడిన గొడవలో రాణియమ్మపై బసవరాజు దాడి చేశాడు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేసిన కుమారుడు వెంకట్రాజ్‌తోనూ బసవరాజు ఘర్షణ చేశాడు. దీంతో విరక్తి చెందిన వెంకట్రాజ్ ఇంటి మిద్దె పైకి వెళ్లి అక్కడ ఉన్న గదిలో తల్లి చీరకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూసిన రాణియమ్మ ఆవేదన చెంది దుఃఖం తట్టుకోలేక అదే ప్రాంతంలో ఉన్న చింత చెట్టుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో బసవరాజు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ఇద్దరు మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న బసవరాజు కోసం గాలిస్తున్నారు.

బీఈబీకి సంక్లిష్ట శస్త్ర చికిత్స విధానం

సాక్షి, చెన్నై : అరుదైన కంటి రుగ్మతలలో ఒకటైన బెనిగ్న్ ఎసెన్షియల్ బ్లెఫారోస్పాస్మ్(బీఈబీ)కి సంక్లిష్టమైన శస్త్ర చికిత్స విధానాన్ని విజయవంతం చేశామని గ్లెనెగల్స్ ఆస్పత్రి ఓక్యులో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రవీంద్ర మోహన్ తెలిపారు. సంచలనాత్మకమైన ఈ వైద్య విధానం గురించి ఆయన స్థానికంగా బుధవారం ప్రకటించారు. అరుదైన కనురెప్పల రుగ్మతతో నాలుగు సంవత్సరాలు బాధ పడుతూ వచ్చిన జైపూర్‌కు చెందిన రిటైర్డ్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి జీవితాన్ని ఈ శస్త్రచికిత్స మార్చేసిందన్నారు. ఒకప్పుడు అథ్లెటిక్ , చురుకైన వ్యక్తిగా ఉన్న ఆయన జీవితం నియంత్రించలేని కనురెప్పల రుగ్మతతో కళ్లు తెరవలేక పోయే పరిస్థితిలో సవాలుగా మారిందన్నారు. నాలుగు సంవత్సరాలు వివిధ ఆస్పత్రులను సందర్శించినా ఫలితం లేక పోవడంతో చివరకు చెన్నైలో ఉన్న తనను సంప్రదించినట్టు పేర్కొన్నారు. రోగి లక్షణాలను , వైద్య చరిత్రను నిశితంగా విశ్లేషించామని బీఈబీ, ఏఎల్‌ఓ సమస్యను గుర్తించి ఈ రెండు అరుదైన పరిస్థితులకు సంక్లిష్ట విధానం అనుసరించి శస్త్ర చికిత్సకు సిద్ధమైనట్టు పేర్కొన్నారు. సాధారణ అనస్థీషియాతో చేసిన నాలుగు గంటల శస్త్రచికిత్సలో, కనురెప్పలను బలవంతంగా మూసేయడానికి కారణమైన కండరాలను తొలగించడానికి ద్వైపాక్షిక ఆర్బిక్యులారిస్ మైక్టోమీని చేర్చామన్నారు. ఇది ఒక వినూత్న సాంకేతికతతో కలిపి, ఎగువ కనురెప్పలను నుదిటి కండరాలకు కనెక్ట్ చేయడానికి సిలికాన్ రాడ్‌లను స్లింగ్‌లుగా అమర్చామన్నారు. ఇది రోగి కనుబొమ్మలను పైకి లేపడం, అతని నుదిటిపై ముడతలు పెట్టడం ద్వారా తన కనురెప్పలపై నియంత్రణను తిరిగి పొందేందుకు వీలు కల్పించామన్నారు. 'ఈ ద్వంద్వ విధాన శస్త్రచికిత్స అద్భుతమైన విజయాన్ని సాధించిందన్నారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, శస్త్రచికిత్స నిర్వహణ, ఆ తర్వాత సంరక్షణ బృందాలకు నాయకత్వం వహించిన తమ వైద్యుల విజయం గర్వించ తగిన మైలురాయిగా పేర్కొన్నారు. సమస్యను గుర్తించడం, సరైన పరిష్కారాన్ని అందించడం తమ వైద్యులు ఎప్పుడు ముందుంటారన్నారు.

ఆవిష్కరణ



జీటీ భారతీ గ్రూప్ నేతృత్వంలో చెన్నైలో ఎలిమెంట్స్ చైన్ ఆఫ్ యాక్టివ్ రిటైర్మెంట్ కమ్యూనిటీ కోసం చెన్నైలో ఎలిమెంట్స్ సత్య, ఎలిమెంట్స్ కమలం పేరిట 2 భారీ గృహ ప్రాజెక్టులను ప్రకటించింది. ఈ వివరాలతో పాటూ తమిళనాడు మార్కెట్ ట్రెండ్ - 2025 పేరిట పరిశోధనల ఆధారంగా సిద్ధం చేసిన నివేదికను ఆ సంస్థ ఎండీలు భరత్ దోషి, అరుణ్ భారతీ అరునాచలం, డైరెక్టర్లు శక్తి పార్థసారథి, అశ్విన్ కుమార్ అయ్యర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకుమార్ బుధవారం ఆవిష్కరించారు. అలాగే ఈనెల 25, 26 తేదీలలో ఆళ్వార్‌పేటలోని ఎతిరాజ్ కల్యాణ మండపంలో ఎలిమెంట్స్ షోకేస్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు. - సాక్షి, చెన్నై

ఆటోమోటివ్ పరిశ్రమలో గణనీయమైన మార్పులు

సాక్షి, చెన్నై: విద్యుదీకరణ, హైబ్రిడైజేషన్, హైడ్రోజన్ టెక్నాలజీలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహనాలతో ఆటోమోటివ్ పరిశ్రమ గణనీయమైన మార్పుకు లోనవుతోందని టాటా ఆటో కాంప్ సిస్టమ్స్ వైస్ చైర్మన్ అరవింద్ గోయల్ తెలిపారు. టాటా ఆటో కాంప్ మొబిలిటీ ఎకోసిస్టమ్‌ను శక్తివంతం చేసే విధంగా వినూత్న పరిష్కారాలను అందించడానికి ఈ పురోగతిని ఉపయోగించుకోవడానికి కట్టుబడి ఉన్నామన్నారు. భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో విభిన్న విభాగాలలో తమ సామర్థ్యాల గురించి బుధవారం స్థానికంగా ఆయన ప్రకటన రూపంలో వివరించారు. గ్లోబల్ ట్రెండ్‌లు మారుతున్నప్పుడు , సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్నప్పుడు, దేశీయ పరిశ్రమను ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ సహకారం ద్వారా బలోపేతం చేస్తూనే ఎగుమతులలో భారతీయ ఆటోమోటివ్ రంగానికి నాయకత్వం వహించడానికి అద్భుతమైన అవకాశాలను చూస్తున్నామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలకు అనుగుణంగా, టాటా ఆటో కాంప్ 100 శాతం స్థానికీకరణను సాధించాలని నిర్ణయించిందన్నారు. బ్యాటరీ ప్యాక్‌లు, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, 80 శాతంకు పైగా బ్యాటరీ థర్మల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లతో సహా క్లిష్టమైన ఎలక్ట్రిక్ వాహనాల భాగాలను స్థానికీకరించడం ద్వారా కంపెనీ ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఆటోమోటివ్ డొమైన్‌కు మించి తన దృష్టిని విస్తరింపజేస్తూ, టాటా ఆటోకాంప్ రైల్వే రంగంలోకి ప్రవేశించిందన్నారు. వందే భారత్ చొరవ కోసం విడిభాగాల దేశీయ అభివృద్ధికి దోహదపడిందన్నారు.

సూపర్ హీరో కథలో సూర్య?


నటుడు సూర్య

తమిళసినిమా: జయాపజయాలను అధిగమించిన నటులలో సూర్య ఒకరు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఈయన ఇప్పటికే 43 చిత్రాల్లో నటించారు. వాటిలో అధిక శాతం విజయాన్ని సాధించాయి. అలా సూర్య హీరోగా ఇటీవల నటించిన కంగువ చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకున్నా, సినీ ప్రముఖులు మాత్రం ఆ చిత్రాన్ని , నటుడు సూర్య నటనను ఎంతగానో ప్రశంసించారు. కొందరైతే కంగువ చిత్రం విలువ ఇప్పుడు తెలియదు అంటూ కామెంట్స్ చేశారు. ఇకపోతే కంగువ చిత్రం ఎఫెక్ట్ సూర్యపై ఇసుమంత కూడా పడలేదు. వరుసగా అవకాశాలు వరిస్తున్నాయి. అలా ఆయన ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటించిన తన 44వ చిత్రం రెట్రో షూటింగ్‌ను పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. నటి పూజాహెగ్డే నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని సమ్మర్ స్పెషల్‌గా మే 1వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం నటుడు ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో సూర్య తన 45వ చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో నటి త్రిష నాయకిగా నటిస్తున్నారు. దీని తరువాత సూర్య చాలా కాలం క్రితమే నటించాల్సిన వాడివాసల్ చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. జల్లికట్టు నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని వెట్రిమారన్ దర్శకత్వంలో కలైపులి ఎస్.థాను నిర్మించనున్నారు. ఆ తరువాత ఒక సూపర్ హీరో కథా చిత్రంలో నటించనున్నట్లు తాజా సమాచారం. దీనికి మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్ దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. ఈయన ఇంతకు ముందు కోతా మిన్నల్ మురళి వంటి చిత్రాలను తెరకెక్కించారన్నది గమనార్హం. కాగా ఈయన ఇటీవల నటుడు సూర్యను కలిసి కథను చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ చిత్రానికి సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. కాగా ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడలేదన్నది గమనార్హం.

కోలీవుడ్ టాక్స్

సంఘమిత్ర కోసం

సుందర్.సీ మళ్లీ సిద్ధం?


నటి శృతిహాసన్


రవిమోహన్

తమిళసినిమా: యాక్షన్, కామెడీ, హారర్ ఇలా ఏ తరహా కథలనైనా తనదైన శైలిలో తెరపై ఆవిష్కరించి ప్రేక్షకులను రంజింపజేయగల దర్శకుడు సుందర్.సీ. ఇలా దర్శకుడిగా, కథానాయకుడిగా రాణిస్తున్న ఈయన మరో చారిత్రాత్మక కథా చిత్రానికి తెరరూపం ఇవ్వడానికి సిద్ధం అవుతున్నట్లు తాజాగా వినిపిస్తున్న వార్త. ఇకపోతే సంఘమిత్ర. ఈ పేరు గత ఏడేళ్ల క్రితం వార్తల్లో మారు మోగింది. కారణం ఇది చారిత్రక కథాంశంతో కూడిన కథ కావడం, దర్శకుడు సుందర్.సీ కావడం, భారీ తారాగణం నటించబోతున్నట్లు ప్రకటించడం. ఈ తరువాత ఈ చిత్రం డ్రాప్ అయ్యిందనే ప్రచారం జరిగింది. వివరాలు చూస్తే సుందర్.సీ సంఘమిత్ర అనే 8వ శతాబ్దానికి చెందిన భారీ చారిత్రాత్మక కథా చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేశారు. ఇందులో నటుడు రవి మోహన్, ఆర్య, నటి శృతిహాసన్ వంటి స్టార్ హీరోహీరోయిన్లు నటించనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రాన్ని తేనాండాళ్ ఫిలింస్ సంస్థ రూ. 250 కోట్లు భారీ బడ్జెట్‌లో నిర్మించడానికి సిద్ధం అయినట్లు ప్రచారం జరిగింది. చిత్రాన్ని బాహుబలి, పొన్నియిన్ సెల్వన్ చిత్రాల స్థాయిలో నిర్మించడానికి ప్రయత్నాలు జరిగాయి కూడా. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను 2017లో జరిగిన కాన్స్ చిత్రోత్సవాల్లో ఆవిష్కరించారు. అలాంటిది కొన్ని అనువార్య కారణాల వల్ల చిత్ర నిర్మాణం ఆగిపోయించింది. కాగా తాజాగా ఈ చిత్ర స్క్రిప్ట్‌ను దర్శకుడు సుందర్.సీ ఇప్పుడు బయటకు తీయనున్నట్లు తాజా సమాచారం. దర్శకుడు సుందర్.సీ నటుడు విశాల్ హీరోగా గత 12 ఏళ్ల క్రితం రూపొందించిన మదగజరాజా చిత్రం ఈ పొంగల్‌కు విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఈ ఉత్సాహంతో దర్శకుడు సుందర్.సీ సంఘమిత్ర చిత్రాన్ని మళ్లీ చేత పట్టబోతున్నరా? అనే ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతోంది. ఇకపోతే ఈ చిత్ర షూటింగ్‌ను 2026లో ప్రారంభించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా ఇందులో నటించే తారాగణం, పని చేసే సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే ఇందులో నిజం ఎంత అన్నది తెలియాల్సి ఉంది. ముందుగా అనుకున్నట్లుగా నటుడు రవిమోహన్, నటి శృతీహాసన్, ఆర్యలు ఇందులో నటిస్తారా? అన్న ఆసక్తి కూడా నెలకొంది.

నో ఛేంజ్ ఎందుకంటే..!


నటి కీర్తిసురేశ్

తమిళసినిమా: నటి కీర్తిసురేశ్ చాలా లక్కీ అనే చెప్పాలి. బాలనటిగా రంగప్రవేశం చేయడం వల్లో ఏమోగానీ, కథానాయకిగానూ చాలా త్వరగా క్లిక్ అయ్యారు. అదేవిధంగా మలయాళం, తమిళం, తెలుగు, హిందీ భాషల్లోనూ వెనువెంటనే రంగప్రవేశం చేసి అంతే వేగంగా విజయాలను తన ఖాతాలో వేసుకుని పాన్ ఇండియా నాయకిగా గుర్తింపు పొందారు. అంతేకాదు అతి పిన్న వయసులోనే మహానటి చిత్రంలో అద్భుతమైన హావభావాలను పలికించి జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్నారు. అంతే స్పీడ్‌గా పెళ్లి చేసుకున్నారు. ఇదంతా నటిగా దశాబ్ద కాలంలోనే జరిగిపోయింది. గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన తన 15 ఏళ్ల బాయ్ ఫ్రెండ్ ఆంటోనిని కుటుంబ సభ్యుల సమ్మతితో పెళ్లి చేసుకున్న ఆ వెంటనే తాను నటించిన చిత్రాల ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. కాగా ఇటీవలే తన భర్తతో హనీమూన్ కోసం థాయ్‌ల్యాండ్ వెళ్లి వచ్చిన ఈ బ్యూటీని ఒక భేటీలో కీర్తిసురేశ్ తన వివాహ జీవితం గురించి అగిడిన ప్రశ్నకు తాను వివాహానికి ముందు ఎలా ఉన్నానో ఇప్పుడు అలానే సంతోషంగా ఉన్నానని చెప్పారు. కారణం తాము సుదీర్ఘ కాలంగా డేటింగ్‌లో ఉండటం వల్ల ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసన్నారు. అందువల్ల తనకు పెద్దగా ఛేంజ్ అంటూ ఏమీ లేదని అన్నారు. తాను ఎక్కువగా సోషల్ మీడియాలో ఉంటుంటానని, అది తన భర్తకు కాస్త సంకటంగా ఉంటుందన్నారు. అయినా దాన్ని ఆయన కొరతగా భావించడం లేదన్నారు. తనను అర్థం చేసుకున్న వ్యక్తి కావడంతో చాలా విషయాల్లో సర్దుకు పోతుంటారని చెప్పారు. అందువల్ల తమ సంసార జీవితం చాలా సంతోషంగా సాగుతుందని నటి కీర్తిసురేశ్ పేర్కొన్నారు. కాగా హిందీ చిత్రం బేబీ జాన్ ఇటీవల విడుదలై ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం నూతన చిత్రాలేమీ అంగీకరించలేదు. కీర్తిసురేశ్ నటించిన రివాల్వర్ రీటా, కన్నివెడి చిత్రాలు విడుదల కావాల్సి ఉన్నాయి.

కొడుకు మరణించాడని రోదిస్తూ.. తల్లి మృతి

అన్నానగర్: నెల్లై సమీపంలో కొడుకు మృతి చెందడంతో దుఃఖంతో అతని తల్లి కూడా విషాదంగా మరణించింది. నెల్లై జిల్లా ముక్కూడలై కు చెందిన నటరాజన్ కుమారుడు సురేష్ (53). ఇతను తన సోదరులతో ముక్కూడలైలో బరోటా దుకాణం నడిపేవారు. ఇతని భార్య భాగ్యలక్ష్మి. అంబై తాలూకాఫీసులో పని చేస్తుంది. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఇదిలా ఉండగా పొంగల్ సెలవుల సందర్భంగా సురేష్ తన కుటుంబంతో సహా కారులో చెన్నైలోని తన సోదరుడి ఇంటికి వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురైన సురేశ్ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఇది విన్న ముక్కూడలైలో నివాసముంటున్న సురేష్ తల్లి కలైమణి(74) షాక్‌కు గురై ఏడుస్తూనే ఉంది. బంధువులు ఆమెను ఓదార్చారు. ఈ స్థితిలో కలైమణి కూడా కొడుకు మృతి చెందాడన్న బాధను తట్టుకోలేక మృతి చెందింది. అనంతరం సురేష్ మృతదేహాన్ని చెన్నై నుంచి తీసుకొచ్చారు. ఇద్దరి మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.
అంత్యక్రియల అనంతరం ఇద్దరి మృతదేహాలను శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడి మృతి, తల్లి మృతి ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు.

విద్యార్థి కిడ్నాప్ కేసులో వివాహిత అరెస్టు

తిరువొత్తియూరు: వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్న స్థితిలో మరో వివాహం చేసుకోవడానికి పాఠశాల విద్యార్థిని కిడ్నాప్ చేసిన యువతిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పెరియపాలయం సమీపంలో ఉన్న ఒక గ్రామానికి చెందిన 16 సంవత్సరముల బాలుడు అక్కడున్న ప్రభుత్వ పాఠశాలలో ప్లస్-1 చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళకి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని వివాహం చేసుకోవడానికి తరచూ అతని కలుసుకొని మోసపూరిత మాటలు చెబుతూ ప్రేమిస్తున్నట్లు విద్యార్థికి చెప్తూ వచ్చారు. డిసెంబర్‌లో బయట ఊరికి విద్యార్థిని తీసుకుని వెళ్తున్నట్లు పిలుచుకుని వెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థి కనబడలేదని తల్లిదండ్రులు పెరియపాలయము పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపగా అదే ప్రాంతంలో వున్న ఓ ఇంటిలో విద్యార్థి దాచి ఉంచినట్లు తెలిసింది. పోలీసులు విద్యార్థిని విడిపించి వివాహిత యువతిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి పుఝల్ జైలుకు తరలించారు.

మొదలైన విడాముయర్చి ఫీవర్


నటుడు అజిత్, త్రిషలతో విడాముయర్చి చిత్ర దర్శకుడు మగిళ్ తిరుమేణి

తమిళసినిమా: అవునన్నా, కాదన్నా నటుడు అజిత్‌కు అభిమానగణం అధికమే. ఆయన అభిమాన సంఘాలు వద్దని రద్దు చేసినా, అభిమానం పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికినా ఆయన చిత్రాలు విడుదలవుతున్నాయంటే అభిమానులు చేసే హంగామా మాత్రం మామూలుగా ఉండదు. ఇకపోతే అజిత్ కథానాయకుడిగా నటించిన చివరి చిత్రం తుణివు. గత 2023లో పొంగల్ సందర్భంగా విడుదలైన ఈ చిత్రం మంచి సక్సెస్‌ను అందుకుంది. కాగా ఆ తరువాత అజిత్ నటించిన ఏ చిత్రం ఇప్పటి వరకూ తెరపైకి రాలేదు. అలా రెండు ఏళ్లు గడిచిపోయాయి. దీంతో ఆయన అభిమానులు తాజా చిత్రం కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. కాగా తాజాగా అజిత్ నటిస్తున్న రెండు చిత్రాలలో విడాముయర్చి ఒకటి. నటి త్రిష నాయకిగా నటించిన ఈ చిత్రంలో అర్జున్, రెజీనా, ఆరవ్ మొదలగు పలువురు నటీనటులు ముఖ్య పాత్రలు పోషించారు. మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించారు. కాగా గత ఏడాది దీపావళికి విడుదల కావలసిన ఈ చిత్రం పలుమార్లు వాయిదా పడి ఎట్టకేలకు ఫిబ్రవరి 6వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి రానుంది.కాగా ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ అజిత్ అభిమానులను చాలా ఉత్సాహపరిచింది. సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది. యాక్షన్ ఎంటర్‌టెయినర్‌గా రూపొందిన విడాముయర్చి చిత్రానికి అభిమానుల హంగామా కూడా మొదలైంది. విదేశాల్లో ఇప్పటికే అడ్వాన్స్ టిక్కెట్ల బుక్కింగ్ రికార్డులు సృష్టిస్తోందని సమాచారం. దీంతో విడాముయర్చి చిత్రం సాధించే విజయంపై ఆసక్తి పెరిగిపోతోంది. కాగా దీని తరువాత అజిత్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం గుడ్ బ్యాడ్ అగ్లీ విడుదలకు సిద్ధం అవుతుండడం గమనార్హం.

క్లుప్తంగా

ఊపిరాడక ఇద్దరి మృతి

అన్నానగర్: కడలూరు జిల్లా మంగళం పేట్టై రోడ్డుకు చెందిన మహ్మద్ జునైద్ (45) కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళం పేట్టై అందగులాటర్ వీధికి చెందిన మహ్మద్ యాసిన్ (30) ఇతను కూడా డ్రైవర్. వీరిద్దరు తిరువణ్ణామలైకి చెందిన గౌస్ బాషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు కువైట్‌లో పని నిమిత్తం గత 18వ తేదీన పాలైవన ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. చలి విపరీతంగా ఉండడంతో బొగ్గ స్టౌతో మంటలు వేసి తలుపులు మూసుకుని నిద్రించారు. అప్పుడు పొగలు రావడంతో నిద్రిస్తున్న నలుగురూ ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. వారిలో ముహమ్మద్ జునైద్, ముహమ్మద్ యాసిన్, నిద్రలోనే మృతిచెందారు. గౌస్ బాషా ఒక్కడే అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. ఊపిరాడక మృతి చెందిన మంగళం పేట్టై ఇద్దరు వ్యక్తుల మృతదేహాలను ఖననం చేసేందుకు సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో కువైట్ నుంచి మంగళం పేట్టైకి తీసుకురావడంతో ఇద్దరి బంధువులు మృతదేహాలను అక్కడే ఖననం చేసి వెళ్లిపోయారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక..

తిరువొత్తియూరు: చెన్నై ఐస్ హౌస్ ప్రాంతంలో 12 ఏళ్ల బాలిక సమీపంలో ఉన్న పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఆమె తల్లి మంగళవారం ఉదయం 7 తరగతి చదువుతున్న కుమార్తె, 12వ తరగతి చదువుతున్న పెద్ద కుమార్తెను పాఠశాలకు పంపించి ఆమె పనికి వెళ్లారు. ఎప్పటిలాగే పాఠశాల నుంచి చిన్న కుమార్తె ఇంటికి వచ్చింది. ఆమె సోదరి 12వ తరగతి చదువుతూ ఉండటంతో కొద్దిగా ఆలస్యంగా ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తన చెల్లెలు సందేహస్పద రీతిలో మెడకు చీర బిగించబడి మృతి చెంది ఉండడంతో సమీపంలోని బంధువులకు తెలియజేసింది. సమాచారం అందుకున్న ఐస్ హౌస్ పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: కుటుంబకలహాలతో ఓ వివాహిత పెళ్లి అయిన ఏడు నెలలకే ఆత్మహత్య చేసుకుంది. చెన్నై, కేకేనగర్‌లో ఐనావరం సమీపం 7వ వీధికి చెందిన కవిత (24). విల్లివాక్కంకు చెందిన అరుణ్‌కుమార్‌తో 8 ఏళ్లుగా ప్రేమలో ఉన్న ఈమె గత ఏడాది జూన్‌లో తల్లిదండ్రుల అంగీకారంతో పెళ్లి చేసుకుంది. విల్లివాక్కంలో భర్తతో ఉంటోంది. ఈక్రమంలో భోగి పండుగ రోజు 13న కవితకు, భర్తకు గొడవ రావడంతో ఐనావరంలోని ఆమె పుట్టింటికి వెళ్లింది. ఈస్థితిలో కవిత బుధవారం ఉదయం తన చెల్లెలితో మాట్లాడి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కవిత చెల్లెలు ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా కవిత చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఐనావరం పోలీసులు కవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివాహమైన 7 నెలల్లోనే ఆత్మహత్య చేసుకోవడంతో ఆర్డీఓ విచారణకు రెఫర్ చేశారు.

ఓమందురర్ గవర్నమెంట్ ఆస్పత్రిలో ఆర్ఓ ప్లాంట్

కొరుక్కుపేట: చెన్నై ఒమందురర్ ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ వేల సంఖ్యలో ఔట్ పేషెంట్లు వస్తుంటారు. ఇన్ పేషెంట్లు కూడా చాలా మంది ఉన్నారు. అంతే కాకుండా వారిని చూసేందుకు చాలా మంది బంధువులు వస్తున్నారు. వారికి అవసరమైన శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. దీని కోసంఆసుపత్రిలో ఆర్.ఓ.నీటి శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేశారు. ఈ యంత్రాన్ని మంత్రి ఎం. సుబ్రమణియన్ బుధవారం ప్రారంభించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ, ఈ యంత్రం గంట వ్యవధిలో 1000 లీటర్ల నీటిని శుద్ధి చేసి సరఫరా చేయగలదని చెప్పారు. దీని ద్వారా 5 వేల మందికి అవసరమైన స్వచ్ఛమైన తాగు నీటి సౌకర్యం లభిస్తుందని ఆస్పత్రి నిర్వాహకులు వెల్లడించారు.

చీటీ పేరుతో రూ.13 లక్షల మోసం

–ఆటోడ్రైవర్ అరెస్ట్

అన్నానగర్: రెడ్‌హిల్స్ ఈశ్వరన్‌నగర్‌కు చెందిన ధనలక్ష్మి (55). వడపళనిలోని ఓ బట్టల దుకాణంలో టైలర్. అక్కడే పనిచేస్తున్న ధనలక్ష్మి తన భర్త మాంగాడు కమాచికి చెందిన ఆటోడ్రైవర్ గణేశన్(43) దీపావళి చీటి నడుపుతున్నాడని చెప్పి మొత్తం రూ.13 లక్షల 80 వేల నగదు వసూలు చేశారు. తర్వాత డబ్బులు చెల్లించకుండా ధనలక్ష్మి, ఆమె భర్త గణేశ్ ఇల్లు ఖాళీ చేసి పరారయ్యారు. ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పరారీలో గణేశన్ (43)ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ధనలక్ష్మి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బైక్‌పై కూలిన మర్రిచెట్టు




అన్నానగర్: విరుదాచలం సమీపంలో బుధవా రం మర్రి చెట్టు కూలి బైకుపై వెళ్తున్న ఓ రైతు మృతి చెందాడు. కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపంలోని పాండూర్ నెమిలి ప్రాంతానికి చెందిన వినాయగం (60) రైతు. బుధవారం ఉదయం బైకులో కూరగాయలతో విరుదాచలం వచ్చాడు. అక్కడ కూరగాయలు విక్రయించి మళ్లీ పట్టణానికి తిరిగి వెళుతున్నాడు. భువనూరు ప్రైవేట్ బ్యాంకుకు వెళ్లగా రోడ్డు పక్కన ఉన్న వందేళ్ల మర్రి చెట్టు రోడ్డుపై పడింది. ఆ సమయంలో బైకులో వెళుతున్న వినాయగంపై చెట్టు కూలింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది కొమ్మలు నరికి మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీ మద్రాసులో 'మేకింగ్ ఇన్ స్పేస్ ఫర్ స్పేస్'

– మైక్రోగ్రావిటీ డ్రాప్ టవర్




మైక్రోగ్రావిటీ డ్రాప్ టవర్





క్యాప్సుల్ ఆఫ్ మైక్రో గ్రావిటి డ్రాప్ టవర్‌లోని వెల్డింగ్ ఎక్స్‌పర్‌మెంట్

సాక్షి, చెన్నై : భారత దేశ అంతరిక్ష ఆశయాలను, అంతరిక్షంలో దీర్ఘకాల మానవ ఉనికిని – వాణిజ్య అవకాశాలను విస్తరించేందుకు ఐఐటీ మద్రాసు ఎక్స్‌టీం రీసెర్చ్ గ్రూప్ చర్యలు చేపట్టింది. ఇందు కోసం బాహ్య అంతరిక్షంలో తయారీకి సంబంధించిన సాంకేతికతలపై దృష్టి సారించింది. భారతదేశ అంతరిక్ష భవిష్యత్తును రూపొందించడంలో, చివరి సరిహద్దులో వాణిజ్య అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషించే దిశగా కృషి చేస్తోంది. ఈ పరిశోధన 'మేకింగ్ ఇన్ స్పేస్ ఫర్ స్పేస్' ద్వారా అంతరిక్ష ప్రయాణానికి ప్రయోజనం చేకూర్చడమే కాకుండా భూమిపై ఉన్న ప్రజలకు 'మేకింగ్ ఇన్ స్పేస్ ఫర్ ఎర్త్' ద్వారా ప్రయోజనం చేకూరుస్తోంది. ఈ పరిశోధనా సౌకర్యం మైక్రోగ్రావిటీ డ్రాప్ టవర్ నిర్వహిస్తోంది. ఇది ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆపరేషనల్ డ్రాప్ టవర్. మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో లేదా బాహ్య అంతరిక్షంలో ఉన్నటువంటి కృత్రిమ జీరో గ్రావిటీ పరిస్థితులలో ప్రయోగాలు చేసేందుకు ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ అమిత్ కుమార్ చేసిన కృషికి ఐఐటీ మద్రాసు క్యాంపస్‌లో 2017లో ఈ టవర్‌ను స్థాపించారు. చంద్రుడు, అంగారక గ్రహంపై భవిష్యత్తులో మానవ నివాసం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్న ఎక్స్‌టీం రీసెర్చ్ పరిశోధకులు మౌలిక సదుపాయాలను నిర్మించడం, 3డి ప్రింటింగ్ సాధనాలు, స్థిరమైన అంతరిక్ష అన్వేషణకు కీలకమైన పదార్థాలను సేకరించడం వంటి సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న ప్రక్రియలతో ముందుకు వస్తున్నారు. ఈ వివరాలు ఈనెల 19వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ၊ మన్ కీ బాత్ ၊ ప్రసంగంలో ప్రస్తావించారు. దీంతో భారతదేశ అంతరిక్ష ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఇటువంటి పరిశోధనల ప్రాముఖ్యతను ఎత్తిచూపుతూ ఐఐటీ మద్రాసు డైరెక్టర్ ప్రొఫెసర్ వీ కామ కోటి బుధ



పరిశోధనల గ్రాఫ్

వారం వివరాలను ప్రకటించారు.

అన్వేషణ

ప్రస్తుతం తాము అన్వేషణాత్మక అధ్యయనాలు, వాతావరణ మార్పులు, పర్యావరణం వంటి కారణాల వల్ల మారుతున్న పరిస్థితులను చూస్తున్నామని వివరించారు. చంద్రునిలో, అంగారక గ్రహంలో కూడా మానవ నివాసాలను కలిగి ఉండటం వంటి అన్వేషణలో 'మేకింగ్ ఇన్ స్పేస్ ఫర్ స్పేస్' ముఖ్యమైన అంశాంలో ఒకటిగా పేర్కొన్నారు. మానవ నివాసాల కోసం సాంకేతికతను నిర్మించడం దీని ఉద్దేశం అని వ్యాఖ్యానించారు. అంతరిక్షంలో పెరిగిన సెమీకండక్టర్ స్ఫటికాలు, క్వాంటం కంప్యూటింగ్‌లో ఉపయోగించే తదుపరి తరం చిప్‌లను గురించి వివరిస్తూ, మానవ ఇంప్లాంట్‌ల కోసం అధునాతన ఆప్టికల్ ఫైబర్‌లు బయోప్రింటింగ్‌లకు ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు.

'మేకింగ్ ఇన్ స్పేస్ ఫర్ స్పేస్' అనేది చంద్రుని ఆవాసాలు, అంతరిక్ష నౌక భాగాలతో సహా అవసరమైన భాగాలను ఉత్పత్తి చేయడానికి 3డీ ప్రింటింగ్, ఇన్–సిటు రిసోర్స్ యుటిలైజేషన్ అధునాతన సాంకేతికతలను కలిగి ఉంటుందన్నారు. ఐఐటీ మద్రాస్‌లో 2021లో స్థాపించబడిన ఎక్స్‌టీం పరిశోధకుల బృందం అంతరిక్షంలో తయారీ కార్యకలాపాల కోసం సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. భారతదేశ స్పేస్ 2.0 కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, వనరుల వెలికితీత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫార్మాస్యూటికల్ పరిశోధనలతో సహా విభిన్న పరిశ్రమల కోసం అంతరిక్ష ప్రవేశాన్ని విస్తృతం చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం అని వివరించారు. ఎక్స్ టీం సమన్వయ కర్త ప్రొఫెసర్ సత్యన్ సుబ్బయ్య మాట్లాడుతూ, పరిమిత స్థలం, పరిమిత శక్తి, సూక్ష్మ–గురుత్వాకర్షణ ప్రభావం, పరిమితుల కారణంగా ఏర్పడే పరిస్థితులలో అంతరిక్షానికి అవసరమైన తయారీ సాంకేతికతలు భూమి ఆధారితం కంటే గణనీయంగా భిన్నంగా ఇది ఉంటుందన్నారు. ప్రాసెస్ ఇన్‌పుట్‌లు, అవుట్‌పుట్‌లను ట్రాక్ చేయడం, ఉప ఉత్పత్తులను సమర్థవంతంగా రీసైకిల్ చేయడానికి వీలుంటుందన్నారు. ఈ కేంద్రం ప్రాథమిక అధ్యయనాలు, సాంకేతిక అభివృద్ధి రెండింటినీ పరిష్కరిస్తుందన్నారు.

366 దీపాలతో జై శ్రీరామ్

– ఘనంగా అయోధ్య రామమందిరం మొదటి వార్షికోత్సవం



జై శ్రీరామ్ ఆకృతిలో 366 దీపాలు వెలిగించి పూజలు

కొరుక్కుపేట: అయోధ్య రామమందిరంలో బాల రాముని ప్రాణ ప్రతిష్ట మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నైలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వేడుకలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మహా మండపం ప్రాంగణంలో 366 దీపాలతో జై శ్రీరామ్ అనే ఆకృతిలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భాస్కర పంతులు బృందం సీతారాములను విశేషంగా అలంకరింపజేసి పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జైశ్రీరామ్.. జైశ్రీరామ్ అంటూ శ్రీరామచంద్రమూర్తిని వేడుకున్నారు. ఈ వేడుకలో భాగంగా మహామంత్ర భజన మండలి బృందం వారు రామ భజనలు చేసి ఆధ్యాత్మికతను చాటిచెప్పాయి. ఇందులో ఎస్‌కేపీడీ ట్రస్టీలు పాల్గొన్నారు.

కోమారి టీకాలు తప్పనిసరి



టీకాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు: జిల్లాలోని పశువులకు, మేకలకు తప్పనిసరిగా కోమారి టీకాలను తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ సుబ్బలక్ష్మి అన్నారు. వేలూరు జిల్లా గుడియాత్తం తాలుకాలో మీ కోసం మీ గ్రామంలో ఒక రోజు పథకం కింద అన్ని గ్రామ పంచాయతీల్లోని అభివృద్ధి పథకాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉల్లి గ్రామ పంచాయతీలో పశువులకు కోమారి వ్యాధి నివారణ టీకాలను వేసే ప్రక్రియను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఎటువంటి రుసుము చెల్లించకుండా అన్ని పశువులు, మేకలకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అనంతరం గుడియాత్తం తాలుకాలోని పలు గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పథకాలను ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే అములు, యూనియన్ సత్యానందం, తహసీల్దార్ మెర్లిన్ జ్యోతిక, పశు సంవర్థక శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

వేలూరు: వేలూరు పాత బస్టాండ్‌లో ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పరుసురామన్, ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సంఘం రీజనల్ కార్యదర్శి ఇళంగో మాట్లాడుతూ ట్రాన్స్ పోర్టు కార్మికులకు ప్రభుత్వ జీఓ.110 నెల వారి వేతనం ప్రకారం వేతనాన్ని పెంచాలని, 2003వ సంవత్సరం అనంతరం విధులకు చేరిన కార్మికులకు పీఎఫ్ పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులందరికీ వెంటనే సెటిల్‌మెంట్‌ను చేసి పంపాలని డిమాండ్ చేశారు. కార్మికులు బస్సులను అడ్డగించి రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలిసి పోలీసులు రాస్తారోకోలో పాల్గొన్న కార్మికులను అరెస్ట్ చేసి ప్రయివేటు కల్యాణ మండపానికి తరలించారు.

238 కేజీల గుట్కా స్వాధీనం



గుట్కాతో స్వాధీనం చేసుకున్న కారు

తిరుత్తణి: ఆంధ్రా నుంచి చెన్నైకు కారులో తరలిస్తున్న 238 కేజీల గుట్కాను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రాలోని నగరి నుంచి చెన్నైకు గుట్కా తరలిస్తున్నట్లు తిరువళ్లూరు జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్‌కు రహస్య సమాచారం అందింది. అతని ఆదేశాల మేరకు తిరువలంగాడు సీఐ రాజగోపాల్, ఎస్ఐ కుమార్ బృందం కనకమ్మ సత్రం సమీపం చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్రపెరంబదూరు వద్ద టోల్‌గేటు ప్రాంతంలో పోలీసుల తనిఖీ గుర్తించిన అటువైపు వెళ్లిన కారు వెనుకకు మళ్లి నారాయణపురం క్రాస్ రోడ్డు వైపు తిరువలంగాడు మార్గంలో వేగంగా వెళ్లింది. కారును వెంబడించిన పోలీసులు 10 కిలో మీటర్ల దూరం వెంబడించి కారును పట్టుకుని పరిశీలించారు. అందులో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు 238 కేజీలు చెన్నైకు తరలిస్తున్నట్లు గుర్తించారు. మహిళ సహా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసకుని తిరువలంగాడు స్టేషన్‌కు తరలించి కేసు నమెదు చేసి దర్యాప్తు చేశారు. తిరుత్తణి నెహ్రూ నగర్‌కు చెందిన బాలాజీ(32), విమల(30) ఇద్దరు గుట్కా, పొగాకు తరలించినట్లు తెలిసింది. వారిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

చోరీ కేసులో యువకుడి అరెస్ట్



పట్టుబడిన యువకుడితో పోలీసులు

వేలూరు: వేలూరు తొర్రపాడి సమీపంలోని పలవన్‌శాత్తు గ్రామానికి చెందిన ధర్మలింగం ఇతని భార్య లత దంపతులు ఇద్దరూ కలిసి గత డిసెంబర్ 12వ తేదీన వేలూరు కొత్త బస్టాండ్ నుంచి బెంగళూరుకు ప్రభుత్వ బస్సులో ప్రయాణం చేశారు. ఆ సమయంలో ధర్మలింగం చేతిలో తీసుకొచ్చిన బ్యాగును పక్కన పెట్టుకొని ప్రయాణం చేశారు. బ్యాగులు చైన్, ఉంగరం, హారం, వంటి మొత్తం 17 సవర్ల బంగారం పెట్టుకొని ప్రయాణం చేశాడు. వీటిని తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగును చోరీ చేసి అక్కడ నుంచి పరారీ అయ్యాడు. బస్సు వానియంబాడి వద్ద నిలిచి ఉన్న సమయంలో బ్యాగు కనిపించకుండాపోయింది. వీటిని గమనించిన ధర్మలింగం వెంటనే బస్సును నిలిపి వేసి వానియంబాడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. దీంతో పోలీసులు వానియంబాడి నుంచి మాదనూరు వరకు మొత్తం 30 సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా వానియంబాడి పోలీసులు మంగళవారం సాయంత్రం వానియంబాడి రైల్వేస్టేషన్ సమీపంలో ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా అనుమానా స్పదంగా ఒక యువకుడు కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అతను మాదనూరు సమీపంలోని ఉదయరాజపాళ్యంకు చెందిన మాణిక్యంగా తెలిసింది. అతను చోరీ చేసిన బంగారు నగులను స్వాధీనం చేసుకొని ఆంబూరు కోర్టులో హాజరు పరిచారు.

72 మంది రౌడీషీటర్‌లపై బైండోవర్ కేసులు

తిరువళ్లూరు: ఆవడి సమీపంలో జంటహత్య కేసు వ్యవహారం సంచలనం కలిగించిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 72 మంది రౌడీషీటర్‌లను పోలీసులు బైండోవర్ చేశారు. ఇటీవల తిరువల్లూరు జిల్లా పట్టాభిరామ్ ప్రాంతానికి చెందిన రెట్టమలైశ్రీనివాసన్ అతడి సోదరుడు స్టాలిన్ తదితర ఇద్దరు దారుణహత్యకు గురైన సంఘటన ఆవడి సమీపంలో కలకలం రేపింది. ఈ ఘటనపై అప్రమత్తమైన ఆవడి కమిషనర్ శంకర్ పోలీసు ఉన్నత అధికారులను అప్రమత్తం చేశారు. గతంలో నేర ఆరోపణలు ఉన్న రౌడీషీటర్‌లను బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే 72 మంది రౌడీషీటర్‌లను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు పిలిపించారు. వీరిలో 16 మందిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మిలిగిన 45 మంది రౌడీషీటర్‌లకు హెచ్చరిక జారీ చేసి పంపగా మరో 11 మంది రౌడీషీటర్‌ల నుంచి అవిడవిట్‌ను తీసుకుని పంపించారు.

ఎక్స్‌ప్రెస్ రైలులో సైనికుడి నగల చోరీ

– ఇద్దరు బిహార్ యువకుల అరెస్టు

కొరుక్కుపేట: చెన్నై సెంట్రల్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు వచ్చిన జవాన్ నగలు చోరీకి గురయ్యాయి. చోరీ చేసిన ఇద్దరి బిహార్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చెన్నై సెంట్రల్‌లో కలకలం రేపింది. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లాలోని అరణికి చెందిన మౌలీశ్వరన్ పంజాబ్‌లో జవాన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం తన భార్యతో కలిసి టౌరంటో ఎక్స్‌ప్రెస్ రైలులోని బీ1 ఏసీ కోచ్‌లో స్వగ్రామానికి వెళ్లేందుకు చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో ఏడు సవర్ల బంగారు నగలు, డబ్బు ఉన్న బ్యాగును మరిచిపోయాడు. కొద్ది దూరం వెళ్లగానే నగలు ఉన్న బ్యాగ్ గుర్తుకు వచ్చింది. అలా రైలు ఎక్కి బ్యాగ్ చూడగానే బ్యాగ్ కనిపించకపోవడంతో షాకయ్యారు. ఈ విషయంలో మౌలేశ్వరన్ సెంట్రల్ రైల్వే. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ గోవిందరాజ్ కేసు నమోదు చేసి రైలులో సోదాలు చేశారు. అనంతరం రైలులో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న బిహార్‌కు చెందిన ఇద్దరు యువకులను పట్టుకుని విచారించగా, విక్కీకుమార్ (23), హరికుమార్ (23) చోరీ చేసినట్టు తెలిసింది. వారి వద్ద నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. దీంతో అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఆభరణాల బ్యాగును తిరిగిచ్చిన పోలీసులకు సైనికుడు మౌలీశ్వరన్ కృతజ్ఞతలు తెలిపారు.

నివాళి



శివగంగైలో స్వాతంత్ర్య సమరయోధుడు వాలుక్కు వేలి అంబలం విగ్రహాన్ని, మరుదు బ్రదర్స్ విగ్రహం ఏర్పాటు పనులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. శివగంగైలో ప్రతిష్టించిన అంబలం విగ్రహానికి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ నేతృత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి, చెన్నై

ఆందోళన



అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ చెన్నై ఎగ్మూర్‌లో అన్ని రైతు సంఘాలకు చెందిన నేతలు బుధవారం ఆందోళనకు దిగారు. తక్షణం నష్ట పరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. – సాక్షి,చెన్నై

పాఠశాల బస్సు బోల్తా

–పది మంది విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన పాఠశాల బస్సు

పళ్లిపట్టు: పొదటూరుపేట సమీపంలో ప్రయివేటు పాఠశాల బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో పది మంది చిన్నారులకు గాయలయ్యాయి. పొదటూరుపేటలోని తిరుత్తణి రోడ్డులో ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు బుధవారం ఉదయం రామానాయుడుకండ్రిగ, పేటకండ్రిగ, సీఎస్.కండ్రిగ గ్రామాలకు చెందిన విద్యార్థులను ఎక్కించుకుని పాఠశాలకు బయలుదేరింది. పేటకండ్రిగ వద్ద బస్సు వెళుతుండగా అదుపుతప్పి బస్సు రోడ్డు పక్కన పొలంలో బోల్తా పడింది. ఈప్రమాదంలో బస్సులో ప్రయాణించిన పది మంది చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ చిన్నారులను గ్రామస్తులు ఆస్పత్రిలో చేర్పించారు. పొదటూరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నాడీఎంకే సహాయకాల పంపిణీ

– తొక్కిసలాటలో వృద్ధుడి మృతి

అన్నానగర్: పుదుచ్చేరిలోని అరియంగుప్పంలో మంగళవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో సంక్షేమ సహాయం కోరేందుకు వచ్చిన ఓ వృద్ధుడు ఊపిరాడక మృతి చెందాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పుదుచ్చేరి అరియంగుప్ ఆర్కే నగర్ ఫారంలో అన్నాడీఎంకే తరఫున ఎంజీఆర్ జన్మదిన వేడుకల బహిరంగ సభ, కల్యాణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాహకులు మాట్లాడారు. సాధారణ సమావేశం ముగిశాక 5 కిలోల బియ్యం, గోధుమలను సంక్షేమ సాయంగా అందజేశారు. దీనిని కొనుగోలు చేసేందుకు అరియాంగుప్పం, వీరంబట్టినంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. వాటిని కొనుగోలు చేసేందుకు చాలా మంది వేదిక వద్దకు చేరుకున్నారు. దీంతో రద్దీ ఏర్పడింది. ఇది చూసిన పోలీసులు జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికి తోపులాట జరిగింది. ఒక వృద్ధుడు మెట్లు దిగి స్పృహతప్పి పడిపోయాడు. ఇది గమనించిన పార్టీ కార్యకర్తలు ఆయనకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108వ అంబులెన్స్ ద్వారా పుదుచ్చేరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి పంపించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు జరిపిన విచారణ లో వీరంబట్టినం సునామీ క్వార్టర్స్‌కి చెందిన అయ్యానారప్పన్ (65)గా గుర్తించారు. అతనికి మద్యం తాగే అలవాటు ఉందని చెబుతున్నారు. ఆస్తమా సమస్య కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అరియాంగుప్పం పోలీసులు అనుమానాస్పద మృతి విభాగం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలాన్ని విక్రయిస్తామని మోసం

–ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు: వేలూరు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మదివానన్ అధ్యక్షతన గ్రీవెన్‌సెల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ వెంటనే విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయా పోలీసులను ఆదేశించారు. ఫిర్యాదులు అందజేసిన వారిలో వేలూరు జిల్లా సత్యమంగళం సమీపంలో కల్‌మారపాళ్యం గ్రామానికి చెందిన బాధితుడు అందజేసిన విధంగా తాను ఇల్లు, కార్యాలయాలకు అలంకారం పనులు చేస్తున్నారు. తన చిన్నాన్న కుటుంబ సభ్యులు తనకు ఖాళీ స్థలాన్ని విక్రయిస్తామని ఆశ చూపి తన వద్ద రూ.7లక్షలు తీసుకొని తనకు విక్రయించలేదన్నారు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అదనపు ఎస్పీలు భాస్కరన్, అన్నాదురై, డీఎస్పీ తిరునావక్కరసు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు ఏర్పాటుపై పరిశీలన



ఘాట్‌రోడ్డుకు సంబంధించి మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రులు వేలు, శేఖర్‌బాబు, నాజర్

తిరుత్తణి: తిరుత్తణి కొండపై 2వ ఘాట్‌రోడ్డు ఏర్పాటుకు సంబంధించి మంత్రుల బృందం బుధవారం పరిశీలించి ఘాట్‌రోడ్డు పనులు ప్రారంభానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతున్న క్రమంలో వాహనాల రద్దీ అధిగమించి భక్తులు, పట్టణ ప్రజలతోపాటు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కొండ వెనుక 2వ ఘాట్‌రోడ్డు ఏర్పాటుకు సంబంధించి మంత్రులు వేలు, శేఖర్‌బాబు, నాజర్ పరిశీలించారు. రూ.1.92 కోట్లు నిధులు మంజూరు చేసి ఫిబ్రవరి నాటికి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యే చంద్రన్, తిరుత్తణి ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ఆలయ ధర్మపాలక మండలి చైర్మన్ శ్రీధరన్ పాల్గొన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ నుంచి కొండకు ప్రభుత్వ ఉచిత బస్సు సేవలను మంత్రులు ప్రారంభించారు.

ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



కొండూరు రవిరాజును సత్కరిస్తున్న గిరిరాజు

పళ్లిపట్టు: షోళింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మపాలక మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొండూరు రవిరాజును పలువురు సత్కరించారు. రాణిపేట జిల్లాలోని షోళింగర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం 108 వైష్ణవ క్షేత్రాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయానికి ఇటీవల రోప్‌కారు వసతి కల్పించడంతో భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. ఈక్రమంలో ఆలయ ధర్మపాలక మండలిని హిందూ దేవదాయ శాఖ నియమించింది. ఆలయ చైర్మన్‌గా కొండూరు రవిరాజు, సభ్యులు ప్రమాణ స్వీకారం షోళింగర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి గాంధీ, ఎమ్మెల్యే మునిరత్నం సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భం చైర్మన్‌గా కొండూరు రవిరాజు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే నలుగురు సభ్యులు ధర్మపాలక మండలి సభ్యులుగా ప్రమాణం చేశారు. నొచ్చిలి గిరిరాజ కన్యకాపరమేశ్వరి సమేత గంగాధరేశ్వరర్ ఆలయ పారంపర్య ధర్మకర్త, పారిశ్రామికవేత్త ఎన్.ఎం.గిరిరాజు నూతన ఆలయ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. పళ్లిపట్టు మాజీ యూనియన్ చైర్మన్ వెంజరాజు పాల్గొన్నారు.


జంట హత్యల కేసులో మరో ఐదుగురి అరెస్ట్



హత్య కేసులో అరెస్టయిన మరో ఐదుగురు నిందితులు

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా పట్టాభిరామ్ వద్ద జరిగిన జంట హత్య కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు బుధవారం మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పట్టాభిరామ్ అయల్‌చ్చేరి గ్రామానికి చెందిన రెట్టమలై శ్రీనివాసన్(30), అతడి సోదరుడు స్టాలిన్ తదితర ఇద్దరు గత 18న దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. జంట హత్య కేసు వ్యవహారంలో సత్య, బాలజీ, కార్తీక్, నవీన్ కుమార్, ప్రవీన్, మురుగన్, అయ్యప్పన్, శివ ప్రకాష్ తదితర ఎనిమిది మందిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన వారి వద్ద చేపట్టిన విచారణలో మరో ఐదు మందికి ప్రమేయం వున్నట్టు నిర్ధారించిన పోలీసులు బుధవారం ఉదయం అన్నకట్టుచ్చేరి ప్రాంతానికి చెందిన తరుణ్(22), చోరంజేరి గ్రామానికి చెందిన మాధేష్(22), గణేష్(20), వినోద్(20), దినేష్(21) తదితర ఐదుగురిని సైతం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా జంట హత్య కేసులో మొత్తం 13 మందికి ప్రమేయం వున్నట్టు నిర్ధారించిన పోలీసులు అందరినీ అరెస్టు చేసినట్టు తెలిపారు.

బియ్యం తరలిస్తే కఠిన చర్యలు



పుల్లరంబాక్కం రేషన్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీఎస్ఓ కన్నన్

తిరువళ్లూరు: ప్రజలకు అందించే రేషన్ బియ్యం సహా ఇతర వస్తువులను అక్రమంగా విక్రయించడం, తరలించడం చేస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ కన్నన్ హెచ్చరించారు. రేషన్ దుకాణాల్లో నిరుపేదలకు చక్కెర, బియ్యం, గోధుమ, పామాయిల్ అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే నిరుపేదలకు అందాల్సిన రేషన్ వస్తువులను కొందరు సిబ్బంది బ్లాక్ మార్కెట్‌కు తరలించి తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందులో భాగంగానే డీఎస్ఓ కన్నన్ బుధవారం ఉదయం పుల్లరంబాక్కంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో వున్న వస్తువుల నిల్వలు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

అమర జవాన్‌కు ఘనంగా అంతిమ సంస్కారాలు



బంగారుపాళెం: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రమూకల ఎదురు కాల్పుల్లో గాయపడి వీరమరణం చెందిన చిత్తూరు జిల్లా, బంగారుపాళెం మండలానికి చెందిన జవాన్ పంగల కార్తీక్ అంతిమ సంస్కారాలు బుధవారం స్వగ్రామం ఎగువరాగిమానుపెంట గ్రామంలో అధికార లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. కార్తీక్ భౌతిక కాయాన్ని తీసుకు వచ్చిన వాహనాన్ని చూడగానే 'వీరజవాన్ కార్తీక్ అమర్‌రహే, భారత మాతకు జై' అంటూ గ్రామస్తులు దారి పొడవునా నినాదాలు చేసుకుంటూ స్వగృహం వరకు తీసుకు వెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు కార్తీక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సైనికులు పరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేశారు.

గుండెపోటుతో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి



నరసయ్య (ఫైల్)

కలిగిరి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తెల్లపాడుకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ నీలిగుంట వెంకటనరసయ్య(41) విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చిన వెంకటనరసయ్య.. ఈ నెల 20న తిరిగి న్యూఢిల్లీ వెళ్లాడు. బుధవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో సహచరులు ఆయన్ని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే నరసయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటనరసయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు జనవరి 23 గురువారం ముగియనున్నాయి. గతేడాది డిసెంబరు 30న ఈ ఉత్సవాలు ప్రారంభించిన విషయం విదితమే. స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్య ప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు రోజూ గోష్ఠిగానంతో స్వామివారికి నివేదిస్తున్నారు.

శ్రీవారి సన్నిధిలో మేల్కొటె మఠ పీఠాధిపతి

మేల్కొటె మఠం పీఠాధిపతి యదుగిరి యతిరాజ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దేవదాయశాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామచంద్రమోహన్

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ప్రస్తుతం దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏడీసీగా పని చేస్తున్న రామచంద్రమోహన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సూచిస్తూ సీఎస్ విజయానంద్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటిదాకా దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సత్యనారాయణ ఐఏఎస్ బదిలీల్లో వేరే శాఖకు వెళ్లడంతో ప్రభుత్వం ఇన్‌చార్జి నియామకం చేపట్టింది.

మేఘాలే తాకింది ఆ 'మోనాలిసా'..

మహాకుంభమేళాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా 16ఏళ్ల అతిసాధారణ యువతి

- తన సహజ సౌందర్యంతో విపరీతమైన క్రేజ్
- దాదాపు అన్ని సోషల్ మీడియా వేదికల నిండా ఆమె ఫొటోలే
- ఆమెతో సెల్ఫీలు దిగేందుకు యాత్రికులు పోటాపోటీ
- రుద్రాక్షలు, పూసలు అమ్ముకునేందుకు ఇండోర్ నుంచి రాక
- ఒక్క ఇంటర్వ్యూతో రాత్రికి రాత్రి స్టార్‌డమ్ సొంతం
- సామాజిక మాధ్యమాల్లో కేక పుట్టిస్తున్న ముద్దుగుమ్మ అందం



ఉపాధికి గండికొట్టిన పాపులారిటీ..

ఇదిలా ఉంటే.. అందం, కళ్లు ఆమెకు ఓ వైపు విపరీతమైన పాపులారిటీని తెచ్చిపెట్టగా.. మరోవైపు అదే క్రేజ్ ఆమె ఉపాధికి గండికొడుతోంది. ఆమె అమ్ముతున్న రుద్రాక్షలు, పూసల దండలు కొనడంకంటే ఆమెతో సెల్ఫీలకే జనం ఎక్కువ ఆసక్తి చూపిస్తుండడంతో ఆమె కుటుంబ సభ్యులు అమ్మకాల్లేక, ఆదాయం రాక ఆందోళన చెందుతున్నారు. ఈ హడావుడితో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మోనాలిసాను ఇండోర్‌కు తిరిగి పంపాలని ఆమె తండ్రి నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవోపేతంగా సాగుతున్న మహా కుంభమేళాలో ఇప్పుడో అతిసాధారణ యువతి తన సహజ సౌందర్యంతో రెండు మూడ్రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. అకస్మాత్తుగా రాత్రికి రాత్రి స్టార్‌డమ్‌ను సొంతం చేసుకుంది. రోజూ కనీసం కోటి మంది సందర్శకులు వచ్చే ఈ మహా కుంభమేళాలో రుద్రాక్షలు, పూసల దండలు అమ్ముకునేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి ప్రయాగరాజ్‌కు వచ్చిన 16 ఏళ్ల యువతి ఇప్పుడు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో తన అందంతో కేక పుట్టిస్తోంది. కుంభమేళాకు వస్తున్న పర్యాటకులు, భక్తులు, యాత్రికులు.. చూడగానే ఎవరినైనా ఇట్టే ఆకర్షించేలా ఉన్న ఈ తేనెకళ్ల సుందరి నుంచి రుద్రాక్షలు, పూసలు కొనుగోలు చేయడానికి కంటే ఆమెతో ఓ సెల్ఫీ తీసుకునేందుకు తెగ ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఆమె ఎక్కడ ఉంటే అక్కడ ఎగబడుతున్నారు.

(ప్రయాగరాజ్ త్రివేణి సంగమం నుంచి సాక్షి ప్రతినిధి)



ఆ ఇంటర్వ్యూతో యమా క్రేజ్..

ఈనెల 13న మహాకుంభమేళా ప్రారంభానికి ముందే ఇండోర్ నుంచి ప్రయాగరాజ్ చేరుకుని రుద్రాక్ష దండల వ్యాపారం చేసుకునే ఆ యువతిని, మహా కుంభమేళా న్యూస్‌ను కవర్ చేసే అంతర్జాతీయ న్యూస్ ఛానల్ ప్రతినిధి ఇంటర్వ్యూ చేసి దానిని వివిధ సోషల్ మీడియా వేదికల్లో పోస్టుచేశారు. అంతే.. ఆ వీడియోకు విపరీతమైన క్రేజ్ రావడంతో ఆ తర్వాత దేశంలోని ఇతర మీడియా సంస్థలు ఆమెకు విస్తృత ప్రచారం కల్పించి ఆకాశానికెత్తేశాయి.

ఆమె ఫొటో పెడితే చాలు, లక్షల్లోనే ఫాలోవర్స్..

వాస్తవానికి.. ఇండోర్ నుంచి రుద్రాక్ష మాలలు అమ్ముకునేందుకు వచ్చిన ఆ యువతి పేరు మోనాలిసా భోంస్లే. చూసీచూడగానే ఎవరినైనా కట్టిపడేసేలా మనోహరంగా ఉన్న మోనాలిసా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తల దృష్టిని ఆకర్షించింది. ఆమె ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసే వారి సంఖ్య వేల సంఖ్యలోనే ఉండడం, వాటిని చూసి లైక్‌లు కొట్టేవారు లక్షల్లో ఉండడంతో సోషల్‌మీడియా వేదికగా ఆమె కీర్తి ఊహించని స్థాయికి చేరుకుంది. ఆ యువతి మీడియా ప్రతినిధులతో తానేమి చదువుకోలేదని చెప్పినప్పటికీ.. యూట్యూబ్, ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల్లో ఆమె పేరుతో ఏర్పాటైన పేజీలతో పాటు ఆమె ఫొటోలు పోస్టుచేసిన దాదాపు అందరికీ కొత్త ఫాలోవర్స్ వరదలా పెరుగుతున్నారు. అప్పటివరకు వందల్లో కూడా ఫాలోవర్స్ లేనివారికి మోనాలిసా కవరేజీతో వేల, లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ చేరిపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మను లియోనార్డో డా విన్సీ పెయింటింగ్ 'మోనాలిసా'తో పోలుస్తున్నారు. పలువురు టాలీవుడ్, బాలీవుడ్ తారల కన్నా ఆమె అందం పదుల రెట్లు ఎక్కువంటూ కామెంట్లు చేస్తున్నారు.

విమానాల రాకపోకలపై పొగమంచు ఎఫెక్ట్



దట్టమైన పొగమంచు కారణంగా గన్నవరం విమానాశ్రయంలో బుధవారం ఉదయం పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి దట్టంగా కురుస్తున్న పొగమంచు ఎయిర్‌పోర్ట్ రన్‌వే ప్రాంతాన్ని దుప్పటిలా కప్పేసింది. దీంతో బెంగళూరు నుంచి ఉదయం 8.35 గంటలకు చేరుకున్న ఇండిగో విమానం రన్‌వేపై దిగేందుకు విజిబులిటీ సమస్యతో గాల్లో చక్కర్లు కొట్టింది. అనంతరం 9.50 గంటలకు సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. పొగమంచు కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటలలోపు రావాల్సిన న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, బెంగళూరు నుంచి విమానాలు ఆలస్యంగా వచ్చాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – గన్నవరం

మత్తు మందిచ్చి చోరీలు చేస్తున్న కిలాడీ లేడీ అరెస్ట్

- టీవీ సీరియల్స్ చూస్తూ అందులో మాదిరిగా దొంగతనాలు
- నిందితురాలి నుంచి 460 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: టీవీ సీరియల్స్ చూస్తూ అందులో చూపించినట్లు మత్తు మందు ఇచ్చి ఇళ్లలో బంగారం దోచుకెళ్తున్న ఓ కిలాడీ లేడీని ఒంగోలు పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒంగోలు శివారులోని దేవరంపాడుకు చెందిన గంటా ఎలీశమ్మ అలియాస్ గంధం సుజాత ఒంగోలులోని బాలాజీ నగర్‌లో నివసిస్తోంది. ఈమె ఒంటరి వృద్ధులు, మహిళలు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతోంది. ఫంక్షన్లకు వెళ్లి ఒంటరిగా కూర్చొన్న మహిళలతో తెలిసిన వ్యక్తిలా మాటలు కలుపుతుంది. వారికి ఏమాత్రం అనుమానం రాకుండా సభ్యతతో మెలుగుతుంది. దీన్ని అదనుగా చేసుకుని వాళ్ల ఇంటికి వెళ్లి రెండు రోజుల పాటు ఉండి అంతా పరిశీలిస్తుంది. ఈ క్రమంలో కూల్‌డ్రింక్‌లో నిద్రమాత్రలు కలిపి వారికి ఇస్తుంది. బాధితులు నిద్రపోయిన తర్వాత అల్మారాల్లో ఉన్న బంగారం, నగదును తీసుకొని ఉడాయిస్తోంది. విజయవాడలో జరిగిన ఓ చోరీ కేసులో గతంలో ఒకసారి జైలుకి వెళ్లి వచ్చిన ఎలీశమ్మ అప్పటి నుంచి పథకం మార్చి సీరియల్స్‌లో మాదిరిగా మత్తు మందిచ్చి దొంగతనాలు చేయడం ప్రారంభించింది. తనకు మానసిక పరిస్థితి బాగోలేదని డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకున్న ఆమె డాక్టర్ రాసిచ్చిన నిద్రమాత్రల చీటీని మందుల షాపుల్లో చూపిస్తూ నిద్రమాత్రలు కొనుగోలు చేస్తోంది. టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు తాలుకా, ఒంగోలు వన్‌టౌన్, ఒంగోలు టూటౌన్, నాగులుప్పలపాడు, కందుకూరు పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 దొంగతనాలు, రెండు బంగారు షాపుల్లో చోరీలు చేసింది. నిందితురాలిని పట్టుకునేందుకు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఒంగోలులోని బాలాజీ నగర్‌లో నిందితురాలు ఎలీశమ్మను అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రూ.35 లక్షల విలువైన 460 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరానికి వాడిన టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆదోని జిన్నింగ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

భారీగా పత్తి, గింజలు అగ్నికి ఆహుతి

రూ. 9 కోట్ల మేర ఆస్తి నష్టం



పరిశ్రమలో మంటలతో పొగలు వస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లా, ఆదోని పట్టణ శివారు, బసాపురం గ్రామ రోడ్డులోని సంతోష్ కాటన్ అండ్ జిన్నింగ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రెస్సింగ్‌లో ఉన్న ఎలివేటర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పు రవ్వలు ఎగిసి పక్కనే ఉన్న పత్తిపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న పత్తికి, పత్తి గింజలకు, దూది బేడలకు మంటలు అంటుకుని బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. భారీ పొగ అలుముకోవడంతో కష్టమైంది. ఈ ప్రమాదంలో పరిశ్రమ యజమాని ప్రశాంత్, ఫ్యాక్టరీలో పత్తి అన్‌లోడు చేస్తున్న వాహన డ్రైవర్ నారాయణస్వామి త్రుటిలో బయటపడ్డారు. వారిని మంటలు చుట్టుముడుతుండగా అప్రమత్తమై పరుగులు తీసి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రమాదంలో రూ.9 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రశాంత్ తెలిపారు. రూ.6 కోట్లు విలువ చేసే పత్తి, రూ.2 కోట్లు విలువ చేసే 600 దూదిబేడలు, రూ.కోటి విలువ చేసే 2,400 క్వింటాళ్ల పత్తి గింజలు, రెండు టాటా ఆటోలు కాలి బూడిదైనట్లు వివరించారు.

ఉచిత ఇసుక పేరుతో దోచుకుంటున్నారు

- నందికొట్కూరులో ఇసుక ట్రాక్టర్ల యజమానుల ఆందోళన
- అధిక ధరకు విక్రయిస్తున్నారని మండిపాటు
- ఇసుక డిపో, ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి
- పొంతనలేని సమాధానం చెప్పి జారుకున్న టీడీపీ ఎమ్మెల్యే జయసూర్య



అల్లూరు గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడించిన ట్రాక్టర్ యజమానులు

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో పేదలను దోచుకుంటోందని నంద్యాల జిల్లా నందికొట్కూరులోని ఇసుక డిపో వద్ద బుధవారం ట్రాక్టర్ యజమానులు ఆందోళనకు దిగారు. డిపో నిర్వాహకులు అధిక ధరలకు అడ్డదారిలో ఇసుక తరలిస్తున్నారని, అవసరమైన వారు ఇసుక కోసం నిరీక్షించాల్సి వస్తోందని మండిపడ్డారు. టన్ను రూ.744కు అమ్మాల్సి ఉండగా డిపో నిర్వాహకులు దానికి అదనంగా రూ. 256 కలిపి రూ. వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారని ట్రాక్టర్ యజమానులు మురళీకృష్ణారెడ్డి, బొలెద్దుల ప్రసాద్, చెన్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు విమర్శించారు. సొంత ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ తమ ట్రాక్టర్లకు ఎందుకు ఇవ్వడం లేదని డిపో నిర్వాహకుడు అల్వాల బాల వెంకట సురేష్‌ను ట్రాక్టర్ యజమానులు నిలదీశారు. అక్కడ కాదని సమీపంలోని పదిదెంపాడు, పూడూరు ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్తే పోలీసులకు చెప్పి జరిమానా విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇసుక డిపో వద్దకు చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే జయసూర్య కార్యాలయాన్ని 100 మంది ట్రాక్టర్ యజమానులు ముట్టడించారు. అయితే పొంతనలేని సమాధానం చెప్పి ఎమ్మెల్యే జయసూర్య అక్కడి నుంచి జారుకున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ట్రాక్టర్ ఇసుక రూ. 4,500కే ఇచ్చారు



వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో ట్రాక్టర్ ఇసుక రూ. 4,500కే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేయడం దారుణం. కర్నూలు సమీపంలోని ఈర్లదిన్నె, సింగారం, ఉడుమాల ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్తే నందికొట్కూరు ట్రాక్టర్లకు ఇసుక ఇవ్వమని, నందికొట్కూరు పట్టణంలో ఉన్న డిపో వద్ద నుంచి తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఆ డిపో వద్దకు వెళ్తే టన్నుకు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు.

– బొలెద్దుల ప్రసాద్, ట్రాక్టర్ యజమాని, నందికొట్కూరు

మూడు రోజుల నుంచి తిరుగుతున్నా..



ఇంటి పైకప్పు కూలిపోయింది. ఇసుక కోసం డిపో వద్దకు మూడు రోజుల నుంచి తిరుగుతున్నా ఇసుక ఇవ్వడం లేదు. అడిగితే ట్రాక్టర్ ఇసుకకు రూ. 5,600 అడుగుతున్నారు. అంత ఇవ్వలేమని చెబితే డిపో వద్ద ఎవ్వరూ పలకడంలేదు.

– రాణెమ్మ, ఏబీఎం పాలెం, నందికొట్కూరు

శారదా పీఠం నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలిస్తాం



అక్రమ నిర్మాణాలను ఉపేక్షించరాదన్న హైకోర్టు సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: తిరుమల గోగర్భం ప్రాంతంలో విశాఖ శారదా పీఠం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చేయాలని ఆదేశాలు జారీచేస్తామని హైకోర్టు తెలిపింది. ప్లాన్‌కు విరుద్ధంగా ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలున్నప్పుడు వాటిని ఉపేక్షించరాదని వ్యాఖ్యానించింది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందో తెలియజేసేందుకు ఇది ఓ ఉదాహరణగా ఉండాలని తెలిపింది. నిర్మాణాలపై కౌంటర్ రూపంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు శారదా పీఠానికి హైకోర్టు అవకాశం కల్పించింది. తదుపరి విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. తిరుమలలో శారదా పీఠం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిందని, ఈ నిర్మాణాలను కూల్చివేసేలా ఆదేశాలివ్వాలంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇది బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా శారదా పీఠం తరఫు న్యాయవాది జోస్యుల భాస్కరరావు స్పందిస్తూ, తాను పీఠం తరఫున వకాలత్ దాఖలు చేశానని చెప్పారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది. ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

అప్పల బాధ తాళలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విషాదం



గిడ్డయ్య (ఫైల్)



సుందరరాజు (ఫైల్)

కోడుమూరు రూరల్/ఆత్మకూరు రూరల్: అప్పుల బాధ తాళలేక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలు.. కర్నూలు జిల్లా వెంకటగిరికి చెందిన బోయ గిడ్డయ్య(42) తనకున్న మూడు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. వ్యవసాయం కలిసి రాకపోవడం, కుటుంబ అవసరాలతో పాటు ఇద్దరు కుమార్తెల వివాహాల కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకని ఎకరం పొలాన్ని అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన గిడ్డయ్య మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గిడ్డయ్య కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీశ్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించి.. ధైర్యం చెప్పారు.

కౌలు రైతు బలవన్మరణం: నంద్యాల జిల్లా భానుముక్కలకు చెందిన దళిత కౌలు రైతు చింతకుంట సుందరరాజు(29) కొన్నేళ్లుగా ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. దిగుబడి సరిగ్గా రాక తీవ్రంగా నష్టపోయాడు. వడ్డీలు పెరిగిపోవడంతో పాటు అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మంగళవారం ఆత్మకూరు పట్టణ శివారులోని విజయ పాల డెయిరీ వెనక ఉన్న కంప చెట్లలో పురుగు మందు తాగి పడిపోయాడు. అప్పటికే భార్య సుధారాణికి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని సుందరరాజును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సుందరరాజు మరణించాడు. సుందరరాజుకు భార్య సుధారాణి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇంతటి కష్ట సమయంలో కూడా సుందరరాజు కుటుంబసభ్యులు మానవత్వంతో.. అతని నేత్రాలను దానం చేశారు.

చెప్పింది చేయండి.. లేదంటే వెళ్లిపోండి

- అధికారులకు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి హెచ్చరిక
- అధికారిక సమావేశాలకు దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



ఒంగోలులో అధికారిక సమావేశంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు

సాక్షి టాస్క్‌ఫోర్స్/ఒంగోలు అర్బన్: 'అధికారులు ఎవరైనా సరే పుంగనూరు నియోజకవర్గంలో నా మాట వినాలి. నేనేం చెబితే అదే చేయండి. నేను చెప్పిందే శాసనం. లేకపోతే వదిలివెళ్లిపోండి. తమాషాలు చేయద్దు. జాగ్రత్త' అంటూ చిత్తూరు జిల్లా పుంగనూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) విరుచుకుపడటంతో అధికారులు తెల్లముఖం వేయాల్సి వచ్చింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఎలాంటి ప్రోటోకాల్ లేకపోయినా అధికారులతో సమీక్షలు చేయడం, అన్ని శాఖల అధికారులను ఇంటికి పిలిపించుకుని ఆదేశాలు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. అధికారులు సైతం దీనికే అలవాటుపడ్డారు. కొంతమంది అధికారులు స్వతంత్రంగా వ్యవహరిస్తుండటంతో వారిని హెచ్చరిస్తూ.. బదిలీలను గిఫ్ట్‌గా ఇస్తుండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

సమీక్ష నిర్వహించి మరీ హెచ్చరికలు

చల్లా బాబు తన ఇంట్లో సదుం, పులిచెర్ల మండలాల ఉపాధి, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులతోపాటు తహశీల్దార్ మారుఫ్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఏఈ సిరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆదినారాయణ, ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్, ఏపీవో శ్రీనివాసులు తదితర అధికారులతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమీక్ష నిర్వహించినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీవోపై చల్లా తీవ్ర స్థాయిలో విరుచుకుపడినట్టు తెలిసింది. ఉపాధి హామీ పనులు కూలీలతో కాకుండా యంత్రాలతో చేస్తుంటే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సెంట్రల్, స్టేట్ విజిలెన్స్ కమిషన్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టారు. దీంతో టీడీపీ నాయకుల దోపిడీలకు బ్రేక్ పడింది. అదేవిధంగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో అధికారులు నిబంధనల మేరకే వ్యవహరిస్తుండటంతో వాటికి బ్రేక్ పడింది. ముఖ్యంగా ఉపాధి హామీ కింద గోకులం షెడ్లు మినహా ఇతర పనులేవీ జరగలేదు. టీడీపీ నాయకులు అడిగిన పనులకు ఉపాధి అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. దీనికి కారణం ఉపాధి హామీ అధికారులేనని భావించి చల్లా బాబు వారిపై తీవ్ర స్థాయిలో మండిపడినట్టు సమాచారం. ఇలా సమీక్ష నిర్వహించి, అందరిలో దూషిస్తే తాము ఎలా పని చేయాలని వివిధ శాఖల అధికారులు ఉన్నతాధికారుల ఎదుట మొరపెట్టుకున్నట్టు సమాచారం.

అధికారిక సమావేశాల్లో టీడీపీ నేతల హల్‌చల్

ఒంగోలు జిల్లాలోని టీడీపీ నేతలు అధికారిక సమావేశాలు, సమీక్షల్లో పాల్గొంటూ అధికారులను నిలదీస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. బుధవారం కలెక్టరేట్‌లో అధికారిక సమావేశం జరిగింది. దీనికి ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు మాత్రమే హాజరు కావాల్సి ఉంది. కానీ.. ప్రోటోకాల్ లేకపోయినా దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు టీడీపీ ఎమ్మెల్యేలతో కలిసి అధికారిక సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో వివిధ అంశాలపై మైకు పట్టుకుని కలెక్టర్, ఇతర అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించారు. పార్టీ ఇన్‌చార్జిలు సాక్షాత్తు కలెక్టర్ సమక్షంలో జరిగిన అధికారిక సమావేశంలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు అధికారిక కార్యక్రమాలు, సమావేశాలకు వస్తుంటే కలెక్టర్ సైతం నిలువరించకుండా మౌనం వహించడం విమర్శల పాలైంది.

'కొలికపూడి' చెప్పేవన్నీ అబద్ధాలే

ఆయనకు మహిళలంటే గౌరవం లేదు
మాజీమంత్రి మేరుగ నాగార్జున

గోపాలపురంలో గిరిజన మహిళకు పరామర్శ



భూక్యా చంటిని పరామర్శిస్తున్న మేరుగ నాగార్జున, అవినాష్ తదితరులు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే ఆడుతున్నారని, గిరిజన మహిళపై దాడిచేసి అది తప్పుకాదని బుకాయిస్తున్నారని మాజీమంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం గోపాలపురంలో ఈనెల 11న ఎమ్మెల్యే దాడిలో తీవ్రంగా గాయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వార్డు సభ్యురాలు, గిరిజన మహిళ అయిన భూక్యా చంటిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి బుధవారం పరామర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ తిరువూరులో ఎమ్మెల్యే అరాచకంగా వ్యవహరిస్తున్నారని.. కొలికపూడికి మహిళలంటే గౌరవం లేదన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలపై దాడులకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం గర్హనీయం. గిరిజన మహిళపై దాడిచేసి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన జరిగి 12 రోజులు గడిచినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడమేమిటి? బాధిత కుటుంబానికి మా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. పోలీసులు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టుచేయాలి.

ఎమ్మెల్యేపై చర్యలెందుకు తీసుకోవట్లేదు?

ఇక ఎమ్మెల్యే కొలికపూడిపై టీడీపీ అధిష్టానం ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవట్లేదని దేవినేని అవినాష్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేతో పాటు ఈ దాడిలో పాల్గొన్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నిజానికి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రశాంతంగా ఉన్నారని, టీడీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలకు అంతూపొంతు లేకుండాపోయిందని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులే కొలికపూడిపై ఫిర్యాదు చేస్తున్నారంటే ఆయన అరాచకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. ఇక ఎమ్మెల్యే తన స్వీయ రక్షణ కోసమే గిరిజన మహిళ కుటుంబంపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆరోపించారు. మహిళలకు అండగా ఉంటామని చట్టసభల్లో మాట్లాడే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తిరువూరు ఎమ్మెల్యే చర్యలకు ఏం సమాధానం చెబుతారని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రశ్నించారు.

84 గంటలుగా కూంబింగ్

మూడోరోజు లభ్యమైన ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు

మొత్తంగా 18 మంది మృతిచెందినట్టు ధ్రువీకరించిన పోలీసులు

చర్ల/బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దులో ఈనెల 19న ప్రారంభమైన పోలీసుల కూంబింగ్ బుధవారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో కూంబింగ్ చేపట్టి 84 గంటలు దాటింది. కాగా, ఈ ఎదురుకాల్పుల్లో మరణించిన మరో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. మొత్తంగా ఈ ఎన్‌కౌంటర్‌లో బుధవారం రాత్రి వరకు 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు. గరియాబంద్ జిల్లాలోని మణిపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కులారీఘాట్‌లో మరో రెండు రోజులపాటు ఈ కూంబింగ్ కొనసాగించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా లభ్యమైన మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు తరలించారు. కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్న జవాన్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, వారికి అవసరమైన తాగునీరు, ఆహారపదార్థాలు, మందులు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

సుదర్శన్ స్మారక స్తూపం కూల్చివేత..

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కటకం సుదర్శన్ అలియాస్ దూలాదాదా స్మారక స్తూపం నేలమట్టమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బట్టిగూడ అటవీ ప్రాంతంలో ఆయన పేరిట నిర్మించిన స్తూపాన్ని బుధవారం భద్రతా బలగాలు కూల్చివేశాయి. 2023 మే 31న తీవ్ర అనారోగ్యంతో దండకారణ్యంలో సుదర్శన్ మృతిచెందారు. దీంతో ఆయన స్మారకార్థం అదే ఏడాది జూన్ రెండో వారంలో ఆదివాసీలు స్తూపం నిర్మించారు. కాగా, స్తూపాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేసిన ఘటన బెల్లంపల్లిలో కలకలం రేపింది.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
గురువారం ॥ 23-1-2025

● స్ఫూర్తి

తానే దిద్దుకున్న బతుకు చిత్రం



బాల్యం పేదరికాన్ని పరిచయం చేసింది. చదువుకు దూరం చేసింది. అనివార్యంగా పెళ్లికి తలవంచాల్సి వచ్చింది. భర్త పట్టించుకోని ఇంటి బాధ్యతను మోయడానికి భుజాలని వ్వాల్సి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా ఐదుసార్లు వదిలి వెళ్లాడు భర్త. ఇద్దరు పిల్లలను పోషించుకోవాలి. తనకు దూరమైన చదువును వారికివ్వాలి. అందుకోసం తానెంతయినా కష్టపడాలి. ఇదీ ఆమెకు జీవితం నిర్దేశించిన దారి. ఆ దారి ఆమెను దేశం ఎల్లలు దాటించింది. పరాయి దేశంలో ఆ భాషలు నేర్చుకుంది. చదువుకుంది. ఆ దేశపు మంత్రిత్వ శాఖలో ఉద్యోగంలో చేరింది. ఆ విధుల్లో ఏకైక మహిళ **రషీదా బేగం షేక్** పరిచయం ఇది.

బతుకు బడి

రషీదా పుట్టింది తమిళనాడులో. ఆమె చిన్నప్పుడే తండ్రి ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లాలోని గూడూరుకి వచ్చి స్థిరపడ్డారు. రషీదా బాల్యం, చదువు గూడూరులోనే. ఆమె పాఠశాల చదువు పూర్తయ్యేలోపు తండ్రిపోవడంతో కష్టాలు మొదలయ్యాయి. క్లాసులో ఫస్ట్ ర్యాంకులో చదివిన రషీదకు టెన్త్ క్లాస్ హాల్ టికెట్ తెచ్చుకోవడానికి పాతిక రూపాయలు కష్టమయ్యాయి. చదువు విలువ తెలియని తల్లి కారణంగా రషీదా చదువాగిపోయింది. అడిగిన వారికిచ్చి పెళ్లి చేశారు. వ్యసనపరుడైన భర్త వదిలేసి పోవడంతో ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి వదిన సహాయంతో కువైట్‌కి వెళ్లింది. పిల్లలను అక్క దగ్గర వదిలి కువైట్‌లో ఉద్యోగంలో చేరిన రషీదా లక్ష్యం ఒక్కటే. బాగా డబ్బు సంపాదించాలి, పిల్లల్ని బాగా చదివించాలి. నెలకు నాలుగు వేల రూపాయల ఉద్యోగంతో మొదలైన ఆమె ప్రస్థానంలో ఆమె చేరిన మైలురాయి ఏమిటో తెలుసా? కువైట్ పబ్లిక్ రిలేషన్స్, ఫారిన్ అఫైర్స్ మినిస్ట్రీలో అఫిషియల్ ఫొటోగ్రాఫర్. ఇదేమీ సినిమా కథలా ఒక రీల్‌లో జరిగిపోలేదు. ఆమె ప్రయాణంలో ఒక్కొక్క అడుగూ చిట్టడవిలో దారి వెతుక్కుంటూ సాగింది. ఒక్కొక్క సంఘటన ఒక్కో పాఠం. భాష తెలియక యజమానురాలి ఆదేశం సరిగ్గా అర్థం కాకపోవడం, దాంతో ఆమెకు ఆగ్రహం కట్టలు తెంచుకోవడం, రషీద ఉన్న గది తలుపు వేసి రెండో రోజు వరకు తియ్యకపోవడం... ఇండియాకి వెళ్లిపోదామనిపించిన చేదు అనుభవం. పిల్లల్ని బాగా చదివించాలి... ఒక్కటే లక్ష్యం ఆమెను కువైట్‌లో కట్టిపడేసింది. ఇటాలియన్ వంటల పుస్తకంలోని బొమ్మల ఆధారంగా రకరకాల సలాడ్‌లు చేసి జీతం పెంచుకుంది.

కష్టాల పాఠాలు

రషీదా ఓ రోజు పైకి ఎక్కి కిటికీలను తుడుస్తూ కాలు జారి పడిపోయింది. కాలుకు కట్టు కట్టించారు. ఆ ఒక్కరోజే రెస్ట్. రెండో రోజు చేతి కర్ర ఇచ్చి పని చేయమన్నారు. కాలికి కట్టు, కర్ర సాయంతో నడుస్తూ ఇంటిపనంతా చేయాల్సి వచ్చింది. చిమ్మ చీకటిలోనూ ఒక వెలుగురేఖ ప్రకాశిస్తుందనడానికి నిదర్శనం ఆ ఇంటి అమ్మాయి బ్యూటీషియన్ కావడం. ఆమెకు సహాయం చేస్తూ కోర్సు మొత్తం నేర్చుకుంది రషీదా. బ్యూటీషియన్‌గా పని చేసింది. ఒకరోజు అరబ్ వార్తాపత్రికలో మహిళలకు ఫొటోగ్రఫీలో శిక్షణ, ఉద్యోగం ప్రకటన ఆమెను కొత్త దారి పట్టించింది. ఆ ప్రకటనలో ఆమెకు అర్థమైంది మహిళ ఫొటో, కెమెరా బొమ్మ, జీతం అంకె మాత్రమే. కోర్సులో చేరి ఫొటోగ్రఫీ నేర్చుకుంది. డిగ్రీ ఉంటే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని చెప్పారెవరో. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బీకామ్ చేసింది. ఇంగ్లిష్ మాట్లాడడంతో పాటు అరబ్బీ చదవడం, రాయడం కూడా నేర్చుకుంది. గవర్నమెంట్‌లో స్వీపర్ ఉద్యోగం అయినా చేస్తానని తెలిసిన వాళ్లందరినీ అడిగింది. కానీ ఆమె కోసం అఫిషియల్ ఫొటోగ్రాఫర్ ఉద్యోగం ఎదురు చూసింది. ఇప్పుడామె తన కంటూ మినిస్ట్రీలో ఒక అఫిషియల్ క్యాబిన్, పోలీస్ జాకెట్‌తో ఉన్నతస్థాయిలో ఉన్న విజేత. కొడుకులిద్దరూ ఆమె కోరుకున్నట్లే ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

విజేత లక్ష్యం

రషీదా ప్రస్థానం పర్వత శిఖరం చేరిన తర్వాత అక్కడే ఆగిపోలేదు. పరాయి దేశంలో ఒంటరి మహిళకు ఎదురయ్యే కష్టాలను స్వయంగా అనుభవించింది. ఉపాధి కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే వారికి మంచి దారి చూపించాలనుకుంది. ఉమెన్స్ డ్రైవ్ ఏపీ పేరులో స్వచ్ఛంద సంస్థను స్థాపించి మహిళలను శిక్షణనిస్తోంది. టైలరింగ్, బ్యూటీషియన్, ఇంగ్లిష్ చదవడం– మాట్లాడడం, కేక్ తయారీ, పెళ్లి మండపాల అలంకరణ వంటి పనుల్లో శిక్షణనిస్తోంది. అలాగే ఉజ్వల భవిష్యత్తు పేరుతో పాఠశాల పిల్లలకు కెరీర్ ఆప్షన్స్ ఎన్ని ఉన్నాయోననే అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇండియాకి వచ్చి పూర్తి స్థాయిలో మహిళలు, పిల్లల కోసం పని చేయాలనేదే తన లక్ష్యం అంటోంది రషీదా బేగం షేక్.

– **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఇకిగాయ్ నేర్పించింది

ఫొటోగ్రఫీతోపాటు ఫొటోషాప్ కోర్సు నేర్చుకోవడానికి వెళ్లినప్పటికి నాకు కీబోర్డ్ కాదు కదా. మౌస్ కదపడం కూడా రాదు. బ్యూటీషియన్‌గా కొనసాగమని సూచించారు. అప్పుడు నాకెంత ఉక్రోషం వచ్చిందంటే... ఆ మాట అన్న వారి నంబర్ బ్లాక్ చేసేశాను. ఏడాది తర్వాత వారికి ఒక ప్రోగ్రామ్‌కి ఫొటోగ్రాఫర్ అవసరం ఏర్పడినప్పుడు ఎంక్వయిరీ చేస్తే ఎవరో నా పేరు చెప్పారట. వాళ్ల ఈవెంట్ కోసం నన్నే పిలిచారు. మరొక సందర్భంలో నా దుస్తుల కారణంగా చిన్నచూపుకు గురవుతున్నానని తెలిసింది. నేను నేర్చుకున్న మరో పాఠం అది. జపాన్ పుస్తకం ఇకిగాయ్ ద్వారా చాలా తెలుసుకున్నాను. ఉమెన్స్ డ్రైవ్ కోర్సులో ఈ పుస్తకంలోని అంశాలను చేర్చాను. నన్ను నేను మలుచుకున్నట్లే సాటి మహిళలను తీర్చిదిద్దాలనేది నా ఆకాంక్ష.

– **రషీదా బేగం షేక్**, ఫొటోగ్రాఫర్, మంత్రిత్వ శాఖ, కువైట్



స్వేచ్ఛ ఇక్కడ స్టాచ్యూ

అమెరికా అన్నిట్లో ముందుంటుంది! అభివృద్ధికి ప్రామాణికమని చెప్పుకుంటారు! ఏ మార్పైనా అక్కడే మొదలవుతుందని, దాన్ని ఏ దేశమైనా అనుసరించొచ్చనే నమ్మకం ఆ దేశానిది.. ప్రపంచానిది కూడా! స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ దేశం ప్రపంచానికేమని సెలవిస్తోంది.. కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే? ముఖ్యంగా జెండర్ విషయంలో! సాధారణంగా థర్డ్ జెండర్ హక్కుల విషయంలో అమెరికా ప్రపంచానికి మార్గదర్శిగా ఉంది. భద్రమైన, గౌరవప్రదమైన గమ్యంగా ప్రపంచంలోని ఎందరో ట్రాన్స్‌జెండర్స్‌కి ఆశ్రయం ఇచ్చింది. ఆ స్ఫూహ మనతో సహా ఎన్నో దేశాలకు స్ఫూర్తినిచ్చింది. వాళ్ల హక్కుల కోసం మన దగ్గరా ఉద్యమాలు సాగాయి. ప్రభుత్వాలు వాళ్లకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వమైతే ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌గా నియమించింది. ట్రాన్స్‌మన్ ఐఆర్‌ఎస్ ఆఫీసర్ అయ్యాడు. గవర్నమెంట్ డాక్టర్ కొలువొచ్చింది. ఇది కొంత మనం అగ్రరాజ్యం నుంచి నేర్చుకున్నదే! అలాంటిది ఆ దేశాధ్యక్షుడు ఇప్పుడు తాము 'థర్డ్ జెండర్‌ను గుర్తించం' అంటూ పాలనా ఉత్తర్వుల మీద సంతకం చేశాడు. ప్రమాణ స్వీకారం అయిన వెంటనే ట్రంప్ చేసిన ముఖ్య సంతకాల్లో అదొకటి. ఇప్పుడిప్పుడే సమాన హక్కుల వైపు అడుగులు వేస్తున్న దేశాలకిది విస్మయమే! ఇప్పటికే మన ఐపీసీలోని 377 సెక్షన్‌కు కొత్త చట్టం బీఎన్నెస్(భారతీయ న్యాయ సంహిత) ప్రత్యామ్నాయం చూపక చాలా ఆందోళనలు తలెత్తాయి. దానికిప్పుడు అమెరికా నిర్ణయాన్ని వత్తాసుగా తీసుకునే ప్రమాదమూ ఉంది. ఈ నేపథ్యం, సందర్భంలో ట్రాన్స్ జెండర్స్, వాళ్ల హక్కుల కార్యకర్తలు ఏమంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశాం ..

స్టిగ్మా, డిస్క్రిమినేషన్ ఎక్కువవుతాయి



అంతకుముందు అమెరికాలో మొదలైన మీ టూ, బ్లాక్ లైవ్స్ మ్యాటర్‌లాంటి మూవ్‌మెంట్స్ ప్రభావం మన దగ్గరా (దళిత్ లైవ్స్ మ్యాటర్) ఉండింది. కాబట్టి ఇప్పుడు ట్రంప్ డెసిషన్ వల్ల ఎల్‌జీబీటీక్యూని వెస్టర్న్ కాన్సెప్ట్ అని అభిప్రాయపడుతున్న వాళ్లంతా ఇక్కడ దాని రిలవెన్స్‌నే జీరో చేసే చాన్స్ ఉంది. ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి సంబంధించిన పాలసీలన్నీ కార్పొరేట్ కంపెనీల్లోనే కనిపిస్తాయి. వాళ్లకు ఉద్యోగాలుండేవీ వాటిల్లోనే! ఇవన్నీ చాలావరకు అమెరికా బేస్డ్‌గానే ఉంటాయి. మిగతా ఎక్కడైనా ఎల్‌జీబీటీక్యూ వాళ్ల ఐడెంటిటీని దాచుకునే ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే గ్లోబల్ బిజినెస్ కోసం ఇండియన్ బిజినెసెస్ కూడా వాళ్ల పాలసీలు కొన్నిటిని ఇంప్లిమెంట్ చేస్తున్నాయి. ఇప్పుడు వాళ్లే తీసేస్తే వీళ్లూ అనవసరమనుకుంటారు. ఉద్యోగాలుండవు. దానివల్ల వాళ్ల ఏజెన్సీలు కూడా పోతాయి. మళ్లీ మునుపటి స్థితికి వచ్చేస్తారు. స్టిగ్మా, డిస్క్రిమినేషన్ ఎక్కువవుతాయి. మన దగ్గర థర్డ్ జెండర్‌కి సంబంధించిన చట్టాలు కొంచెం భిన్నంగా, బలంగా ఉన్నాయి. వాటిని మార్చకపోతే పర్వాలేదు. ఇన్‌ఫ్లుయెన్స్ అయ్యి మారిస్తే మాత్రం ఇబ్బందే! ఇంకో విషయం.. రెండే జెండర్లని గుర్తించడం వల్ల ఆ రోల్స్ కూడా రిజిడైపోయి స్త్రీని ఇంటికే పరిమితం చేసే ప్రమాదం, స్త్రీ మీద హింస మరింత పెరిగే ప్రమాదమూ లేకపోలేదు.

– **దీప్తి సిర్లా**, జెండర్ యాక్టివిస్ట్

హింస పెట్రేగే ప్రమాదం



జెండర్ విషయంలో ట్రంప్ తీసుకున్న డెసిషన్ వల్ల ఎల్‌జీబీటీక్యూ, లైంగికత విషయంలో సందిగ్ధంలో ఉన్న పిల్లలు హింసకు లోనయ్యే ప్రమాదం ఉంది. పితృస్వామ్య వ్యవస్థ మరింత బలపడి స్త్రీల మీదా హింస పెట్రేగొచ్చు. ఇప్పుడిప్పుడే జెండర్ రైట్స్ మీద అవగాహన, చైతన్యం పెరుగుతున్న క్రమంలో అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ దేశాలపై చాలా ఇంపాక్ట్ చూపిస్తుంది. ట్రాన్స్‌జెండర్ల జీవితాలకు రిస్క్ పొంచి ఉంది. ట్రంప్ నిర్ణయాన్ని నిలువరించడానికి అమెరికా ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీ న్యాయపోరాటానికి సిద్ధమైంది. అయితే అదొక్కటే సరిపోదు. ట్రంప్ నిర్ణయ పర్యవసానాలను తెలుపుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీలవాదులందరూ సామాజిక పోరాటంతో మద్దతు తెలపాలి.

– **రచన ముద్రబోయిన**, ట్రాన్స్ రైట్స్, హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్

ఫండ్స్, ఉద్యోగాలు ప్రశ్నార్థకమే!



చాలా విషయాల్లో మాదిరి జెండర్ విషయంలోనూ ట్రంప్ ఆ దేశాన్ని వెనక్కి తీసుకెళ్తున్నాడు. ఎన్నో అమెరికన్ కంపెనీలు మన దగ్గర, ఇతర దేశాల్లో 'డైవర్సిటీ ఈక్విటీ ఇన్‌క్లూజన్' కింద ఎల్‌జీబీటీక్యూ వాళ్లకు ఫండ్స్, ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి. ఈ పాలసీల వల్ల అవి ప్రశ్నార్థకమవచ్చు! అంతే కాదు తమకు భద్రమైన ప్లేస్‌గా భావించి అమెరికా వెళ్లిన ఎల్‌జీబీటీక్యూల పరిస్థితేంటి? పాస్‌పోర్ట్‌లో కూడా ట్రాన్స్‌జెండర్ అనే పదం వాడకూడదని చెప్పాడు. ఆ నేపథ్యంలో వేరే దేశాల నుంచి చదువు కోసం, టూరిజం కోసం వెళ్లే ట్రాన్స్‌జెండర్ల సంగతేంటి? భయాందోళనలను కలిగించే విషయమే! ఇంకా చెప్పాలంటే హింసను ప్రేరేపించే నిర్ణయమిది!

– **తాషి చోడుప్**, బౌద్ధ సన్యాసిని, క్వీర్ ట్రాన్స్ వెల్‌నెస్ సెంటర్ ఫౌండర్, సోషల్ యాక్టివిస్ట్

– సరస్వతి రమ

● న్యూస్‌మేకర్

ఖోఖో వరల్డ్‌కప్ గెలిచిన రైతుబిడ్డ



మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఖోఖో వరల్డ్ కప్ 2025ను మన పురుషుల జట్టు గెలిచింది. అంతకంటే ఘనంగా మహిళాజట్టు కూడా గెలిచింది. బరిలో ఎవరి సత్తా వారిదే అన్నట్టుగా సాగిన ఈ వరల్డ్‌కప్‌లో 23 దేశాలు పాల్గొంటే వారిపై గెలుపుకు మన మహిళాజట్టును ముందుండి నడిపించింది కెప్టెన్ ప్రియాంక ఇంగ్లే. పుణెకు చెందిన ఈ రైతుబిడ్డ ముంబైలో టాక్స్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఆమె పరిచయం.

సరే. ముందు ఏం జరిగిందో చూద్దాం. గ్రూప్ స్టేజ్‌లో ఫస్ట్ మేచ్ పాకిస్తాన్‌తో పడింది. గెలిచారు. ఆ తర్వాత గట్టి జట్లయిన ఇరాన్, సౌత్ కొరియా, మలేసియా జట్లతో గెలిచారు. ఆ తర్వాత గెలుచుకుంటూ వచ్చి క్వార్టర్ ఫైనల్స్‌లో అత్యంత గట్టి జట్టు బంగ్లాదేశ్‌ను మట్టి కరిపించారు. సెమి ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా పరిస్థితి కూడా అంతే అయ్యింది. ఇక జనవరి 19న ఫైనల్స్. ప్రత్యర్థి జట్టు నేపాల్. ఈ జట్టుకు ఖోఖో బాగా వచ్చు. పైగా యంగ్ ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. కాని భారత జట్టులో యంగ్ ప్లేయర్లతో పాటు అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. తోడు కెప్టెన్‌గా 15 ఏళ్ల అనుభవం ఉన్న ప్రియాంక ఉంది. ఖోఖోలో టచ్ పాయింట్లు ఉంటాయి. ఫైనల్స్‌లో భారత్ 78 టచ్ పాయింట్లతో నేపాల్‌ను 40 పాయింట్లతో కట్టడి చేసి ఘన విజయం సాధించింది. చరిత్రలో మొట్టమొదటిసారి ఖోఖో వరల్డ్ కప్ జరిగితే (జనవరి 13–19, న్యూఢిల్లీ) 23 దేశాలు పాల్గొంటే వాటన్నింటిని ఓడించి కప్‌ను సొంతం చేసుకుంది భారత మహిళా ఖోఖో జట్టు. అలా ప్రియాంక ఇంగ్లే తన జట్టుతో పాటు చరిత్రలో నిలిచిపోయింది.

ఇంతకాలం క్రికెట్‌కు క్రేజ్ ఉండేది. ఆ తర్వాత కబడ్డీ రంగం మీదకు వచ్చింది. ఇప్పుడు ఖోఖో. ఈ ఆటకు ఒలింపిక్స్‌లో చోటు దక్కితే ఒలింపిక్స్ మెడల్ సాధించడమే తమ లక్ష్యం అంటున్నారు ప్రియాంక ఇంగ్లే. చూడబోతే అదేం పెద్ద విషయం కానట్టుంది.

వీధి ఆట

పుణెలో రైతు కుటుంబంలో జన్మించిన ప్రియాంక తన స్కూల్లో ఐదో ఏట ఖోఖోలో చేరింది. అయితే తల్లిదండ్రులు పెద్దగా ఎంకరేజ్ చేయలేదు. 'ఇది వీధి ఆట. బస్తీల్లో ఆడే ఆట. ఈ ఆటతో ఏం ప్రయోజనం' అన్నారు. అయితే 8వ తరగతి వచ్చేసరికి నేషనల్స్‌కు ఆడటం మొదలుపెట్టింది. మెడల్స్ కూడా సాధించ సాగింది. అప్పుడు తల్లిదండ్రులు మనమ్మాయి బాగా ఆడుతోందని ప్రోత్సహించారు. ప్రియాంక ఇప్పటికి 23 నేషనల్ టైటిల్స్ గెలిచింది. నాల్గవ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. అయినప్పటికీ ఆమె కెప్టెన్ అవుతానని ఊహించలేదు. వరల్డ్ కప్ 2025 పోటీలు జనవరి 13 నుంచి మొదలవనుండగా 11వ తేదీన, రెండురోజుల ముందు ఆమెను కెప్టెన్‌గా అనౌన్స్ చేశారు. 'మట్టి మీద ఆడే ఆట నుంచి మ్యాట్ మీద ఆడే ఆట వరకూ ఎదిగిన ఖోఖోలో నేనూ సభ్యురాలు కాగలిగినందుకు గర్వించాను' అంటుంది ప్రియాంక.

బరువైన ట్రోఫీ

వరల్డ్ కప్ ప్రారంభమైనప్పటి నుంచి వేదిక మీద ఉంచిన ట్రోఫీని మహిళాజట్టు సభ్యులందరూ తాకి చూశారు. 'అది చాలా బరువున్న ట్రోఫీ. దానిని పట్టుకుని ఫొటో దిగడం సాధ్యం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను' అంటుంది ప్రియాంక. వరల్డ్ కప్ కోసం నెల రోజుల పాటు సాగిన క్యాంప్‌లో కోచ్‌లు 15 మంది గట్టి ప్లేయర్లను తీర్చిదిద్దారు. డిఫెండర్స్, అటాకర్స్, వజీర్స్ అనే మూడు కేటగిరీల్లో ఆటగాళ్లు తర్ఫీదు అవుతారు. ప్రియాంక ఆల్‌రౌండర్. 'ఫైనల్స్‌లో నేపాల్ వస్తుందని మాకు తెలుసు. ఫస్ట్ హాఫ్‌లో వారిని తట్టుకోవడం కొంచెం కష్టమైంది. అయితే సెకండ్ హాఫ్‌లో మేము స్ట్రాటజీ మార్చి గెలిచాం. మా జట్టులో యంగ్ ప్లేయర్ల దూకుడు తగ్గిస్తూ అనుభవంతో ఆడుతూ ఈ గెలుపు సాధించాను' అంది ప్రియాంక.

ఎం.కామ్ చేసి గవర్నమెంట్ టాక్స్ విభాగంలో ఉద్యోగం చేస్తోంది ప్రియాంక. 'ఖోఖో ఆటగాళ్లకు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తున్నాయి. సాయం కూడా అందుతోంది. రోజులు బాగున్నాయి. మా మహారాష్ట్రలో ఖోఖో బాగా ఆడతాం. మా రాష్ట్రానికి నేను సరైన ట్రోఫీనే అందించాను' అని పొంగిపోయింది ప్రియాంక.



ట్రోఫీతో...

● ఫస్ట్ టైమ్

రాగాల పల్లకిలో రాష్ట్రపతి చెంతకు...



ఝార్ఖండ్‌కు చెందిన ఈ పాతిక మందిలో ఎక్కువ మంది ఆదివాసీ అమ్మాయిలే. ఎవరూ ఎప్పుడూ ఢిల్లీకి వెళ్లలేదు. వీరికి ఢిల్లీకి వెళ్లే అవకాశం రావడమే కాదు రిపబ్లిక్ డే వేడుకలలో పాల్గొని, రాష్ట్రపతి ముందు పైపర్ బ్యాండ్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చే అపూర్వ అవకాశం వచ్చింది.

కర్తవ్యపథ్ దగ్గర ప్రదర్శన ఇవ్వడానికి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మూడు పాఠశాలల్లో ఝార్ఖండ్‌లోని సింగ్‌భమ్ జిల్లా 'కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయ' ఒకటి. ట్యూన్స్ వాయించడంలో కచ్చితత్వం, ఏకరూపత కారణంగా ఈ పైపర్ బ్యాండ్ ఎంపికైంది. రాష్ట్రపతి ముందు ప్రదర్శన ఇవ్వబోతున్న ఈ గర్ల్ బ్యాండ్ ఉత్సాహంగా ఉంది.

'ఇది చాలా గొప్ప అవకాశం. జీవితంలో ఎప్పుడూ మరచిపోలేని అవకాశం' అంటుంది బ్యాండ్ సభ్యులలో ఒకరైన పార్వతి మహతో.

● మన(సు)లో మాట

మా నాన్నని ఒరిజినల్ కాదు... అంటోంది మా అమ్మ!

మా అమ్మ వయస్సు 45 సంవత్సరాలు. గత రెండేళ్ళ నుంచి వింతగా ప్రవర్తిస్తోంది. మా నాన్నను పట్టుకొని నువ్వు అసలు భర్తవి కాదు, భర్త రూపంలో వచ్చిన డూప్లికేట్ అని సతాయిస్తోంది. మేమెంత నచ్చచెప్పినా, తన వాదన మార్చుకోవడం లేదు. తన భర్త కాదనే వాదనతో ఆయనతో సఖ్యంగా ఉండటం లేదు. వేరే గదిలో పడుకుంటోంది. ఈ ఒక్క విషయం తప్ప మిగతా ఆమె ప్రవర్తన అంతా మామూలుగానే ఉంటుంది. వంటపని, ఇంటిపని బాగానే చేస్తుంది. బంధువులు ఇంటికొచ్చినా వారిని బాగానే చూస్తుంది. కాని వారందరితో మా నాన్నను, తన భర్త కాదనే చెప్పడం వల్ల మా అందరికీ చాలా అవమానంగా ఉంది. మరి ఆమె కావాలనే అలా మాట్లాడుతోందా లేక మా నాన్న గారిపై ఇష్టం లేక అలా చెబుతుందో మాకర్థం కావడం లేదు. ఏం చేయాలో తెలియక, మీరేదైనా పరిష్కారం చూపిస్తారనే ఆశతో రాస్తున్నాను.

– **రమ్య**, ఆదోని

ఇది మీ అందరికీ క్లిష్ట సమస్యే! కుటుంబ పరువు ప్రతిష్టలకు కూడా సంబంధించిన విషయం. అయితే ఒక్క విషయం. మీ అమ్మగారు కావాలని మాత్రం అలా మాట్లాడటం లేదు. మీ నాన్నగారిపై అయిష్టతతోనో, ప్రేమ లేకపోవడం వల్లో కూడా కాదు. ఇది ఒక అరుదైన వింత మానసిక వ్యాధి. మానసిక వైద్య శాస్త్రంలో దీనిని 'కేప్ గ్రాస్ సిండ్రోమ్' అంటారు. దీనినే 'డిల్యూజన్ ఆఫ్ ది డబుల్స్' అని కూడా అంటారు. ఒరిజినల్ వ్యక్తి రూపంలో ఇంకొక వ్యక్తి మారువేషంలో వచ్చాడని భ్రమించి, అందుకు తగ్గట్టుగా ప్రవర్తించడమే ఈ వింత మానసిక వ్యాధి లక్షణం. విఠలాచార్య జానపద సినిమాల్లో లాగా అనిపించే ఈ వింత అనుభవం, మెదడులోని కొన్ని అసాధారణ రసాయనిక చర్యల వల్ల వచ్చే అవకాశముందని తెలిస్తే, చాలా మందికి ఆశ్చర్యంగా అనిపించొచ్చు. కొన్నాళ్ళు పోతే మీ నాన్ననే కాదు, మిమ్మల్ని కూడా డూప్లికేట్ అన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మీరన్నట్లు ఆ ఒక్క విషయంలో తప్ప, మిగతా అన్ని విషయాల్లో వారి ప్రవర్తన అంతా నార్మల్‌గానే ఉంటుంది. అందుచేత ఇది మానసిక వ్యాధి అన్న అనుమానం ఎవరికీ రాదు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మీ అమ్మగారిని వెంటనే దగ్గర్లోని సైకియాట్రిస్ట్‌కు చూపించి తగిన వైద్యం చేయిస్తే ఆమె భ్రమలు, భ్రాంతులు పూర్తిగా తొలగి మీ నాన్నను మునుపటిలాగే తన భర్తగా భావించి మునుపటి స్థితికి వస్తుంది. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బ్యూటిప్

అరకప్పు స్ట్రాబెర్రీ గుజ్జులో కోడిగుడ్డు తెల్లసొన రెండు చెంచాలు, ఒక చెంచాడు నిమ్మరసం, రెండు చెంచాల తేనె కలపాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తుంటే జిడ్డు తగ్గిపోయి ముఖం మిలమిలలాడుతుంది.



● గార్డెనింగ్ టిప్



ఆవాలను నీళ్లతో కలిపి మెత్తగా నూరి గులాబీ మొక్కల మొదళ్లలో వేస్తే... మొక్కలకు పురుగు పట్టదు.



ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్... అగ్రస్థానంలోనే బుమ్రా

దుబాయ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన బుమ్రా తాజా ర్యాంకింగ్స్‌లో 908 పాయింట్లతో 'టాప్' ప్లేస్‌ను మరింత పదిలం చేసుకున్నాడు. భారత్ తరఫున ఒక బౌలర్ సాధించిన అత్యధిక రేటింగ్ పాయింట్లు ఇవే కావడం విశేషం. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (841 పాయింట్లు), దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబడ (837 పాయింట్లు) ఈ జాబితాలో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా (400 పాయింట్లు) కూడా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



వరుణ్ చక్రవర్తి

ఆరంభం అదిరింది

టి20 వరల్డ్ చాంపియన్ భారత్ మరోసారి తమ స్థాయికి తగ్గ ఆటతో అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఏకపక్షంగా సాగిన పోరులో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. కట్టుదిట్టమైన పేస్, స్పిన్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన టీమిండియా... ఆపై దూకుడైన బ్యాటింగ్‌తో మరో 43 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. భారీ బ్యాటింగ్ బలగం ఉన్న ఇంగ్లండ్ కనీస స్థాయి ప్రదర్శన కూడా ఇవ్వలేక చేతులెత్తేసింది. అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌తో పాటు అభిషేక్ శర్మ మెరుపు ప్రదర్శన భారత జట్టును ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిపాయి. రెండో టి20 మ్యాచ్ శనివారం చెన్నైలో జరుగుతుంది.



వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్ క్లీన్ బౌల్డ్

కోల్‌కతా: ఇంగ్లండ్‌తో మొదలైన టి20 సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేసింది. బుధవారం జరిగిన తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. జోస్ బట్లర్ (44 బంతుల్లో 68; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. వరుణ్ చక్రవర్తికి 3 వికెట్లు దక్కగా...అర్ష్‌దీప్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 12.5 ఓవర్లలో 3 వికెట్లకు 133 పరుగులు సాధించి గెలిచింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 79; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగి జట్టును గెలిపించాడు.

భారత బౌలర్ల జోరు...

లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ పదునైన బంతులతో ఆరంభంలోనే ఇంగ్లండ్‌ను దెబ్బ తీశాడు. తొలి ఓవర్లో ఫిల్ సాల్ట్ (0)ను అవుట్ చేసిన అతను, తన రెండో ఓవర్లో డకెట్ (4)ను వెనక్కి పంపించాడు. బట్లర్, బ్రూక్ (17) కలిసి కొద్దిసేపు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. పాండ్యా ఓవర్లో నాలుగు ఫోర్లతో బట్లర్ దూకుడు ప్రదర్శించాడు. అయితే ఆ తర్వాత వరుణ్ చక్రవర్తి స్పిన్‌కు ఇంగ్లండ్ కుదేలైంది. ఒకే ఓవర్లో అతను బ్రూక్, లివింగ్‌స్టోన్ (0)లను డగౌట్‌కు పంపించాడు. అనంతరం ఒక ఎండ్‌లో ఇంగ్లండ్ వరుసగా వికెట్లు కోల్పోగా... బట్లర్ ఒక్కడే పోరాడగలిగాడు. 34 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. ఆపై పాండ్యా, అక్షర్ మెరుగైన బౌలింగ్‌కు తోడు చక్కటి ఫీల్డింగ్ కారణంగా ఇంగ్లండ్ 26 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు చేజార్చుకుంది.

మెరుపు బ్యాటింగ్...

అట్కిన్సన్ వేసిన రెండో ఓవర్లో సంజు సామ్సన్ (20 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో వరుసగా 4, 4, 0, 6, 4, 4 బాదిన అతను 22 పరుగులు రాబట్టాడు. అయితే ఒకే ఓవర్లో సామ్సన్, సూర్యకుమార్ (0)లను అవుట్ చేసి ఆర్చర్ దెబ్బ తీశాడు. వుడ్ ఓవర్లో అభిషేక్ 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టడంతో పవర్‌ప్లేలో భారత్ 63 పరుగులు చేసింది. ఆ తర్వాత 29 పరుగుల వద్ద ఆదిల్ రషీద్ రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన అభిషేక్ తర్వాతి మూడు బంతుల్లో వరుసగా 4, 6, 6 బాదాడు. ఆపై మరో సిక్స్‌తో 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాతా దూకుడుగా ఆడిన అభిషేక్ భారత విజయానికి 8 పరుగుల దూరంలో అవుటయ్యాడు.

షమీకు నో చాన్స్!

ఫిట్‌నెస్ నిరూపించుకొని దాదాపు 14 నెలల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన సీనియర్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి ఇంకా మ్యాచ్ ఆడే అవకాశం మాత్రం రాలేదు. ఇంగ్లండ్‌తో తొలి టి20 కోసం ప్రకటించిన టీమ్‌లో అనూహ్యంగా అతనికి చోటు దక్కలేదు. దీనికి మేనేజ్‌మెంట్ ఎలాంటి కారణం చెప్పలేదు. జట్టు కూర్పులో భాగంగా అతడిని పక్కన పెట్టారా లేక పూర్తిగా కోలుకోలేదా అనే విషయంపై స్పష్టత లేదు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 0; డకెట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4; బట్లర్ (సి) నితీశ్ రెడ్డి (బి) వరుణ్ 68; బ్రూక్ (బి) వరుణ్ 17; లివింగ్‌స్టోన్ (బి) వరుణ్ 0; బెతెల్ (సి) అభిషేక్ (బి) పాండ్యా 7; ఒవర్టన్ (సి) నితీశ్ రెడ్డి (బి) అక్షర్ 2; అట్కిన్‌సన్ (స్టంప్డ్) సామ్సన్ (బి) అక్షర్ 2; ఆర్చర్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 12; రషీద్ (నాటౌట్) 8; వుడ్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 132. వికెట్ల పతనం:** 1–0, 2–17, 3–65, 4–65, 5–83, 6–95, 7–103, 8–109, 9–130, 10–132. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–17–2, హార్దిక్ పాండ్యా 4–0–42–2, వరుణ్ చక్రవర్తి 4–0–23–3, అక్షర్ పటేల్ 4–1–22–2, రవి బిష్ణోయ్ 4–0–22–0.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) అట్కిన్సన్ (బి) ఆర్చర్ 26; అభిషేక్ శర్మ (సి) బ్రూక్ (బి) రషీద్ 79; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 0; తిలక్‌వర్మ (నాటౌట్) 19; పాండ్యా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (12.5 ఓవర్లలో 3 వికెట్లకు) 133. **వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–125. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4–0–21–2, అట్కిన్సన్ 2–0–38–0, మార్క్ వుడ్ 2.5–0–25–0, రషీద్ 2–0–27–1, ఒవర్టన్ 1–0–10–0, లివింగ్‌స్టోన్ 1–0–7–0.

తొలి టి20లో భారత్ ఘన విజయం

- 7 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు
- చెలరేగిన అభిషేక్ శర్మ
- 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి
- రాణించిన అర్ష్‌దీప్, అక్షర్, పాండ్యా
- శనివారం చెన్నైలో రెండో టి20

97 అంతర్జాతీయ టి20ల్లో అర్ష్‌దీప్ సింగ్ వికెట్ల సంఖ్య. భారత్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాడిగా అతను నిలిచాడు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న యుజువేంద్ర చహల్ (96)ను అర్ష్‌దీప్ అధిగమించాడు.



అభిషేక్ శర్మ

సెమీస్‌లో స్వియాటెక్



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్టార్ ప్లేయర్లు ఇగా స్వియాటెక్ (పోలాండ్), యానిక్ సినెర్ (ఇటలీ) తమ దూకుడు కొనసాగిస్తున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ స్వియాటెక్ వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ వరుస సెట్‌లలో నెగ్గగా... పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్ కూడా వరుస సెట్‌లలో తన ప్రత్యర్థిని చిత్తు చేశాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6–1, 6–2తో ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)పై గెలిచింది. 89 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ కేవలం మూడు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. నవారో సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన స్వియాటెక్ 22 విన్నర్స్ కొట్టింది. మరో క్వార్టర్ ఫైనల్లో 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 3–6, 6–3, 6–4తో స్వితోలినా (ఉక్రెయిన్)ను ఓడించి మూడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో బదోసా (స్పెయిన్)తో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్); కీస్‌తో స్వియాటెక్ తలపడతారు.

షెల్టన్ తొలిసారి...

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ యానిక్ సినెర్ టైటిల్ నిలబెట్టుకునే దిశగా మరో అడుగు వేయగా... అమెరికా రైజింగ్ స్టార్ బెన్ షెల్టన్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6–3, 6–2, 6–1తో ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై... షెల్టన్ 6–4, 7–5, 4–6, 7–6 (7/4)తో లొరెంజో సొనెగో (ఇటలీ)పై గెలుపొందారు. డిమినార్‌తో 1 గంట 48 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో సినెర్‌కు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. 27 విన్నర్స్ కొట్టిన సినెర్... ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● వీల్ చైర్‌లో రష్మిక



క్యూటీ... గెట్ వెల్ సూన్

''జిమ్‌లో కాలికి గాయమైంది. ఇంకొన్ని వారాలు షూటింగ్స్‌కి బ్రేక్ ఇచ్చాను. 'సికందర్, థామా, కుబేర' చిత్రదర్శకులకు సారీ'' అని పది రోజుల క్రితం సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు రష్మికా మందన్నా. ఇంటి పట్టునే బెడ్ రెస్ట్‌లో ఉన్న ఆమె బుధవారం ముంబై వెళ్లడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. ముఖానికి మాస్క్ పెట్టుకున్న రష్మిక కారు దిగి, కుంటుకుంటూ నాలుగైదు అడుగులు వేసి, వీల్ చైర్‌లో ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లారు. ఇంత కష్టపడుతూ రష్మిక ఎందుకు ప్రయాణం చేశారంటే... తాను కథానాయికగా నటించిన హిందీ చిత్రం 'ఛావా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వెళ్లడానికి. ఈ ఈవెంట్‌లోనూ ఆమె నడవడానికి ఇబ్బందిపడుతుంటే 'ఛావా' చిత్రకథానాయకుడు విక్కీ కౌశల్ సపోర్ట్ చేశారు. ఇక ఎయిర్‌పోర్టు వీడియో, ఈ వేడుక వీడియో రెండూ వైరల్‌గా మారాయి. దాంతో రష్మిక ఫ్యాన్స్ క్యూటీ... గెట్ వెల్ సూన్ అని, మిమ్మల్ని ఇలా చూడలేకపోతున్నామనీ... ఇలా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు.

కాళీ వస్తున్నాడు



● విక్రమ్

విక్రమ్ హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఈ సినిమాలో ఆయన ఓ కిరాణా కొట్టు యజమాని. పేరు కాళీ. మంచి ఫ్యామిలీ మేన్. అయితే ఒక భయంకరమైన క్రైమ్ నెట్‌వర్క్‌తో ఈ కాళీకి సంబంధం ఉంటుంది. మరి... కాళీ సీక్రెట్ మిషన్ ఏంటి? అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందిందని సమాచారం. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషారా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం మార్చి 27న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ విడుదల చేయనుంది. ''పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

చలో కారైకుడి



● ప్రభాస్

హీరో ప్రభాస్ తమిళనాడుకు వెళ్లారట. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' అనే పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఇమాన్వీ ఎస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలో తమిళనాడులో ప్రారంభం కానుందని తెలిసింది. కారైకుడి, మధురై లొకేషన్స్‌లో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట. ఇక ఈ సినిమాలో ఓ బ్రాహ్మణ యువకుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని, సినిమాలో దేవీపురం అనే బ్యాక్‌డ్రాప్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.

యాక్షన్... కామెడీ



● విశాల్

విశాల్ హీరోగా సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన 'మదగజరాజా' చిత్రం జనవరి 12న తమిళంలో రిలీజ్ అయింది. ఈ చిత్రానికి మంచి స్పందన లభించిందని యూనిట్ పేర్కొంది. కాగా ఈ నెల 31న సత్య కృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. ''విశాల్ పవర్‌ఫుల్ యాక్షన్, సంతానం కామెడీ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్'' అని యూనిట్ పేర్కొంది. ఇక 'మదగజరాజ' పన్నెండేళ్ల క్రితమే రూపొందింది. కానీ రిలీజ్ కాలేదు. చివరికి తమిళంలో ఈ పొంగల్‌కి రిలీజైంది.

ఆ విషయంలో నేను శ్రీమంతుడిని
– అనిల్ రావిపూడి



''దర్శకుడిగా బ్లాక్‌బస్టర్ మూవీ తీయాలనే నా కలని తొలి సినిమా 'పటాస్'తోనే నెరవేర్చుకోగలిగాను. నా బలం ఏంటో విశ్లేషించుకుంటూ, నా గత చిత్రాల ప్రభావం ప్రస్తుత మూవీస్‌పై పడకుండా జాగ్రత్త పడుతూ, ఆడియన్స్‌కు దగ్గరయ్యేలా కథ రాసుకోవడమే నా సక్సెస్ సీక్రెట్'' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. 'పటాస్, ఎఫ్ 2, రాజా ది గ్రేట్, సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం' వంటి సినిమాలతో అగ్ర దర్శకుల్లో ఒకరిగా రాణిస్తున్నారు అనిల్ రావిపూడి. దర్శకుడిగా ఆయన జర్నీకి నేటి (జనవరి 23)తో పదేళ్లు. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో అనిల్ రావిపూడి చెప్పిన విశేషాలు.

● నా పదేళ్ల కెరీర్‌లో నేను చేసిన ప్రతి సినిమా ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. ప్రతి సినిమాకు ఒకొక్క మెట్టు ఎక్కించి, ఫైనల్‌గా ఈ పొంగల్‌కి 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో ఆడియన్స్ నాకు అద్భుతమైన విజయాన్ని అందించారు. ఆడియన్స్ నుంచి నాకు లభించిన ప్రేమే నా ఆస్తి. ఆ విషయంలో నేను శ్రీమంతుడిని. ఇక నా కెరీర్‌లోనే 'సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లో రూ. 100 కోట్ల షేర్, వన్ వీక్‌లో రూ. 200 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి హిస్టరీ క్రియేట్ చేసింది. ఫ్యామిలీ మూవీస్‌కి ఈ బలం ఉందని 'సంక్రాంతికి వస్తున్నాం'తో ఆడియన్స్ స్ట్రాంగ్‌గా స్టేట్మెంట్ ఇచ్చారనిపిస్తోంది.

● 'పటాస్'కు ముందు దర్శకుడ్ని కావడానికి నేను ఎక్కని కాంపౌండ్ లేదు. చాలామంది హీరోలను కలిశాను. నన్ను నమ్మి, కల్యాణ్ రామ్‌గారు చాన్స్ ఇచ్చారు. అందుకే నా సక్సెస్ క్రెడిట్ ఆయనకే దక్కుతుంది.

● దర్శకులు ఈవీవీగారితో కొందరు నన్ను పోల్చడాన్ని బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. గొప్ప బాధ్యత కూడా. జంధ్యాలగారి సినిమాలంటే చాలా ఇష్టం. ఆయన నాకో స్ఫూర్తి. వెంకటేశ్, బాలకృష్ణగార్లతో సినిమాలు చేశాను. చిరంజీవిగారితో నెక్స్ట్ మూవీ చేయబోతున్నాను. నాగార్జునగారితో 'హలో బ్రదర్' లాంటి మూవీ చేయాలని ఉంది.

బ్యాడ్ బాయ్



● నాగశౌర్య

నేను బ్యాడ్ బాయ్ అంటున్నారు నాగశౌర్య. వెండితెరపై బ్యాడ్ బాయ్ కార్తీక్‌గా కనిపించనున్నారు ఈ హీరో. నాగశౌర్య పుట్టినరోజు (జనవరి 22) సందర్భంగా ఈ తాజా చిత్రం టైటిల్‌ని ప్రకటించి, లుక్‌ని రిలీజ్ చేశారు. 'బ్యాడ్ బాయ్ కార్తీక్' టైటిల్‌తో రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వంలో శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''ఇది యాక్షన్ ప్యాక్డ్ మూవీ. షూటింగ్ దాదాపు పూర్తి కావస్తోంది'' అని చిత్రబృందం పేర్కొంది. నాగశౌర్య సరసన విధి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సముద్ర ఖని, వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్, శ్రీదేవీ విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమేరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జయరాజ్.

బెదిరింపులకు భయపడలేదు
– గూడూరు నారాయణ రెడ్డి



● నారాయణ రెడ్డి, ఇంద్రజ, సత్యనారాయణ, నాగ మహేశ్

బాబీ సింహా, వేదిక, అనిష్కా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది మార్చి 15న విడుదలైంది. ఈ నెల 24 నుంచి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. బుధవారం విలేకరుల సమావేశంలో ఇంద్రజ మాట్లాడుతూ– ''ఈ మూవీలో చాకలి ఐలమ్మ పాత్ర చేయడానికి ఆమె చరిత్ర తెలుసుకున్నాను'' అన్నారు. ''18 ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు అప్లై చేస్తే, 15 ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు మా మూవీ ఎంపికైంది. ఎన్నో అవార్డులు వచ్చాయి'' అని చెప్పారు యాటా సత్యనారాయణ. ''ఈ సినిమా నిర్మించే క్రమంలో నన్ను, నా కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించినా భయపడలేదు. డబ్బు, ఎంటర్‌టైన్మెంట్ కోసం సినిమాలు చేస్తుంటారు. కానీ మేం 'రజాకార్'ని ఓ బాధ్యతతో చేశాం'' అని తెలిపారు గూడూరు నారాయణ రెడ్డి.

నా పదేళ్ల కెరీర్‌లో సుబ్బు నా ఫేవరెట్
– అనుపమా పరమేశ్వరన్

అనుపమా పరమేశ్వరన్, సంగీత, దర్శనా రాజేంద్రన్ లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'పరదా'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను డిజిటల్‌గా రిలీజ్ చేశారు దుల్కర్ సల్మాన్. హైదరాబాద్‌లో జరిగిన 'పరదా' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ– ''నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అవుతుంది. ఈ పదేళ్లలో నా మోస్ట్ ఫేవరెట్ మూవీ 'పరదా', ఫేవరెట్ క్యారెక్టర్ సుబ్బు'' అన్నారు. ''ఈ సినిమాలోని మ్యాజిక్ ఆడియన్స్‌కి నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అని చెప్పారు దర్శన. ''ఇలాంటి గొప్ప కథ రాసిన డైరెక్టర్‌కు థ్యాంక్స్'' అని పేర్కొన్నారు సంగీత. ''ఉమెన్ ఒరియంటెడ్ సినిమాలకు బిగ్ ఓపెనింగ్స్ వచ్చేలా ఈ మూవీ ఉంటుంది'' అని పేర్కొన్నారు ప్రవీణ్. ''ఈ సినిమా మలయాళం రైట్స్‌ను దుల్కర్ సల్మాన్ తీసుకున్నారు'' అన్నారు విజయ్ డొంకాడ. ''ఉత్తరాంధ్ర నుంచి ఓ నిర్మాత వచ్చి ఈ మూవీ చేయడం చాలా సంతోషంగా ఉంది. మహిళా సాధికారత ఉన్న ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. ''ఈ సినిమా తీయడం మాకు 'బాహుబలి'లాంటి ప్రయత్నం'' అని స్పష్టం చేశారు శ్రీధర్.



● అనుపమ, దర్శన, సంగీత

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	567	76,405
నిఫ్టీ ▲	131	23,155

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	20,046	▲ 289
డోజోన్స్	44,127	▲ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,545	▽ 3
డాక్స్	21,254	▲ 212
షాంఘై	3,214	▽ 29
నికాయ్	39,646	▲ 618

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	80,194	▲ 741
బంగారం (22 క్యారెట్)	79,873	▲ 738
వెండి (కిలో)	91,248	▲ 715

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఈ	85.90	86.92
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఈ	104.90	107.76
€	యూరో	ఎన్‌ఈ	88.54	91.16
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఈ	55.11	56.49
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఈ	52.98	55.18
S$	సింగపూర్ డాలర్	ఎన్‌ఈ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	22.19	23.74
¥	చైనా యువాన్	ఫారెక్స్	11.01	12.83

పసిడి రికార్డు @ రూ.82,730



న్యూఢిల్లీ: పసిడి ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో కొత్త రికార్డు సృష్టించింది. పూర్తి స్వచ్ఛత (99.9) 10 గ్రాముల ధర రూ.630 ఎగసి రూ.82,700కు ఎగసింది. ఇక 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.82,330కి చేరింది. అంతర్జాతీయ పటిష్ట ట్రేడింగ్ ధోరణులకు తోడు దేశీయంగా ఆభరణాల వర్తకులు, రిటైలర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు, డాలర్ మారకంలో రూపాయి బలహీన ధోరణి పసిడికి కలిసి వస్తున్న అంశమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. వరుసగా ఆరు రోజుల నుంచి పసిడి ర్యాలీ కొనసాగుతోంది. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాల్లో ఇంకా అస్పష్టత కొనసాగుతుండడంతో ఇన్వెస్టర్లు అత్యుత్తమ పెట్టుబడి మార్గంగా తక్షణం పసిడివైపు చూస్తుండడం ఈ యెల్లో మెటల్ విలువ అంతర్జాతీయ పెరుగుదలకు కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ న్యూఢిల్లీలో 99.9, 99.5 స్వచ్ఛత రికార్డు ధరలు వరుసగా రూ.82,400, రూ.82,000గా (2024 అక్టోబర్ 31) ఉన్నాయి.

వేతన జీవులను కనికరించేనా?



- బడ్జెట్‌లో ఆదాయపన్ను తగ్గింపుపై ఆశలు
- పరిశ్రమ వర్గాలు, నిపుణుల సానుకూల సూచనలు

న్యూఢిల్లీ: బడ్జెట్ 2025పై మధ్య తరగతి, వేతన వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. ఆదాయపన్ను ఉపశమనం లభిస్తుందన్న అంచనాలతో ఉన్నాయి. పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు, ఆర్థికవేత్తలు సైతం పన్ను తగ్గించడం ద్వారా ప్రజల చేతుల్లో ఆదాయం మిగిలించొచ్చని, ఇది మందగించిన వినియోగానికి ప్రేరణనిస్తుందని ఆర్థిక మంత్రికి సూచించడం గమనార్హం. దీంతో వ్యక్తిగత ఆదాయపన్ను పరంగా కొంత ఉపశమనం కల్పించొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఇదే కనుక నిజమైతే అది వినియోగానికి ఊతమిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని పెంచొచ్చని, పన్ను శ్లాబుల్లో సర్దుబాట్లు చేయొచ్చని, స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. వీటికితోడు పన్ను నిబంధనల్లో మార్పుల ద్వారా పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గించొచ్చని భావిస్తున్నారు.

అంచనాలు ఇలా..

- నూతన పన్ను విధానంలో బేసిక్ పన్ను మినహాయింపు ఆదాయ పరిమితి రూ.3లక్షలు. రూ.3–7 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను అమల్లో ఉంది. రానున్న బడ్జెట్‌లో ఈ బేసిక్ మినహాయింపును రూ.5లక్షలకు పెంచొచ్చని తెలుస్తోంది. అప్పుడు రూ.3–7 లక్షల శ్లాబు కాస్తా రూ.5–7 లక్షలుగా మారుతుంది. దీంతో మొత్తం మీద రూ.10,000 మేర పన్ను ఆదా అవుతుంది.
- 7–10 లక్షల ఆదాయంపై 10% పన్ను ప్రస్తుతం అమల్లో ఉంది. అలాగే, రూ.10–12 లక్షల ఆదాయంపై 15 శాతం పన్ను అమలవుతోంది. వీటిల్లో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు.
- రూ.12–15 లక్షల ఆదాయంపై 20 శాతం పన్ను ప్రస్తుతం అమలవుతోంది. బడ్జెట్‌లో దీన్ని రూ.12–18 లక్షలకు సవరించొచ్చని భావిస్తున్నారు. 30 శాతం పన్నును రూ.18లక్షలకుపైన ఆదాయం ఉన్న వారికి వర్తింపచేసే అవకాశం ఉంది. ఇది ఆచరణలోకి వస్తే రూ.18లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి రూ.3లక్షల ఆదాయంపై 30 శాతం రూపంలో సుమారు రూ.90వేల వరకు ఆదా అవుతుంది.
- రూ.18 లక్షలకు పైన ఆదాయం కలిగిన వారికి ఎలాంటి ఊరట ఉండకపోవచ్చు.
- నూతన పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000గా ఉంది. దీన్ని రూ.1,00,000కు పెంచొచ్చని తెలుస్తోంది. నిజానికి రూ.50,000గా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను గత బడ్జెట్‌లో రూ.75,000కు పెంచారు. మొత్తం ఆదాయంలో దీన్ని నేరుగా మినహాయించుకోవచ్చు. పాత విధానంలో ఇది కేవలం రూ.50,000గానే కొనసాగుతోంది. 72 శాతం మంది కొత్త విధానంలోనే పన్ను రిటర్నులు సమర్పించారు. పెద్దగా పన్ను మినహాయింపుల్లేని, సరళతర నూతన పన్ను విధానంలోకి క్రమేణా అందరినీ తీసుకురావడం కేంద్రం లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. కనుక మరిన్ని పన్ను ప్రయోజనాలు కొత్త విధానంలో కల్పించడానికే ఆర్థిక మంత్రి పరిమితం కావచ్చు.



ఆకర్షణీయంగా కొత్త పన్ను విధానం!



మరింత మందిని ఇందులోకి తీసుకురావడంపై దృష్టి	30 శాతం పన్ను శ్లాబులోనూ మార్పు: రూ.90,000 వరకు ఆదా
5 % పన్ను శ్లాబులో మార్పు: రూ.10,000 వరకు ఆదా	

- రూ.2.5 లక్షలు మించిన పీఎఫ్ వడ్డీపై టీడీఎస్‌ను, ఉపసంహరణ వరకు వాయిదా వేసే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇ-సాప్‌లను విక్రయించినప్పుడే పన్ను చెల్లించేలా అనుమతించాలని, ఎన్‌ఆర్‌ఐల ఇల్లు విక్రయంపై టీడీఎస్ నుంచి మినహాయింపులు కల్పించాలన్న డిమాండ్లు సైతం ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం 16,736 కోట్లు



- క్యూ3లో 2 శాతం వృద్ధి
- స్వల్పంగా పెరిగిన మొండిబకాయిలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం 2% నామమాత్ర వృద్ధితో రూ. 16,736 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 16,373 కోట్లు ఆర్జించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 17,258 కోట్ల నుంచి రూ. 17,657 కోట్లకు స్వల్పంగా బలపడింది. రుణ వృద్ధి నెమ్మదించడం ప్రభావం చూపింది. అయితే మొత్తం ఆదాయం రూ. 1,15,016 కోట్ల నుంచి రూ. 1,12,194 కోట్లకు క్షీణించింది.

వడ్డీ ఆదాయం ప్లస్...

ప్రస్తుత సమీక్షా కాలంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 30,650 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 3 శాతం వృద్ధితో రూ. 11,450 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 3.43 శాతం వద్ద నిలకడను చూపాయి. ఆస్తుల (రుణాల) నాణ్యత విషయానికివస్తే తాజా స్లిప్పేజీలు రూ. 6,400 కోట్లుగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 1.26 శాతం నుంచి 1.42 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.31 శాతం నుంచి 0.46 శాతానికి ఎగశాయి. అనుబంధ సంస్థలలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 470 కోట్లను తాకగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 410 కోట్లు, అసెట్ మేనేజ్‌మెంట్ రూ. 640 కోట్లు, సెక్యూరిటీస్ రూ. 270 కోట్లు చొప్పున లాభాలు ఆర్జించాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.4 శాతం లాభంతో రూ. 1,665 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో మెల్ట్‌వాటర్ ఏఐ హబ్

Meltwater

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మీడియా ఇంటెలిజెన్స్ సేవల సంస్థ మెల్ట్‌వాటర్.. హైదరాబాద్‌లో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా 50 ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీకి భారత్‌లో ఇది నాలుగో కార్యాలయం కాగా అంతర్జాతీయ స్థాయిలో రెండో ఆర్ అండ్‌డీ కేంద్రం. ఇది తమకు ఏఐ (కృత్రిమ మేధ) హబ్‌గా ఉంటుందని కంపెనీ వివరించింది. మూడు నెలల వ్యవధిలో 20 మంది పైగా సిబ్బందిని నియమించుకోగా, తొలి త్రైమాసికంలో దీన్ని రెట్టింపు చేసుకోనున్నామని సంస్థ సీటీవో ఆదిత్య జామి పేర్కొన్నారు.

హెచ్‌యూఎల్ లాభం అప్



- క్యూ3లో రూ. 2,989 కోట్లు
- ఐస్‌క్రీమ్ బిజినెస్ విడదీత
- మినిమలిస్ట్ బ్రాండ్ కొనుగోలు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 19 శాతం పైగా ఎగసి రూ. 2,989 కోట్లకు చేరింది. ప్యూరిట్ బిజినెస్ విక్రయం ఇందుకు సహకరించింది. రూ. 507 కోట్ల అనూహ్య లబ్ధి లభించిందిది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ. 2,508 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 15,781 కోట్ల నుంచి రూ. 16,050 కోట్లకు బలపడింది.

1:1 నిష్పత్తిలో క్వాలిటీ వాల్స్ షేర్లు

క్వాలిటీ వాల్స్(ఇండియా) పేరుతో ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను విడదీసేందుకు బోర్డు అనుమతించింది. దీంతో హెచ్‌యూఎల్ వాటాదారులకు ప్రతి 1 షేరుకి 1 క్వాలిటీ వాల్స్ షేరు లభిస్తుంది. బ్యూటీ ప్రీమియం బ్రాండ్ మినిమలిస్ట్ సంస్థ అప్ రైజింగ్ సైన్స్‌లో 90.5% వాటా కొనుగోలు చేయనున్నట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. ఇందుకు రూ. 2,955 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో రూ.2,670 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపింది.

బీఎస్‌ఈలో హెచ్‌యూఎల్ షేరు నామమాత్ర లాభంతో రూ. 2,343 వద్ద ముగిసింది.

చివర్లో కొనుగోళ్లు

బ్యాంకులు, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: ట్రేడింగ్ చివర్లో లభించిన కొనుగోళ్ల అండతో దేశీయ స్టాక్ సూచీలు బుధవారం పుంజుకున్నాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 567 పాయింట్లు పెరిగి 76,405 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 131 పాయింట్లు బలపడి 23,155 వద్ద నిలిచింది. స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా స్వల్ప శ్రేణిలో ట్రేడయ్యాయి. మిడ్ సెషన్‌లో తర్వాత లాభాలు కోల్పోయాయి. అయితే ఆఖరి గంటలో అనూహ్యంగా కీలక రంగ షేర్లకు దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 625 పాయింట్లు ఎగసి 76,463 వద్ద, నిఫ్టీ 144 పాయింట్లు దూసుకెళ్లి 23,169 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1.56%, 1.25 శాతం నష్టపోయాయి.

- రంగాల వారీగా ఐటీ ఇండెక్స్ అత్యధికంగా 2.19%, ప్రైవేటు బ్యాంకుల సూచీ 1.50% లాభపడ్డాయి. మరోవైపు రియల్టీ ఇండెక్స్ 4.53% క్షీణించింది.

23 పైసలు పెరిగిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలపడి 86.35 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ పుంజుకోవడం, అమెరికా కరెన్సీ డాలర్ స్వల్పంగా బలహీనపడటం కలిసొచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

అమెరికాతో వాణిజ్య బంధం పటిష్టం: కార్పొరేట్లు	11 కోట్లకు ఎన్‌ఎస్‌ఈ ఇన్వెస్టర్లు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మే 25న సివిల్స్ ప్రిలిమ్స్

» 979 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్
» మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఐఏఎస్(ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్), ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారిన్ సర్వీస్), ఐపీఎస్ (ఇండియన్ పోలీస్ సర్వీస్) తదితర 23 ఉన్నత స్థాయి సర్వీసుల్లో 979 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షకు జనవరి 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను మే 25న నిర్వహించనున్నారు. దీంతోపాటు యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీసులో 150 పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి కూడా దరఖాస్తులకు చివరి తేది ఫిబ్రవరి 11.

అర్హతలు

- సివిల్స్ ప్రిలిమ్స్‌కు దరఖాస్తులు చేసుకోవాలనుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2025, ఆగస్టు 1వ తేదీ నాటికి 21–32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు మూడంచెల విధానంలో అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. తొలి దశలో ఆబ్జెక్టివ్ తరహాలో మొత్తం 400 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో 200 మార్కులకు చొప్పున రెండు ఆబ్జెక్టివ్ పేపర్లు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన వారిని మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామ్

రెండో దశ మెయిన్ పరీక్ష పూర్తిగా వ్యాపరూప విధానం (డిస్క్రిప్టివ్)లో నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్‌తోపాటు ఒక స్థానిక భాష పరీక్ష 300 మార్కులకు చొప్పున ఉంటాయి. ఇవి అర్హత పరీక్షలు మాత్రమే. వీటి మార్కులను తుది ర్యాంకింగ్‌లో పరిగణనలోకి తీసుకోరు. వీటితోపాటు ఒక ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, ఒక ఆప్షనల్ సబ్జెక్టుపై రెండు పేపర్లు 250 మార్కులకు చొప్పున మొత్తం 1750 మార్కులకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో సత్తాచాటిన అభ్యర్థులను ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275. ఇలా మొత్తం 2025 మార్కులకు అభ్యర్థులు సాధించిన మార్కులను, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి తుది విజేతలను ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 22.01.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 11.02.2025
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 25.05.2025
- వెబ్‌సైట్: https://upsconline.gov.in/upsc/OTRP/,https://www.upsc.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ)-2025 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తుంది.

» అర్హత: ఇంటర్, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష
» పరీక్ష తేది: 27.04.2025.
» పరీక్ష కేంద్రాలు: దేశంలోని ప్రధాన నగరాల్లో పరీక్ష జరుగుతుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.02.2025
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nta.ac.in

అడ్వాన్స్‌డ్.. సన్నద్ధత ఇలా!

జేఈఈ-అడ్వాన్స్‌డ్.. ఐఐటీల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్, బ్యాచిలర్-మాస్టర్స్ డ్యుయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! నిర్వాహక ఇన్‌స్టిట్యూట్.. ఐఐటీ-కాన్పూర్ జేఈఈ-అడ్వాన్స్‌డ్ -2025 తేదీలను ఖరారు చేసింది. మే 18న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారంతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్-2025కు దరఖాస్తుకు అర్హత నిబంధనలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు...

» మే 18న జేఈఈ-అడ్వాన్స్‌డ్
» మూడు అటెంప్ట్‌ల అవకాశం లేనట్లే
» 2024, 2025లో ఇంటర్ ఉత్తీర్ణులే అర్హులు
» రెండు పేపర్లుగా జేఈఈ-అడ్వాన్స్‌డ్
» 23 ఐఐటీ క్యాంపస్‌లలో మొత్తం 17,760 సీట్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్ తేదీలు కూడా ఖరారయ్యాయి. అర్హత నిబంధనలు గతంలో మాదిరిగానే ఉన్నాయి. పరీక్ష విధానం సైతం గతంలో మాదిరిగానే ఉండొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచి పూర్తి అంకితభావంతో ప్రిపరేషన్ సాగిస్తే బెస్ట్ పర్సంటైల్ సాధించేందుకు అవకాశం ఉంటుంది.

మూడు అటెంప్ట్‌ల నిర్ణయం వెనక్కి

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎప్పటి మాదిరిగా రెండు అటెంప్ట్‌ల విధానాన్నే కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీంతో 2024లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన వారు, అదే విధంగా 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభించనుంది.

2023లో ఇంటర్మీడియెట్ తత్సంబంధ కోర్సుల ఫలితాలు 2023 జూన్ 28 తర్వాత పొందిన వారికి మాత్రం జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025కు అర్హత కల్పించారు.

అర్హతలు

- 2024, 2025లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులు అక్టోబర్ 1, 2000 సంవత్సరం తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు అక్టోబర్ 1, 1995 తర్వాత జన్మించి ఉండాలి.

మొత్తం 2.5 లక్షల మంది

జేఈఈ మెయిన్‌లో స్కోర్ ఆధారంగా మొత్తం 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఓపెన్ కేటగిరీలో 1,01,250 మందికి, జనరల్ -ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 25 వేల మందికి, ఓబీసీ (ఎన్‌సీఎల్) కేటగిరీలో 67,500 మందికి, ఎస్సీ కేటగిరీలో 37,500 మందికి, ఎస్టీ కేటగిరీలో 18,750 మందికి మెయిన్స్ నుంచి అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభిస్తుంది.



పరీక్ష విధానం

- జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025పరీక్ష గతేడాది మాదిరిగానే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంటే.. రెండు పేపర్లుగా (పేపర్-1, పేపర్-2)గా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థుల కాంప్రహెన్షన్, రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. కొన్ని ప్రశ్నలకు సంబంధించి పొరపాటు సమాధానాలకు నెగిటివ్ మార్కుల నిబంధన ఉందని పేర్కొన్నారు.
- పేపర్-1ను 51 ప్రశ్నలతో 180 మార్కులకు, పేపర్-2ను కూడా 51 ప్రశ్నలతో 180 మార్కులకు నిర్వహించే అవకాశం ఉంది. వాస్తవానికి గత మూడేళ్లుగా ప్రశ్నల సంఖ్యలో మార్పులు జరగట్లేదు. దీంతో ఈసారి కూడా పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:2025, ఏప్రిల్23
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 2025, మే 2 వరకు
- ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2025, మే 5
- పరీక్ష తేదీ: 2025, మే 18(పేపర్-1 ఉదయం 9 నుంచి 12 వరకు; పేపర్-2 మధ్యాహ్నం 2:30 నుంచి 5 వరకు)
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jeeadv.ac.in

బెస్ట్ పర్సంటైల్‌కు.. బాట

సిలబస్‌పై పట్టు

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 అభ్యర్థులు.. ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ అంశాలను పూర్తిగా చదవాల్సిన ఆవశ్యకత నెలకొంది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతగా పేర్కొన్న జేఈఈ-మెయిన్‌లో పలు అంశాలను తొలగించారు. కానీ.. ఇవి జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో ఉంటాయి. విద్యార్థులు మెయిన్ సిలబస్‌తోపాటు అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిశీలించాలి. రెండింటిని అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

ప్రత్యేక సమయం

జేఈఈ-మెయిన్‌లో లేని.. అడ్వాన్స్‌డ్‌లో ఉన్న సిలబస్ అంశాలపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత మెయిన్‌కు అదనంగా ఉన్న అంశాల రివిజన్‌కు ప్రత్యేక సమయం కేటాయించాలి. అడ్వాన్స్‌డ్‌కు సిలబస్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగిస్తే.. ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం ఉంటుంది.

మ్యాథమెటిక్స్

పరీక్షలో ఎంతో కీలకంగా భావించే మ్యాథ్స్‌లో రాణించడానికి కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై ఫోకస్ చేయాలి. వీటితోపాటు 3-డి జామెట్రీ, కో ఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ అల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. ఆయా టాపిక్స్‌ను ప్రాక్టీస్ చేస్తూ ప్రిపరేషన్ సాగించాలి.

ఫిజిక్స్

న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ కూడా ఉండే ఈ విభాగంలో రాణించేందుకు ఎలక్ట్రో డైనమిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మో డైనమిక్స్‌పై దృష్టిపెట్టాలి. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన పెంచుకోవాలి.

కెమిస్ట్రీ

అభ్యర్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో మంచి మార్కుల కోసం కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్, ఆల్కహారల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌడ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్,ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ఆయా అంశాలపై కాన్సెప్ట్‌ల నుంచి వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసే వరకు సాధన చేయాలి. ఫలితంగా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్‌కు సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

బోర్డ్, మెయిన్‌తో సమన్వయం

- అభ్యర్థులు బోర్డ్ పరీక్షలు, జేఈఈ-మెయిన్ పరీక్షతో సమన్వయం చేసుకుంటూ అడ్వాన్స్‌డ్ దిశగా అడుగులు వేయాలి. మెయిన్ తొలి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ ఎగ్జామ్ అంశాలపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయి సమయం కేటాయించాలి. ఒకవేళ జేఈఈ-మెయిన్ రెండో సెషన్‌కు కూడా హాజరవుతుంటే.. అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.
- అడ్వాన్స్‌డ్‌కు ప్రిపరేషన్‌లో భాగంగా రివిజన్‌కు అధిక సమయం కేటాయించాలి.
- అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి.
- ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లకు హాజరవుతూ లోటుపాట్లు సరిదిద్దుకోవాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం



సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ కోర్సుల్లో ఇన్–సర్వీస్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఆరోగ్య విశ్వవిద్యాలయం వెబ్‌ఆప్షన్‌ల స్వీకరణ ప్రారంభించింది. బుధవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి ఆప్షన్‌ల నమోదుకు అవకాశం కల్పించింది. శుక్రవారం రాత్రి 9 గంటల వరకూ చివరి గడువు విధించింది. ఆప్షన్‌ల నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టైతే 9000780707, 8008250842 నంబర్‌లలో సంప్రదించాలని సూచించింది.

జైళ్ల శాఖలో డ్రైవర్ పోస్టులకు మార్చి 2న రాత పరీక్ష



సాక్షి, అమరావతి: జైళ్ల శాఖలో డ్రైవర్ పోస్టుల భర్తీకి మార్చి 2న రాత పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో నిర్వహించిన డ్రైవింగ్ పరీక్షలో అర్హత సాధించిన 311 మందికి ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, మూలపేటలోని ఏపీ స్టేట్ ట్రైనింగ్ అకాడమీ ఫర్ రిఫార్మేషన్ సర్వీసెస్ (ఏపీఎస్‌టీఏఆర్ఎస్) పాత సెంట్రల్ జైలు ఆవరణలో ఈ రాత పరీక్ష నిర్వహించాలని జైళ్ల శాఖ నిర్ణయించింది. ఎల్ఎంవీ అభ్యర్థులు ఉదయం 8గంటలకు, హెచ్ఎంవీ అభ్యర్థులు మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలి. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించరు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ http:/prisons.ap.gov.in సందర్శించాలని జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అన్ని పాఠశాలల్లో రిపబ్లిక్‌డే వేడుకలు

సాక్షి, అమరావతి: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ఉదయం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోను జాతీయ పతాకావిష్కరణ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు ఆదేశాలు జారీచేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రధానాధికారులు పతాకావిష్కరణ చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా మినహా మిగిలిన జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు పతాకావిష్కరణ చేస్తారని తెలిపారు. స్థానిక పాఠశాలలు, పంచాయతీ, మండల కార్యాలయాల్లోను జాతీయ పతాకావిష్కరణ చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం జాతీయగీతం ఆలపిస్తూ ప్రధాన వీధుల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాలని ఆయన సూచించారు.

మోగిన చావు మేళం.. తిరిగొచ్చిన ప్రాణం

- చనిపోయాడని దహన క్రియలకు ఏర్పాట్లు చేసిన కుటుంబ సభ్యులు
- అంతలోనే లేచి కూర్చున్న వృద్ధుడు
- శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం సీతంపేటలో ఘటన



మంచంపై కూర్చున్న అప్పారావు

జి.సిగడాం: ఎనభై ఏళ్ల ఆ వృద్ధుడు మరణించాడని భావించి కుటుంబ సభ్యులు శ్మశాన వాటికలో దహన క్రియలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చితి కోసం కర్రలు సిద్ధం చేశారు. ఇంటి వద్ద చావు మేళం మోగడం, భార్య విలపిస్తూ పైన పడటంతో వృద్ధుడు ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. దీంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. తాతకు మళ్లీ ప్రాణమొచ్చిందంటూ కుటుంబ సభ్యులు సంతోషించారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం సీతంపేట గ్రామంలో మంగళవారం జరగ్గా.. బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ధర్మవరపు అప్పారావు ఇటీవల అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో ఏ క్షణంలోనైనా మరణిస్తాడని, ఇంటికి తీసుకెళ్లిపోవాలని వైద్యులు కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం వృద్ధుడిని అంబులెన్స్‌లో తీసుకొని గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో పరిశీలించగా కదలికలు లేకపోవడంతో మరణించాడని భావించి వెంటనే దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులకు సమాచారం అందించారు. వృద్ధుడిని కిందకు దించి శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్నానం చేయించేందుకు నీరు, పండ్లు ఇతర సామగ్రి సిద్ధం చేశారు. అప్పారావు దేహంపై పడి భార్య విలపిస్తున్న సమయంలో కొద్దిగా కళ్లు తెరిచి కాళ్లు కదిపాడు. పావుగంట అయ్యాక మంచంపై లేచి కూర్చున్నాడు. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు.

అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు న్యాయం చేస్తా

ఎంఎం నాయక్

సాక్షి, అమరావతి: గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ హామీ ఇచ్చారు. బుధవారం బాధ్యతలు తీసుకున్న నాయక్‌ను ఆయా సంఘాల నేతలు కలిసి తమ సమస్యలు విన్నవించారు.

ఫిజిక్స్ సులభం.. మ్యాథ్స్ కొంత క్లిష్టత

- జేఈఈ–మెయిన్ తొలిరోజు పరీక్షలపై నిపుణుల విశ్లేషణ
- సుదీర్ఘంగా మ్యాథ్స్ ప్రశ్నలు.. రెండు సెషన్లలో ఇదే తీరు
- కెమిస్ట్రీలో కొన్ని సులభం.. కొన్ని ఓ మోస్తరు క్లిష్టత
- గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు



సాక్షి, ఎడ్యుకేషన్: జేఈఈ–మెయిన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రతిష్టాత్మక ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్లలో బీటెక్ చేసేందుకు, అదే విధంగా ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత పరీక్షగా ఎన్‌టీఏ ఏటా రెండుసార్లు దీనిని నిర్వహిస్తోంది. మొదటి దఫా పరీక్షకు జాతీయ స్థాయిలో 13.8 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో దాదాపు 2 లక్షల మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉంటారని అంచనా. 23, 24, 28, 29, 30 తేదీల్లో కూడా రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు.

300 మార్కులకు పరీక్ష

మూడు సబ్జెక్ట్‌లలో 300 మార్కులకు పరీక్ష నిర్వహించారు. మ్యాథమెటిక్స్ నుంచి 25, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 75 ప్రశ్నలతో ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహించారు. కాగా ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉందని, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, గత ప్రశ్న పత్రాలు సాధన చేసిన వారికి కొంత మేలు కలిగించేదిగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. రెండు సెషన్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడంతో కొందరు విద్యార్థులకు జవాబులిచ్చేందుకు సమయం సరిపోలేదు. ఫిజిక్స్ విభాగం ప్రశ్నలు సులభంగా, కెమిస్ట్రీలో కొన్ని సులభంగా, కొన్ని ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 50 శాతం ప్రశ్నలు చాలా సులభంగా ఉండడం విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. ఈ రెండు విభాగాల ప్రశ్నలకు అభ్యర్థులు 45 నిమిషాల చొప్పున సమయంలో జవాబులు ఇవ్వగలిగారు. అయితే మిగతా గంటన్నర సమయంలో మ్యాథమెటిక్స్‌లో 15 నుంచి 20 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వగలిగినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. ప్రశ్నలు చాలా సుదీర్ఘంగా ఉండడమే ఇందుకు కారణంగా సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే కెమిస్ట్రీ ప్రశ్నలు.

తొలిరోజు రెండు సెషన్లలోనూ ప్రశ్నలు జేఈఈ–మెయిన్ గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా అడిగారు. ముఖ్యంగా 2021, 2022 ప్రశ్నలకు సరిపోలే విధంగా చాలా ప్రశ్నలు ఉన్నట్లు నిపుణులు తెలిపారు. ఇక కెమిస్ట్రీలో అధిక శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే.. డైరెక్ట్ కొశ్చన్స్‌గా అడగడంతో ప్రాక్టీస్ చేసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఇన్–ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 30 శాతం ప్రశ్నలున్నాయి. కెమికల్ బాండింగ్, బయో మాలిక్యూల్స్, మోల్ కాన్సెప్ట్, కాటలిస్ట్స్, వేవ్ లెంగ్త్, ఎస్ఎంఆర్, పొటెన్షియల్ మీటర్, కెమికల్ ఈక్వేషన్ ఎనర్జీ, రేడియో యాక్టివ్ డికే, ఆర్గానిక్ కెమిస్ట్రీ (3 ప్రశ్నలు), కో ఆర్డినేట్ కాంపౌండ్, ఆక్సిడేషన్ స్టేట్‌ల నుంచి ప్రశ్నలు వచ్చాయి.

ఫిజిక్స్, మ్యాథ్స్‌లో ఇలా..

ఫిజిక్స్‌లో థర్మోడైనమిక్స్, ప్రాజెక్టైల్ మోషన్, ఎలక్ట్రిక్ సర్క్యూట్, డయోడ్స్, ఈఎం వేవ్స్, మోడ్రన్ ఫిజిక్స్, రే ఆప్టిక్స్, సెమీ కండక్టర్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఏసీ సర్క్యూట్, డైమెన్షనల్ ఫార్ములా, ఫోర్స్, మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా ఆఫ్ స్ఫియర్ నుంచి ప్రశ్నలు అడిగారు. మ్యాథ్స్‌లో స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, సింపుల్ ప్రాబ్లమ్, వెక్టార్, 3డి జామెట్రీ, షార్టెస్ట్ డిస్టెన్స్ ప్రాబ్లమ్, మాట్రిసెస్, డిటర్మినెంట్స్, బయనామియల్ థీమర్, ట్రిగ్నోమెట్రీ, క్వాడ్రాట్రిక్ ప్రాడక్ట్ ఆఫ్ ఆల్ సొల్యూషన్స్, సిరీస్, పారాబోలా, ఏరియా ఆఫ్ సర్కిల్, పెర్ముటేషన్, హైపర్‌బోలా, డిఫరెన్షియల్ ఈక్వేషన్, సర్కిల్ ఇంటర్‌సెక్టింగ్ ప్రాబ్లమ్స్ అడిగారు.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ నైపుణ్యాలే కీలకం

జేఈఈ–మెయిన్ పరీక్షలో రెండు సెషన్లలోనూ కాన్సెప్ట్స్, అప్లికేషన్స్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. వీటిపై పట్టు ఉన్న వారు సులభంగా సమాధానాలు ఇచ్చే విధంగా ప్రశ్నలు ఉన్నాయి. అదే విధంగా ఇంటర్మీడియెట్ స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు సాధన చేసిన వారు కూడా సులభంగానే సమాధానాలు గుర్తించే విధంగా ప్రశ్నలు అడిగారు. పూర్తి స్థాయిలో ప్రిపేర్ అయిన అభ్యర్థులు 280కు పైగా మార్కులు సాధించే అవకాశం ఉంది.

– ఎం.ఎన్.రావు (జేఈఈ శిక్షణ నిపుణులు)

అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనా ఇలా..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే.. జనరల్ కేటగిరీలో 91–92 మార్కులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 79–80, ఓబీసీ కేటగిరీలో 77–78, ఎస్సీ కేటగిరీలో 56–58, ఎస్టీ కేటగిరీలో 42–44 మార్కులు కటాఫ్‌గా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

కీచక ఉపాధ్యాయుడు అరెస్టు

- బాలికలతో అసభ్య ప్రవర్తన.. దేహశుద్ధికి గ్రామస్తుల యత్నం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు



ఉపాధ్యాయుడు లక్ష్మన్నను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు వక్రబుద్ధితో అసభ్యంగా ప్రవర్తించాడు. అతని వెకిలి చేష్టలను చెప్పుకోలేక విద్యార్థులు ఎంతో కుమిలిపోయారు. కొందరు బడి మానేసి తల్లిదండ్రుల వెంట పనుల్లోకి వెళ్లగా, మరికొందరు వేరే పాఠశాలలకు వెళ్లిపోయారు. తల్లిదండ్రులు చెప్పినా మార్పు రాకపోతే చివరికి పోలీసులు వచ్చి ఆ కీచక ఉపాధ్యాయుడ్ని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ..

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి ఎస్సీ కాలనీలో ఉన్న స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో లక్ష్మన్న అనే ఉపాధ్యాయుడు రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 60 మందికి పైగా ఉన్నారు. లక్ష్మన్న కొంతకాలంగా బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించసాగాడు. ఇతని తీరు తెలుసుకున్న కొందరు తల్లిదండ్రులు గతంలో ఓమారు హెచ్చరించారు. అయినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పురాలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పాఠశాలను చుట్టుముట్టారు. లక్ష్మన్నకు దేహశుద్ధి చేసేందుకు యత్నించగా, ఓ తరగతి గదిలోకి వెళ్లి దాక్కున్నాడు. సమాచారం అందుకున్న కోడుమూరు ఎంఈఓలు వసంతలక్ష్మి, తైమూర్ బాషా అక్కడికొచ్చి విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయుడిని విచారించారు. ఈ నేపథ్యంలో.. ఉపాధ్యాయుడిపై దాడి చేసేందుకు గ్రామస్తులు ఏకమవుతుండడంతో గూడూరు ఎస్ఐ తిమ్మయ్య తన సిబ్బందితో అక్కడికి వచ్చారు. లక్ష్మన్నను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధిత పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపారు. మరోవైపు.. లక్ష్మన్నను డీఈఓ శామ్యూల్ పాల్ సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే.. ఇతర మండలాల్లో పనిచేస్తూ విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు కోడుమూరు మండలంలో పోస్టింగ్‌లు ఇస్తుండడంపై గ్రామస్తులు, తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

'కూటమి' పాలనలో మహిళలకు రక్షణ లేదు

- భీమిలిలో మైనర్ బాలికలపై అత్యాచారాలు
- హోంమంత్రి సొంత జిల్లాలోనే మహిళా భద్రత శూన్యం
- మద్యం మత్తులోనే ఈ అఘాయిత్యాలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ కూటమి పాలనలో మహిళలకు భద్రత లేకుండాపోయిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆరోపించారు. భీమిలి నియోజకవర్గంలో ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, బెల్ట్‌షాప్‌లు, గంజాయి, కొకైన్ వంటి మాదకద్రవ్యాల లభ్యతతో అసాంఘిక శక్తులు ఈ దాడులకు తెగబడుతున్నాయని మండిపడ్డారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే..

రాష్ట్రంలో మహిళలకు రక్షణలేని పరిస్థితి ఉంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులకు ఎప్పుడేం జరుగుతుందోననే భయానక వాతావరణం ఉంది. ఇంత దారుణమైన పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదు. భీమిలి నియోజకవర్గంలో దివ్యాంగురాలైన బాలికపై మద్యం తాగిన దుండగుడు అత్యాచారానికి పాల్పడటం.. అదే ప్రాంతంలో మైనర్ బాలికను కారులో బలవంతంగా తీసుకెళ్లి దారుణంగా అత్యాచారం చేసిన సంఘటన.. అలాగే, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మరో వ్యక్తి మద్యం మత్తులో మహిళలపై దౌర్జన్యం.. కర్నూలు జిల్లా కోడుమూరు మండల ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలు మహిళల భద్రతకు అద్దంపడుతున్నాయి. మద్యం, మాదకద్రవ్యాల కారణంగానే ఈ దాడులు జరుగుతున్నందున వెంటనే బెల్ట్ షాపులన్నింటినీ తొలగించాలి. లేదంటే వాటిని మా మహిళలే ధ్వంసం చేస్తారు.

ఇసుక, మద్యం ఆదాయంపైనే దృష్టి..

ఇక హోంమంత్రి వంగలపూడి అనిత సొంత జిల్లా అనకాపల్లిలోని, యలమంచిలి ఏటికొప్పాకలో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగితే ఆమె స్పందించారా? రాంబిల్లిలో ఒక యువతిని సురేష్ అనే నిందితుడు కత్తితో పొడిచి చంపేసినా హోంమంత్రి ఆ కుటుంబాన్ని పరామర్శించలేదు. ప్రభుత్వ పెద్దలు ఎంతసేపు డైవర్షన్ రాజకీయాలు చేయడం, ఇసుక, మద్యం ఆదాయాన్ని పంచుకోవడంపైనే శ్రద్ధ కనబరుస్తున్నారు. గతంలో మా ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఇక గంజాయిని వంద రోజుల్లో అరికడతామని చెప్పిన హోంమంత్రి విశాఖ కేజీహెచ్‌లోనూ, విశాఖ జైలు ఆవరణలోనూ గంజాయిని పండిస్తుంటే ఏం చేస్తున్నారు? సాక్షాత్తూ సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలోనూ గంజాయి సాగు జరుగుతోంది.

చేపల పెంపకంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా, బాదంపూడిలోని దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి కే.ఎస్.వి. నాగలింగాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 5వ తరగతి ఆ పైన చదువుకుని, తెలుగులో చదవడం, రాయడం తెలిసి, 18–30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపిక కమిటీ ప్రత్యేక పరిగణనలో వయసు పరిమితిని సడలిస్తుందని తెలిపారు. మత్స్యశాఖ అధికారుల నుంచి పొందిన అనుభవ సర్టిఫికెట్లు దరఖాస్తుతో జతపరచాల్సి ఉంటుందన్నారు. కోస్తా జిల్లాలోని మత్స్యకారులు, యువకులు, జాలరులు, సహకార సంఘాల సభ్యులు చేపల పెంపకంలో ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఎలాంటి ఉపకార వేతనం ఉండదని తెలిపారు. 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఫిబ్రవరి 20న ఉదయం 11 గంటల నుంచి మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 19వ తేదీలోగా జిల్లా మత్స్యశాఖ అధికారి, ఏలూరు లేదా మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయానికి పంపాలన్నారు.

డీజీపీ పోస్టు కోసం | మూడు ముక్కలాట!

అక్రమ కేసులతో ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే ఎత్తుగడ





సాక్షి, అమరావతి: పోలీసు శాఖలో ఆధిపత్య పోరు పతాకస్థాయికి చేరుకుంటోంది. డీజీపీ పోస్టే లక్ష్యంగా మూడు ముక్కలాటతో పోలీసు వ్యవస్థ పూర్తిగా గాడి తప్పుతోంది. రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు బనాయించడమే కొలమానంగా ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు డీజీ స్థాయి ఐపీఎస్‌లు పోటీ పడుతుండటం విభ్రాంతి కలిగిస్తోంది. డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తన పదవీ కాలం పొడిగింపు కోసం చివరి ప్రయత్నాలు ముమ్మరం చేయగా... విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ పోలీస్ బాస్ పోస్టు కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. హరీశ్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్‌కుమార్ లడ్హా, కేంద్ర సర్వీసులో ఉన్న అమిత్ గర్గ్‌లతో కూడిన ఉత్తరాది లాబీ మంత్రి నారా లోకేశ్ అండదండలతో పోలీసు శాఖపై దీర్ఘకాలిక ఆధిపత్యం చలాయించేందుకు పావులు కదుపుతోంది. పోలీసు ఉన్నతాధికారుల అధికారిక లాలసను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పెద్దలు వారిని తమ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకుంటున్నారు.

దీర్ఘకాలిక పట్టుకు ఉత్తరాది లాబీ గూడుపుఠాణి

చంద్రబాబు, లోకేశ్‌ను 'అన్ని విధాలుగా' ప్రసన్నం చేసుకుని ఆధిపత్యం చలాయిస్తున్న ఉత్తరాది ఐపీఎస్ లాబీ దీర్ఘకాలిక వ్యూహానికి తెర తీయడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. సర్వం తానై రెడ్‌బుక్ వేధింపులు, పోలీసు వ్యవస్థను నడిపిస్తున్న ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్‌కుమార్ లడ్హా ఈ లాబీకి నేతృత్వం వహిస్తున్నారు. హరీశ్‌కుమార్ గుప్తాతోపాటు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీ అదనపు డైరెక్టర్‌గా ఉన్న అమిత్ గర్గ్ ఇందులో కీలక సభ్యులు. రానున్న నాలుగేళ్లపాటు పోలీసు శాఖపై పూర్తిగా తమ పట్టే ఉండాలన్నది ఆ లాబీ ఉద్దేశం. ఈ క్రమంలో ద్వారకా తిరుమలరావు రిటైరైన తరువాత హరీశ్ కుమార్ గుప్తాను డీజీపీగా చేయాలని పట్టుబడుతోంది. ఆ దిశగా ఇప్పటికే చాలా వరకు సఫలీకృతమైంది. ఆగస్టులో హరీశ్ కుమార్ గుప్తాకు పొడిగింపు ఇవ్వాలని... ఆ తరువాత ఆయన రిటైరయ్యాక అమిత్ గర్గ్‌ను డీజీపీగా చేయాలన్నది ఉత్తరాది లాబీ వ్యూహం. అనంతరం వచ్చే ఎన్నికల నాటికి మహేశ్ కుమార్ లడ్హా డీజీపీ కావాలన్నది ఎత్తుగడ. తద్వారా 2029 వరకు పోలీసు శాఖ పూర్తిగా తమ ఆధిపత్యంలోనే ఉండాలని హరీశ్ కుమార్ గుప్తా, అమిత్ గర్గ్, మహేశ్ కుమార్ లడ్హా పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే మహేశ్ కుమార్ లడ్హా ఏం చెప్పినా చంద్రబాబు సరే అంటున్నారు. ఇక లోకేశ్ పూర్తిగా హరీశ్ కుమార్‌గుప్తాకు అనుకూలంగా ఉన్నారు. దీంతో తాము అనుకున్నది సాధిస్తామని ఆ ముగ్గురు ఐపీఎస్‌లు పూర్తి ధీమాతో ఉన్నారు. ఆ ముగ్గురి లాబీయింగ్ ప్రస్తుతం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డీజీపీ పోస్టు కోసం ఆధిపత్య పోరుతో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతున్నా అటు ప్రభుత్వ తీరులోగానీ ఇటు ఐపీఎస్ అధికారుల వైఖరిలోగానీ ఏమాత్రం మార్పు రావడం లేదు.

ఏం చేయమన్నా చేసేస్తా...!

లోకేష్ అండతో గుప్తా జోరు

మంత్రి లోకేశ్ అండదండలే అర్హతగా విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా డీజీపీ పోస్టుకు గురి పెట్టారు. రెడ్‌బుక్ వేధింపులకు విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని సాధనంగా మార్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్న ప్రత్యర్థి పార్టీల నేతలు, ఇతరులపై విజిలెన్స్– ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా తప్పుడు నివేదికలు ఇప్పించుకోవడం.. వాటి ఆధారంగా ఏసీబీ, సీఐడీ కేసులు నమోదు చేస్తూ వేధిస్తుండటం అంతా పక్కా పన్నాగంతో సాగుతోంది. లోకేశ్ సహకారంతో హరీశ్ కుమార్ గుప్తాకు డీజీపీ పోస్టు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హోంశాఖ వర్గాలు చెబుతున్నాయి. 2014–19లో టీడీపీ హయాంలో గౌతం సవాంగ్‌ను డీజీపీగా నియమించాలని చంద్రబాబు భావించినప్పటికీ మంత్రి లోకేశ్‌ను 'తనదైన శైలిలో ప్రసన్నం' చేసుకుని ఆర్పీ ఠాకూర్ పోలీస్ బాస్ పోస్టును దక్కించుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. లోకేశ్ అండదండలు ఉన్నప్పటికీ హరీశ్ గుప్తా ఏమాత్రం ఉదాసీనతకు తావివ్వకుండా తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. తనకు డీజీపీగా అవకాశం ఇస్తే ప్రభుత్వ పెద్దలు ఏం చేయమన్నా సరే సంకోచించకుండా చేసేస్తానని హామీ ఇస్తున్నారు. మరోవైపు డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ డీజీ రవి శంకర్ అయ్యన్నార్‌లకు వ్యతిరేకంగా పలు ఆరోపణలు, ఇతర అంశాలను వివిధ మార్గాల్లో చంద్రబాబు, లోకేశ్‌కు చేరవేసేలా పావులు కదుపుతున్నారు.

రెడ్‌బుక్‌కు రాచబాట వేశా..

డీజీపీ ద్వారకా చివరి యత్నాలు

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో చంద్రబాబు ప్రభుత్వం సృష్టిస్తున్న అరాచకానికి మౌన ప్రేక్షకుడిగా సహకరిస్తున్నప్పటికీ డీజీపీ ద్వారకా తిరుమలరావుకు పదవీ కాలం పొడిగింపుపై ఎలాంటి హామీ లభించలేదని తెలుస్తోంది. ఆయన ఈ నెలాఖరుకు రిటైర్ కానుండటంతో తన పదవీకాలం పొడిగింపు కోసం చివరి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. చంద్రబాబు, లోకేశ్‌తో ఇటీవల విడివిడిగా సమావేశమై తన మనోగతాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. అయితే రెడ్‌బుక్ వేధింపులు, అక్రమ కేసులు తాము ఆశించినస్థాయిలో లేవని.. మరింత తీవ్రతరం చేయాలని ప్రభుత్వ పెద్దలు ఆయనకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఎంతగా అక్రమ కేసులు బనాయిస్తున్నా మరింత బరి తెగించాలని ప్రభుత్వ పెద్దలు పట్టుబడుతుండటాన్ని ఆయన కొందరు సీనియర్ ఐపీఎస్‌ల వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. ఇప్పటికే నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి పోలీసు వ్యవస్థ వ్యవహరిస్తోందని... ఇంకా దిగజారితే పోలీసు అధికారులు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన కొందరు డీజీ, అదనపు డీజీ స్థాయి అధికారుల వద్ద వ్యాఖ్యానించడం గమనార్హం. తద్వారా టీడీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల కోసం పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని పరోక్షంగా వెల్లడించారు. అంతే కాదు.. పోలీసు అధికారులు ఇలాంటి వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించినట్టిందని పోలీసు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

బాబుపై కేసులు నీరుగార్చడమే అర్హతగా..

రవిశంకర్ అయ్యన్నార్

సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ డీజీపీ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబుపై ఉన్న అవినీతి కేసులను నీరు గార్చాలని స్పష్టమైన ఆదేశాలతోనే ఆయన్ను సీఐడీ చీఫ్‌గా ప్రభుత్వ పెద్దలు నియమించారు. అందువల్లే గతంలో చంద్రబాబు అవినీతిని బట్టబయలు చేస్తూ సీఆర్‌పీసీ 164 వాంగ్మూలాలు ఇచ్చిన అధికారులను బెదిరించి తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేసే ప్రక్రియను సీఐడీ వేగవంతం చేస్తోంది. గతంలో సిట్‌లో పని చేసిన కింది స్థాయి అధికారులను బెదిరించి వారి ద్వారా చంద్రబాబుపై ఉన్న కేసులను నీరుగార్చే కార్యాచరణ చేపట్టింది. వీటిని ప్రస్తావిస్తూ రవిశంకర్ అయ్యన్నార్ డీజీపీ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ద్వారకా తిరుమలరావు రిటైరైన తరువాత తననే డీజీపీగా నియమించాలని కోరుతున్నారు. అయితే లోకేశ్ ఇప్పటికే గుప్తాను డీజీపీగా నియమించాలని నిర్ణయించినట్లు తెలియడంతో రవిశంకర్ అయ్యన్నార్ రెండో ఆప్షన్ కూడా రెడీ చేసుకున్నారు. హరీశ్‌కుమార్ గుప్తా ఆగస్టులో రిటైరైన తరువాత తనకు డీజీపీగా అవకాశం ఇస్తామనే హామీ తీసుకోవాలని భావిస్తున్నారు. కానీ అందుకు చంద్రబాబు, లోకేశ్ నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు లభించకపోవడంతో ఆయన కాస్త కలవరపడుతున్నట్టు తెలుస్తోంది.

బిస్కెట్లు చాక్లెట్లు ఆశచూపించి.. ఎనిమిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

శ్రీకాకుళం జిల్లాలో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం: బిస్కెట్లు, చాక్లెట్లు ఆశ చూపించి ముక్కుపచ్చలారని ఎనిమిదేళ్ల చిన్నారికి మాయమాటలు చెప్పి ఓ కామాంధుడు లైంగిక దాడికి తెగబడ్డాడు. ప్రభుత్వ సచివాలయం భవనంపైకి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద గూనపాలెంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో బుధవారం మీడియాకు ఈ సంఘటన వివరాలు వెల్లడించారు. వివరాలివీ..

భోగి పండుగ నాడు అఘాయిత్యం..

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం.. బంటుపల్లిలో నాలుగో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల చిన్నారి ఈనెల 13న భోగి పండుగ రోజు తోటి పిల్లలతో ఆడుకుంటుండగా.. అదే గ్రామానికి చెందిన నారు ప్రసాద్ (23) ఆమెను గమనించాడు. చిన్నారిని పక్కకు పిలిచి బిస్కెట్లు, చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి కొనిచ్చాడు. వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ సచివాలయం భవనంపైకి తీసుకెళ్లి అత్యంత జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తించాడు. అనంతరం.. తోటి చిన్నారులు జరిగిన విషయాన్ని బాలిక సోదరుడికి ఆ రోజే చెప్పారు. బాలికకు తల్లి లేకపోవడం, తండ్రి ఉద్యోగం నిమిత్తం వెళ్లిపోవడం.. పండుగ హడావిడి కావడంతో కుటుంబీకులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఈనెల 19న చిన్నారి మూత్రం వెళ్లేటప్పుడు తీవ్రంగా నొప్పిరావడంతో వరుసకు పిన్ని అయిన నాగమణి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. దీంతో ఈనెల 20న వారు జేఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వివేకానంద దర్యాప్తు ప్రారంభించారు. ప్రసాద్ నిందితుడని తేలడంతో 21న పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, నమ్మి ఎవరి వద్దా విడిచిపెట్టరాదని సూచించారు. చిన్నారులపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో వంటి కఠిన సెక్షన్లతో జైలు జీవితం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం

అగనంపూడి(విశాఖ): బ్యాంక్ పనిమీద వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన ఘటన బుధవారం విశాఖ జిల్లా అగనంపూడి టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం గడిసింగుపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొర్లె మన్మథరావు (41), అరుణకుమారి (34) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం విశాఖ వచ్చారు. పరవాడలోని మైలాన్ కంపెనీలో మన్మథరావు వెల్డర్‌గా చేరాడు. అగనంపూడి నిర్వాసితకాలనీ కర్రివానిపాలెంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడు పది రోజుల క్రితం మైలాన్ కంపెనీ నుంచి బయో కామ్ ఫార్మా కంపెనీకి మారాడు. బుధవారం ఉదయం 10.20 గంటల సమయంలో గాజువాకలోని బ్యాంక్‌కు వెళ్లేందుకు భార్యాభర్తలు ఇంటినుంచి బైక్‌పై బయల్దేరారు. అగనంపూడి టోల్‌గేటు సమీపంలో శివాజీనగర్ ఎదురుగా జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ లారీ వెనుక చక్రాల కింద పడిపోయారు. ఇద్దరి తలలపై నుంచి లారీ చక్రాలు ఎక్కేయడంతో అక్కడికక్కడే మరణించారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943